
Regd. No. H. 373


ఆంధ్రప్రదేశ్

సంపుటి 5 సంచిక 9


జూలై, 1961

ఆషాఢ-శ్రావణ 1883 శకము





ఆరోగ్య- వైద్య శాఖా మంత్రి శ్రీ పి. వి. జి. రాజు 2-6-61 న హైదరాబాదులో భారతీయ వైద్య కేంద్ర సంఘం ద్వితీయ వార్షిక సమావేశాన్ని ప్రారంభించారు.



అరకులోయ బహూళార్థ సాధక ప్రాజెక్టు క్రింద గన్నెల గ్రామంలో గిరిజనుల పిల్లలకై యేర్పాటయిన ప్రాథమిక పాఠశాల.

ఆంధ్రప్రదేశ్

సంపుటి 5 | జూలై 1961 | సంచిక 9
ఆషాఢ శ్రావణ, 1883 శకము

విషయసూచిక

ముఖ చిత్రము : శ్రీశైలంలో పాతాళగంగస్నాన ఘట్టం.

వెనుక అట్ట : సమాచార పౌరసంబంధముల శాఖ యేర్పాటుచేసిన సినిమా ప్రదర్శనను తిలకిస్తున్న నల్గొండ జిల్లా చౌటుప్పల్ గ్రామస్థులు.

చందా వివరాలు

సంవత్సరానికి	—	3 రూపాయలు
విడి ప్రతి వెల	—	25 నయా పైసలు

Edited & Published by the Director of Information & Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Vir Milap Press, Mukarramjahi Road, Hyderabad-1

కోనసీమ

పోచిరాజు శేషగిరిరావు.

ఇంపు నింపెడు నారి కేళంపు తోట
కలియుగము నందనారామ కల్పకమ్మొ
కృషికలోకమ్ము గుండియ కీలకమ్మొ
సిరుల నందించు లక్ష్మి మా సీమకడియ

2

మా 'కళారాష్ట్ర' మంత్రి సమ్మాన్యుఁడతఁడు
దేశ దేశాలలో వెల్గె దిట్టయతఁడు
కావ్యముల దిద్దు పెద్ద యుగంధరుండు
చక్రమును ద్రిప్పె తెల్గు దేశమ్మునందు.

3

విమలతరమ్ముగా విపుల విస్తృత గౌతమి నీరమెల్లెడన్
సుముఖము సుప్రసన్నమయి సుందర నందన వాటి కాపురుల్
ప్రముఖముగా చిగుర్చునటు పారు సువారత — కోనసీమకున్
సమమగు నేల తెల్గుల వనమ్మునఁ దోఁచు ప్రేక్షణీయమై

4

స్వాదువై చారువై సస్యసంపన్నమై
చేలమ్ములూర్చు వసిష్ఠ యొకఁడు
మోదమై మోక్షమై ముద్దుగాఁ బ్రవహించు
కమ్మని వైనతేయమ్మొకండు
దాతయై దాదియై తన సంతతిన్ బ్రోచు
ధర్మ సంవృద్ధ గౌతమి యొకండు
తేటయై పాటయై పూటపూటను బాఱు
సారమై కౌశికా నీరమొకఁడు

పాఱుటయు కాదు కాల్వలై పాయపాయ
నీరమననేల? పీయూష ధారగాక
సర్వ సంపన్నతా శేష సారకళిక
అదియె చవులు చిప్పిల్లెడు నమృతగుళిక.

5

సాంద్ర సాహిత్య సస్య కేదారసీమ
వేద విద్యల కాణాచి విబుధ వాటి
ప్రథిత గీర్వాణ భాషా విరాజితమ్ము
లౌకికమ్ముల పంట పఱంతి యదియ.

6

రాజాధిరాజుల రతన కంబము లేమొ!
కదళీ కదంబమ్ము క్రాలుచట
గీర్వాణ మిథునమ్ము కేళికోద్యానమో!
నారికేళచయంపు నందనవని
పాటలాధరల ముప్పేట హారము లేమొ!
పోఁక క్రముఁకుల గెలల్ పొలుపు మీఱ
అప్సరోంగనల విహార స్థలంబేమొ!
గున్న మామిడితోపు కొమరు మిగుల
సోమ పీథులు సేవించు సోమరసమొ!
పనస తొలల లోపలి తేనె వాక యూట
మధుర మధు రసాల ఫలాలు — విధురులకును
మోద మురలించు రుచుల సమ్మోహకముగ.

7

ఆయత కీర్తి తేజుఁడు - మహాంధ్ర పథమ్మున రాజరాజు - వి
శ్వాయత చారుశీలి - బుధవర్గము నూతన కల్పకమ్ము - నా
రాయణ భట్ట పండితు కరమ్ముల మంచిన యగ్రహార మీ
ఛాయలలోనిదే యది ప్రశస్తము 'నందమపూండి' నేటికిన్.

8

'పల్వెల' వారకాంత విభవమ్ములఁ జూడ నెపమ్మునన్, విశా
సుల్విని మెచ్చుకొందురని, సోమకళాధరు నూడిగమ్ము లా
నల్వ సృజించు చేడియల నాడెపు పోడుములన్ వెలార్చ గా
థల్విని వచ్చియుండును ప్రథానకమై కవితా సనాథుఁడున్.

9

పండితరాయ లీవిపుల భారతవర్షములోని పండితా
ఖండలులన్ జయించి, రస ఖండములైన కృతుల్ రచించి, భూ
మండల మెల్ల స్వీయరస మంజుల వాద మలంకృతమ్ముగా
నిండఁగఁ జేసినాఁడు రసనిర్ఝరిణిన్ 'మునిఖండ' వాటికిన్.

10

ధీయుత శేముషీ విభవ దీధితులన్ ప్రసరించి, శాస్త్ర వి
ద్యాయుతుఁడీ ప్రదేశమునఁ దన్మయతన్ హరిభక్త పాంథ పా
థేయముఁగా నదించెను శ్రుతిస్మృతి సార తరంగపాళి, నా
రాయణ తీర్థు లిచ్చటనె రమ్యరణన్మృదు గాత్రవల్లకిన్.

11

ఒకత్రేవ 'మురమళ్ళ' — ఉల్లోల వారాశి
    నంటుచు నిత్య కళ్యాణరుచుల
ఒక పజ్జ పంచసోమ కళాధరుల్ నిల్చి
    కైలాస మరచేత గానుపింత్రు
ఒకప్రక్క శోభిల్లు నుజ్జ్వలోజ్జ్వలము "నం
    తర్వేది" నరసింహ ధామ మెపుడు
ఒకవంక క్షణమున్న నురుతర మోక్షమ్ము
    నిచ్చు నిప్పటికి ముక్తీశ్వరుండు

ఒక్కశిల పార్వతీపతి చక్కదనము:
దివ్యమోహన కాంతి దేదీప్యమాన
బంధురమ్ముగ జగదంబ వరలు నందె
దేవ వాసమ్ముగా నిది తేప దనరు.

12

తెలుఁగు రాష్ట్రమ్మునకుఁ గ్రొత్త జిలుగు వెలుఁగు
ప్రియత మాంధ్రికి వేనవి విడిదిపట్టు
గౌతమీ తీరదేశమ్ము కండపట్టు
తేనె లూరెడు భూమి! మా కోనసీమ!

ధరణికోట దుర్గము నేలిన కాకతీయ గణపతిదేవ చక్రవర్తి కొమార్తె

కోట గణపమ్మ

(క్రీ. శ. పదుమూడవ శతాబ్దము)

కోన వేంకటరాయ శర్మ

షట్సహస్రావనికి రాజధాని ధరణికోట. ఇది క్రీస్తు శకారంభమునకు ముందువెనుకల నన్నూఱేండ్లు పరిపాలించిన యాంధ్ర సాతవాహనులకు రాజధానియై వఱలెను. కృష్ణానదికి దక్షిణమునఁ గల దేశమునే షట్సహస్రావని యని యందురు. అనఁగా నిప్పటి సత్తెనపల్లె- గుంటూరు తాలూకాలును, నరసరావుపేఁట- బాపట్ల తాలూకాల యందలి "బొడ్డల యేఱు" వఱకును గల భూభాగము కొంతయుఁ,గలసి షట్సహస్రావని దేశమని పూర్వము నుండియుఁ బిలువఁబడుచుండెను, ఈ భూభాగమునే యార్వేల నాఁడనియెదరు.

క్రీస్తు శకము పదునొకండవ శతాబ్దమునకుఁ బూర్వము తెలుఁగు దేశములోని దేశ విభాగమునకు "విషయ" మనియు, "నాఁడు" అనియు, "రాష్ట్ర" మనియు,- సమానార్థకములుగా నుండుచుఁ గ్రీస్తు శకము పదునాలుగు పదేను శతాబ్దముల నుండి "రాష్ట్ర" మనునది "నాఁడు" "విషయము"ల కంటె నధిక వైశాల్యము గల ప్రదేశమునకుఁ బ్రయుక్త మగుచ వచ్చినది.

"తుంగభద్రా తరంగిణ్యాః
ప్రాగ్దేశం వెలనాడితి"

అనఁగాఁ, దుంగభద్రా నదికిఁ బ్రాగ్భాగము నందున్న దేశము "వెలనాఁడు" అని యర్థము. ఈ దేశమునే యార్వేల నాఁడని యందురు. పూర్వ సంప్రదాయము ననుసరించి దేశ విభాగము లయిన విషయములకును, నాఁడులకును, నేదో కొంత సంఖ్యను జేర్చి చెప్పుచుండుట పరిపాటియైనది.

పూర్వ మొకప్పుడు వెలనాఁడు "ఆర్వేల దేశము"గా నొప్పె ననియు,నవల నార్వేల 300 దేశము,గా రూపొందె ననియుఁ,- దెలియనగుచున్నది. రెండవ గోంక భూరమణుని శ్రీకాకొలము శాసనములో నతఁడు "వేంగీవిషయ షోడశ సహస్రావనీ వల్లభ" యని కీర్తింపఁబడియుండెను.

కళ్యాణి విశాంపతియైన పశ్చిమ చాళుక్యుఁడు త్రిభువన మల్ల భూపతి కాలములో వేంగి విషయము 14 వేల దేశమని తెలుపుచున్నది. "యనమల కుదురు- వేంగి" శాసనమున అయ్యప్ప ప్రధాని ముత్తాత గోంక ధరణిపుఁడు "వేంగి సహస్ర క్ష్మాధీశఁ" అని యభివర్ణింపపడియెను. తూర్పు చళుక్య ప్రభువగు రెండవ అమ్మరాజు కాలమున "తాండేరు" గ్రామమును దానము సేయు సమయమ్మున రాష్ట్రకూట ప్రముఖుల నుద్దేశించి చెప్పుచు "వేంగి సహస్ర రాష్ట్రకూట ప్రముఖాన్" అని పల్కుటను జూడఁగాఁ, గ్రీస్తు శకము పదియవ శతాబ్దము వచ్చు నప్పటికి వేంగి సహస్ర దేశముగాఁ బరిణమించెనని విదిత మౌచున్నది.

ఇయ్యాధారముల ననుసరించి ప్రథమ కుళోత్తుంగుని నాఁటికి "వేంగి పురవిషయ గ్రామ సహస్ర మస్య విద్దమాధిపత్య"మ్మను

నట్లు, రెండవ రాజరాజు తన కూరిమి మిత్త్రుండును ముఖ్యోద్యోగియునగు ముమ్మడి భీమునకుఁ బండ్రెండు గ్రామముల బహూకరించెనని తెలుపుచున్నది. ఇదిగాక కాల నిర్ణయము లేని "ద్రాక్షారమ" శాసనము కుళోత్తుంగుని నుండి వేయి గ్రామాలు గల వేంగిని కోన పోతఁడు సంపాదించెనని తెలుపుచున్నది.

బౌద్ధ తాంత్రిక దేవతల నుపాసించిన యెడల సర్వాభీష్ట సిద్ధి కలుగునని బౌద్ధుల విశ్వాసము. నాగార్జునుఁడు నాగలోకము నకుఁ జని బౌద్ధ తాంత్రిక దేవతలకుఁ సంబంధించిన యంత్రములను "కోట"లో నెలకొల్పినట్లు తిబెత్తు (Tibet) నందలి బౌద్ధ గ్రంథములు వాకొనుచున్నవి. కావుటం జేసియే యీ గ్రామము నకు "ధారణీల కోట" యను పేరేర్పడియె ననియు ఆ పేరే కాలచక్ర పరిభ్రమణము ననుసరించి జన వ్యవహారమున "ధరణాల కోట", "ధరణి కోట"యైన దనియు, నా యాప్త మిత్త్రులు, సహ చరిత్ర పరిశోధకులు, చరిత్ర రచనా ధురీణ, విమర్శక శిరోమణులు, శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారనుచున్నారు.

క్రీస్తు శకారంభ కాలములో "ధనకటకము" సాతవాహన చక్రవర్తులకును, ఇక్ష్వాక ధరణీపులకును,— రాజధానిగను, బౌద్ధ ధర్మ సంప్రదాయ ప్రాబల్యమునకు నునికిపట్టుగను,— నుండి ప్రాక్తనమున వైభవ శ్రీల ననుభవించిన పట్టనము. దక్షిణా పథమున మహాసామ్రాజ్యము నెలకొల్పి ప్రాక్పశ్చిమ సముద్రముల దాఁకఁ తమ యధికార బలదర్పములఁ గొనసాఁగించిన సాతవాహన చక్రవర్తులకుఁ గాణాచి ధనకటకము. అగుటచే సాతవాహనుల పరిపాలనమున ధనకటకము కృష్ణా తీరమున మూఁడున్నర మైళ్ళ పొడవున వ్యాపించి యుండెడిది.

క్రీస్తు శకము ఏఁడవ శతాబ్దమున విచ్చేసిన "యువాన్ చ్వాంగ్" మహాంధ్రమునకు రాజధానియైన ధనకటకము చుట్టుకొలఁత నలుబది వీలని చెప్పినాఁడు. అనఁగా నెన్మిది మైళ్ళని యర్థము! అప్పటికే యీ నగరము ఎంత పెద్దదిగ నుండెనో యూహింప నగును.

సాతవాహన చక్రవర్తులు వైదిక ధర్మావలంబులయ్యును బౌద్ధము నభిమానించి బౌద్ధాచార్యులఁ బోషించిన వారౌటచే ధనకటకములోని స్తూపము మహాచైత్యముగఁ దేజరిల్లినదని తెలియుచున్నది. కాఁబట్టి బహు ప్రాచీనము నుండియు "ధనకటకము" అను పేరితో "ధరణి కోట" విలసిల్లుచున్నదని యవగత మౌచున్నది గదా!

శాసనముల నెల్లెడల "ధరణి కోట"ను "ధాన్యాంకపురము" అనియు, "ధాన్యవతీ పురము" అనియుఁ,— జెప్పఁబడి యున్నది. ఆంధ్ర చక్రవర్తులకు రాజధానియై "ధాన్యకటక" మని విఖ్యాతిఁ జెందినది. క్రీస్తు శకము పండ్రెండవ— పదుమూఁడవ శతాబ్దములలో "కోట" వంశ్యులు ఈ "ధరణి కోట"ను బరిపాలించిరి. ఇవ్వంశజు లెల్లరును విష్ణు పాదోద్భవులయిన చతుర్థాన్వయుల మనియె చెప్పికొని యున్నారు. సత్తెనపల్లె తాలూకా యందలి "పెదముక్కెన" శాసన మందలి.

"అమల పయోధిచంద్రుఁడుద
యంబగు నట్లనెపోలె వారి జా
తమున విరించి పుట్టిన వి
ధంబునఁ గాంచన ధారుణీధరేం।
ద్రమున సురావనీజ ముది
లం బయి యొప్పుగతిన్జతుర్థ వం।
శమున జనించె నుగ్రపురి
సైన్య జయుండు ధనంజయుండిలన్॥"

అను పద్యమును బట్టి యీ చతుర్థ కులమ్మున ధనంజయుఁడను వాఁడుదయించె ననియు., నివ్వంశమునఁ బెక్కండ్రు ప్రఖ్యాత పురుషులు జన్మించి రనియుఁ,— దెలియం దగియున్నది.

కోట గండ భూపతి భార్య భూతమ దేవి క్రీస్తు శకము 1160 వ సంవత్సరమునఁ గావించిన దాన ధర్మముల గుఱించిన శాసనములు గుంటూరు మండలము నందాడనాడ లభించినవి. లభించిన శాసనములలో ఈ భూతమదేవి తన భర్తృ వంశమును వివరించు పట్టుల ధనంజయ గోత్రమునఁ జోడరాజును, ఆయనకు గండ భూపతియు, వానికి ముమ్మడి భీమరాజును, అతనికి గండ భూపతి రాజును,— ప్రాదుర్భవించినట్లు జెప్పఁబడియున్నది.

ఇవ్విధముగ విస్తృతమై తేజరిల్లిన యార్వేల నాఁటికి ధనంజయ గోత్రుఁడగు కోట బేతరాజు క్రీస్తు శకము 1240 దవ సంవత్సరము మొదలుకొని క్రీస్తు శకము 1250దవ సంవత్సరము దాఁక సనఁగాఁ, బదేండ్లు పరిపాలించి కాకతీయ గణపతిదేవ చక్రవర్తితో పాటు కాంచీపురము పయింబడి యచట సాఁగిన ప్రచండ యుద్ధమునఁ బ్రాణములఁ బాసెనని విస్పష్టమౌచున్నది.

ఈ బేతరాజు దొడ్డకేతరాజు మనుమఁడు. దొడ్డరాజు సనిపోయిన పిమ్మట నాతని కొమాళ్లు ద్వైమాతురులు కావుటం జేసి రాజ్యమున కయి వివదించి తుదకుఁ బైతృక రాజ్యమును, విభజించుకొని ప్రాగ్భాగమునకు రుద్రరాజును, పశ్చిమ భాగమునకు భీమ నృపతియుఁ, బరిపాలకులయిరి. కాని వీరిద్దఱును విశేష కాలము రాజ్య భోగముల ననుభవించి యుండలేదు.

రుద్రరాజునకుఁ బండాంబిక వలనఁ బుట్టినవాఁడే బేతరాజు, ఈ బేత ధరణీపుఁడు కాకతి గణపతి దేవ చక్రవర్తి కొమార్తె యగు గణపమ్మను బెండ్లి యాడెను, ఈ బేతరాజు క్షితిలసన్మస్తకవ్యస్త పాదుఁడనియుఁ, దేజోధ్వస్తాఖిల రిపువ్రతముఁడనియుఁ_ ప్రఖ్యాతిఁ జెందినట్లు వగతమౌచున్నది. అంతియకాక వివాహోత్పార్యమే యతుల బలాఢ్యుఁడనియుఁ దెలియనగుచున్నది.

ఈయనకు సంతానము లేకుండుట వలన నీయన పిమ్మట నీయన భార్య గణపమ్మయే రాజ్యభారధౌరేయ యయ్యెను. బేతరాజు పరిపాలనము సేయుచున్న, యప్పుడును రాజధానిలో లేని యప్పుడును గూడ గణపమ్మయే రాజ్య తంత్రమును నడపుచుండెనని యామె వేయించిన దాన శాసనముల నెల్లెడలఁ గన్పట్టుచున్నది. బేతరాజు సనిపోయిన పిమ్మట గణపమ్మ వైరాగ్య బుద్ధితోఁ గాలము వెడల నడపుచును రాజ్య వ్యవహారములను అతి చాకచక్యముతో నిపుణతతోఁ జాఁగించుచుఁ, దన కాలము నంతను ప్రామాణిక బుద్ధితోఁ ధర్మ బుద్ధితోఁ బుణ్య వ్రతములఁ, బుణ్య కార్యముల, జరపుచుఁ బరమ మహేశ్వరాచార వ్రతము నవలంబించి, "ధరణి కోట" యందు అమరేశ్వర మహాదేవు నాలయ విమానము పయిని బంగరు కలశముల నమర్చెను. తన భర్తయగు బేతరాజునకు శివలోకావాప్తియు సంతతోత్సాహమును గల్గుట కయి నిజరాజధానియగు "నెన్మదల" యందు బేతేశ్వర లింగమును బ్రతిష్ఠించి గగన చుంబితమైన యాలయమును, రమణీయమైన ప్రాకారమును, వినిర్మించి, గోపురము మీఁద బంగారు కలశముల నుంచి, యా దేవుని యంగరంగ వైభవములకును_ నిత్య ధూపదీప నైవేద్యములకును,_ ఆచంద్రార్క స్థాయిగా నడచుటకుఁగా సమగ్ర సస్యాఢ్యయగు "బెనిదేవి" గ్రామమును దేవ భోగముగా ధారవోసి యొసంగెను.

అంతియకాక తన తండ్రియగు గణపతి దేవ చక్రవర్తికి శ్రీర్బలాయు రారోగ్యైశ్వర్యాభివృద్ధిగా నాయన పేరనొక శివలింగమును బ్రతిష్ఠించి, యాలయ మొకదానిం గట్టించి యా గణపేశ్వరుని యంగరంగ వైభవములకుఁగాఁ "జింతపాఁడు" గ్రామమును దేవ భోగముగా నొసంగుటయేగాక "ధాన్యవాటి" యందొకచోట ద్వాదశ గృహారామ క్షేత్రాదుల నేర్పఱచి, యాదిత్య సంకాశులయిన బ్రాహ్మణుల పండ్రెండుగురకు ఆవాసమొసంగి, వారి జీవితానుభవముల కయి వృత్తులఁ గల్పించి, తన భర్త బేతరాజు పుణ్యావాప్తి కయి సమర్పించెను.

గణపమ్మ యౌవన ప్రాయమున విగత భర్తృక యయ్యును ధర్మబుద్ధితోఁ, బ్రామాణిక బుద్ధితో, శివారాధనా తత్పరయై ప్రత్యహము మహాదేవునకు నుత్సవాదుల జరపుచు, సంగీత నృత్యాదుల నెఱపుచు, రాజ్య భారవహయై సుఖం బుండుచుండెను.' ఈమె పరిపాలనా సౌష్ఠవమును, పరమ పావనమైన యీమె జీవిత సౌభాగ్యమును,_

"యద్దస్తౌ హరపూజనైక నిరతా
యస్యాశ్చ దృష్టి శ్రుతీ
శంభోరన్వహ కారితోత్సవల
సత్సంగీత సక్తే సదా
ఇత్థం యా దివసాన్ సుఖం గమయ
తీ ప్రాజ్యేపి రాజ్యే స్థితే
తస్యానం గణపాంబికా గిరిసుతా
తస్యాస్తుతౌకః ప్రభుః?"

అని యొకఁ డభివర్ణించెను.

గణపమ్మ విజయ రాజ్య వర్షములు 40 న "వెనీసు" వర్తకుఁడు "మార్కొపోలో" అనువాఁడు మోటుపల్లె (చిన గంజాం దగ్గఱఁగల రేవు పట్టనము) రేవును దిలకించుట కయి క్రీస్తుశకము 1291లో వచ్చినాఁడన్న మాట! గణపాంబ భర్త బేతరాజు క్రీస్తు శకము 1250 దవ సంవత్సరమునఁ జనిపోయినాఁడు. కావున మార్కొపోలో ఈ ప్రాంతమునకు వచ్చునప్పటికి గణపమ్మ పరిపాలనము జేయ నారంభించి నలుబదేండ్లు గడచినవి. గణపమ్మ సామంత మండలేశ్వరి యయ్యును ధరణి కోట రాజ్యమును సర్వతంత్ర స్వతంత్రయై పరిపాలించి శివారాధనతోఁ గాలము వెడల నడపెను. అక్కతన గణపమ్మ యశోలత దిగంతముల కెగఁబ్రాఁకినది.

వర్ష రాజు

పైడిపాటి సుబ్బరామ శాస్త్రి

శశియాధిపత్యమ్ము సాగు అయనమ్ములో పరిపూర్ణమైనట్టి ప్రథమ ఋతువు
శ్రద్ధగా గౌరిని శ్రావణమ్మున నోచి వాంఛితార్థములెల్ల బడయు ఋతువు
కృష్ణావతారంపు కేవలమ్మైనట్టి తిథి తనయందు వర్తించు ఋతువు
భవ్య సూత్రముఁదాల్చు పర్వమ్ము శ్రావణ పూర్ణిమం దనయందు బొందు ఋతువు

భక్తి పితృదేవతలఁ దృప్తిపఱచు ఋతువు మెరక పల్లమ్ము నొకటిగా ధరణియెల్ల
పైరు పచ్చల మురిపించు వర్ష ఋతువు మేదినికి డిగ్గె నిలువెల్ల మెఱసి మెఱసి.

2

ఇంద్రుండు విసర నింతింతలై పడు కెంపువలె నుండె నింద్రగోప వ్రజంబు
వ్రత సమాప్తినిఁ జేయు పరమసాధ్వి విధానఁ జనుదెంచె నీటికై చాతకమ్ము
క్రుగ్గి పెన్మంటలో మఱల బ్రతుకు గన్న జీవినా వచ్చెను చిత్తజుండు
ఆప్పులలో స్రుక్కిలప్ప వచ్చినఁదేలు సంసారి వలె నది సాగిపోయె

కాంత తోడుతఁ బ్రియుని యేకాంతమట్లు సకర్ణ విధమ్మునను జేరె కకుభసుమము
కొమ్మ నిస్వార్థమైన రాగమ్ము వోలె కడిమి విరబూచె ప్రావృట్టు కదలి వచ్చె.

3


చేప కొలమున కింత జీవనమ్ములు కల్గ మీనకేతన మిట్టె మిట్టిపడియె
మకర సంతతి యీత సుకములోఁ దేలంగ మకర ధ్వజము దీప్తి మంతమయ్యె
అల్ప జీవికి బ్రదుకాస కన్పడినంత నతనుని తేజి గణ్యత గడించె
మ్రోడు వారిన చెట్లు మోసులెత్తిన యంత చిత్తజాతుని కోర్కె చిగురువారె

తోడు చెలికాడు మఱి వసంతుండు లేక మల్లియలు లేక యరవింద మహిమ లేక
మొగిలు ధాటియు పట్టిన మొగలి యీటె తోడ మదనుండు వెడలె పాంథుల జయింప.

దోష దూషితమయ్యె తోయమ్ము, జనుల తత్త్వమ్ము లంతట కలుషమ్ములయ్యె
మొరసి మొరసి మబ్బు తెర తీయగా నంత గాచిన యెండ చీకాకు పఱచె
బాహిరమ్మౌ యగ్ని పగిదిలో జఠరాగ్ని కేవలమ్మును మందగించి వెల్గె
గిరి మల్లికల జల్లు కురిసినట్లుగ వాన కురిసె నెందను తానె మెఱసి మెఱసి
జలధిలో వాయువులు రేగి తడిసి గుడిసె తేలిపోయిన, వేసరాల్ తూలిపోయి
నల్ల గలువల కన్నుల వెల్లి గొలిపె నంబువులు నాటి వర్షమ్ము నతిశయించి.

౫.

చెలువుండు సొగసుగా చిటికవేసిన యట్లు చేడెతే బుగ్గపై చినికి చినికి
ధపదొక్క హేలగా జవిరి నివిరినయట్లు జవరాలి వీపుపై చఱచి చఱచి
కాంతుడే కాంతమ్ము గలవర పఱచెనా యింతి వక్షమ్ము దృక్కింత పఱచి
రమణుండు కేళిసరాగమ్ము నొక్కెనా కెమ్మోవిపై రాదనమ్ము చేసి
కలువ తీయుగ నిలువు ధామమును పొందు నిలువు నిలువెల్ల నార్ద్రమై నిలువరేని
పగిది నిలువుపు గుబ్బిల్లి బయలు పఱచి పరమ విరసుంటౌ రసికుడో వర్ష రాజు.



కవిత ప్రీతిని కలగజేస్తుంది. శ్రేయస్సును కలిగిస్తుంది. పాపాలను పరిహరిస్తుంది. దేవతల హృదయాలను సైతం ప్రసన్నం చేస్తుంది. కవిత ఏ శుభాలను కలిగించలేదు గనుక?

— ప్రాచీన సంస్కృతి శ్లోకార్థం.

స్త్రీల పరిపాలన

నల్గొండ జిల్లాలో కేవలం స్త్రీ సభ్యులతో యేర్పడిన మట్టంపల్లి పంచాయతీ కార్యోత్సాహం యెల్లరిని ఆకర్షిస్తున్నది. వారి ఆశావాదం కూడ అరుదైనది వారి ప్రయత్నాలలో, వుత్తమ జీవితానికై పోరాడే వీర లక్షణాలు ప్రతిఫలిస్తున్నవి. సమాచార శాఖ ఇంటర్వ్యూ జట్టు ప్రశ్నించగా, తమ ప్రస్తుత కృషి ఆధారంతో వచ్చే పంచాయతీ యెన్నికలలో తాము నెగ్గగలమని వారు ముక్త కంఠంతో వక్కుచ్చారు. తమకు తక్షణం విద్యుచ్ఛక్తి, మంచిరోడ్లు కావాలన్నారు.

పంచాయతీ అగ్రప్రాధాన్యత నివ్వదలచిన కార్యక్రమం యేవి అని ప్రశ్నించగా "పిల్లల చదువు. మేము గ్రామమంతా తిరిగి ఉచిత నిర్బంధ విద్య యోగ్యతలను గురించి ప్రజలకు చెబుతున్నాము." అని హరిజన సభ్యురాలు శ్రీమతి మరియమ్మ కృతనిశ్చయురాలై జవాబు చెప్పినది.

కేవలం స్త్రీ సభ్యులు గల యీ పంచాయతీ విజయవంతంగా పని చేయటంతో, వికేంద్రీకృతమైన ప్రజాస్వామిక వ్యవస్థ ప్రతివారూ విశిష్టమైన పాత్ర వహించుటకు యెక్కువ అవకాశాలు యివ్వగలదనే విషయం విశదమైనది. తమ గ్రామాన్ని అభ్యుదయ పథంలో నడిపించుటకు క్రమశిక్షణా పూర్వకంగా వారు చేసే కృషి యిప్పటికే దూర ప్రాంతాలగల ప్రజల దృష్టిని సైతం ఆకర్షిస్తున్నది. వారి స్వపరిపాలనా సామర్థ్యం చుట్టుపట్ల గ్రామాలలో విశ్వాసాన్ని పూరిస్తున్నది. స్వలాభాపేక్ష లేని కారణాన, వారి కృషి, సాధారణంగా నిర్లక్ష్యంగా వుండే వారిలో శ్రద్ధా చైతన్యాలను కలిగిస్తున్నది.

మట్టంపల్లి హుజూర్‌నగరానికి (హైదరాబాదు నుంచి 120 మైళ్లు) 15 మైళ్ళ దూరంలో ఉన్నది. కొత్తజనాభా లెక్కల ప్రకారం గ్రామ జనాభా 3038 మంది. ఇందులో రమారమి 40 శాతం అక్షరాస్యులు. దానికి 4500 యెకరాల మెట్ట భూమి, 450 యెకరాల మాగాణీ వున్నవి. ఈ గ్రామం సాగునీటికై ముఖ్యంగా చిన్న చిన్న చెరువులు, బావులపై ఆధారపడుతుంది. మంచి రోడ్లు లేవు. వర్షాకాలంలో మట్టంపల్లి వెళ్లడం చాల కష్టం.

పురుషుల వైఖరి

ఇటువంటి గ్రామంలో పంచాయతీ స్థానాలు ఎనిమిదింటిని స్త్రీలు గెల్చుకున్నారు. ఇందులో ఆర్గురు యేకగ్రీవంగా యెన్నుకొనబడగా యిద్దరు మాత్రం పోటీ చేయవలసి వచ్చినది. స్త్రీ సభ్యులను యెన్నుకొనడం పూర్వాచార పరాయణులు కొందరికి నచ్చలేదు. మరి కొందరికి స్త్రీ ఆధిపత్యానికి తల ఒగ్గడం యిష్టం లేక నచ్చలేదు. కాని ఆ గ్రామస్థుడు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు అయిన శ్రీ జి. ఎస్. రెడ్డి, స్త్రీలుకూడ గ్రామ వ్యవహారాలను చక్కబెట్టగలరని, అందువల్ల అనూచానమైన గ్రామ పెద్దల అధికారాలేమీ తగ్గవని నచ్చచెప్పారుట. 'ఆడవాళ్ళు యేమి చేయగలరులే' అని మెటికలు విరిచిన పురుషులు రాను రాను తమ అహంకారాన్ని విడిచి వారినెంతో మెచ్చుకుంటున్నారు.

గ్రామ పంచాయతీ యెన్నికలు, హైదరాబాదు గ్రామ పంచాయతీ చట్టం నిబంధనల ప్రకారం చేతులు యెత్తి సమ్మతిని తెలియజేసే పద్ధతిలో నడుపబడినవి. దిగువ సభ్యులు యెన్నుకొన బడ్డారు.

1. శ్రీమతి మన్నెం చూడమ్మ — అధ్యక్షురాలు
2. ,, గోపు ధెరోజమ్మ — సభ్యురాలు
3. ,, గాయం శేషమ్మ — ,,
4. ,, గుడిబండ మరియమ్మ — ,,(హరిజన్)
5. ,, ఆదూరి షోరమ్మ — ,,
6. ,, మంగళపల్లి భద్రమ్మ — ,,(హరిజన్)
7. ,, తుమ్మా స్లీవమ్మ — ,,
8. ,, మైలబోయిన వెంకమ్మ — ,,

వీరిలో మిక్కిలి చిన్నామె వయస్సు 25 సంవత్సరాలు. వీరిలో అందరికంటె యెక్కువ చదువుకొన్నామె శ్రీమతి గోపు ధెరోజమ్మ—8వ తరగతి. హరిజన సభ్యురాండ్రలో ఒకతె అయిన శ్రీమతి మరియమ్మ వయోజన విద్యా విషయికంగా సేవ చేస్తున్నది. అధ్యక్షురాలు చూడమ్మకి పదియెకరాల మాగాణి, 50 యెకరాల మెట్టవున్నవి. ఆమె స్వయంగా మంచిరైతు. సభ్యురాండ్రలో యెక్కువ మంది పొలంపని చేస్తారు. అందుకు వారు గర్విస్తారు.

ఈ మహిళా గ్రామ పంచాయతీ మనప్రధాని జన్మదినమైన 14–11–59న యేర్పడినది. పూర్వ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. సంజీవరెడ్డి దీనిని ప్రారంభించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించి స్త్రీలను సభ్యులుగా యెన్నుకొన్నందుకు గ్రామస్థులను అభినందించారు.

సాధించిన ఫలితాలు

ప్రారంభమాది యీ మహిళా గ్రామ పంచాయతీ గ్రామపు వివిధ ఆర్థిక రంగాలలో తగినంత అభివృద్ధిని సాధించినది. ప్రభుత్వము, పంచాయతీ సమితి, స్థానిక విరాళాల ద్వారా వచ్చే ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామానికి యేకీకృతమైన అభివృద్ధి ప్రణాళిక ఒకటి రూపొందించ బడినది. ఈ గ్రామంలో యిప్పుడు ఆదర్శ గ్రామానికి అవసరమైన సంస్థలన్నీ వున్నాయి. గ్రామాభ్యుదయానికి ముఖ్యమైన గ్రామ సహకార సంఘము, వున్నత పాఠశాల యిక్కడ వున్నవి.

పంచాయతీ చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యకలాపాలలో వ్యవసాయోత్పత్తి హెచ్చింపుకు ముందు ప్రాధాన్యత యివ్వబడినది. ప్రస్తుతం వున్న నాలుగు చిన్న చెరువులు రూ. 8000 లతో బాగుచేయించ బడినవి. ఒక వ్యవసాయ గిడ్డంగి తెరువబడినది. దాని ద్వారా రూ. 2900 లు కిమ్మతుగల రసాయన యెరువులు రైతులకు సరఫరా చేయబడినవి. రైతులు రసాయన యెరువులను యెక్కువగా వాడుతున్నారు. వరిపంటకే కాక ప్రత్తిపంటకు కూడ జపాను పద్ధతి సాగు అవలంబింపబడుతున్నది. చీడలు, వ్యాధుల నుంచి పంటల రక్షణకై 12 స్ప్రేయర్లు, 4 డస్టర్లు కొనబడినవి. పశువుల ప్రథమ చికిత్సా కేంద్రమొకటి పని చేస్తున్నది. దేశవాళీ కోడిజాతిని పూర్తిగా తొలగించుటకు పంచాయతీ కంకణం కట్టుకొన్నది. విదేశ పక్షులు యెక్కువగా సరఫరా చేయబడినవి. మేలురకం పశువుల సాధనకై ఒక ముర్రాపోతు కొనబడినది.

ఒక గ్రాను పరపతి సంఘం యేర్పాటు చేయబడినది, ఇది వస్తూత్పత్తికై రూ. 20,000లను అప్పులు యిచ్చినది. పంచాయతీ సమితి సహాయంతో రెండు వయోజన విద్యా కేంద్రాలు నడుస్తున్నవి, ఇంతవరకు 300 మంది అక్షరాస్యులయ్యారు. ఒక బాల విహార్ పని చేస్తున్నది. దానికి పిల్లల పార్కు కూడా వున్నది. దీనికి రూ. 1000 ఖర్చు అవుతుంది. పంచాయతీ రూ. 275లతో ఒక కమ్యూనిటీ రేడియోను కొన్నది. రూ. 3,000 లఖర్చుతో అమరవరం నుంచి మట్టంపల్లికి కచ్చారోడ్డు నిర్మించబడినది. గ్రామంలో ఒక ఆరు బయలు నాటక మందిరం కూడా నిర్మించబడినది. కొత్త సర్వీసు బస్సులు యీ గ్రామానికి వస్తున్నాయి.

సువ్యవస్థితమైన యువజన క్లబ్ మహాత్మాగాంధీ గ్రంథాలయాన్ని నడుపుతున్నది, క్లబ్బు సభ్యులు శ్రమదానంతో గ్రంథాలయ భవనాన్నొక దానిని నిర్మించారు.

గ్రామంలో ఒక 50 మంది స్త్రీలు "మహిళా మండలి"గా యేర్పడి స్త్రీ జనాభ్యుదయ కార్యకాలాపాలను నిర్వహిస్తున్నారు. వివిధ గృహాలలో 30 పొగరాని పొయ్యిలు యేర్పాటు చేయబడినవి. ఒక కుట్టుపని కేంద్రం తెరువబడినది.

మహిళా పంచాయతీ హరిజనాభ్యుదయం విషయంలో మిక్కిలి శ్రద్ధ తీసుకొంటున్నది. ఈ కారణంవల్ల హరిజనులకు ప్రత్యేకం రెండు మంచి నీటిబావులు త్రవ్వించ బడినవి. గృహ నిర్మాణానికై 23 మంది హరిజనులకు ఆర్థిక సహాయం చేయ బడినది. చర్మకారుల పారిశ్రామిక సహకార సంఘం ఒకటి పని చేస్తున్నది, అందులో 14 మంది శిక్షణ పొందుతున్నారు.

రూ. 10,000 లతో ఒక పంచాయతీ ఘర్‌ను నిర్మించాలని గ్రామ పంచాయతీ ఆలోచిస్తున్నది, అది మంజూరు కావలసి వున్నది. అంబర్ చర్ఖా కార్యక్రమం అమలు విషయంలో పంచాయతీ చాలా శ్రద్ధ తీసుకొంటున్నది.

రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలో వెనుకబడిన తాలూకాలో కేవలం స్త్రీలతో పనిచేసే మట్టంపల్లి పంచాయతీ జయప్రదంగా నడుస్తున్నది. ఇది ఆధునిక భారత దేశంలో ప్రతిగ్రామానికి వుత్సాహజనకమై ఆదర్శప్రాయం కావాలి.

సవరణ

జూన్ 1961 నెల "ఆంధ్రప్రదేశ్" సంచిక 65 పుటలో "ప్రజాస్వామ్యంలో మనం, మన సమస్యలు" అనే గ్రంథ సమీక్షలో గ్రంథ కర్త పేరు "శ్రీ జలగం వేంకటరావు" అవి పడింది. "శ్రీ జలగం వెంగళరావు" అని చదువుకోవలెను.

పరమాణు శక్తితో వ్యవసాయ పరిశోధనలు

బి. వి. రమణారావు

1945వ సంవత్సరంలో ప్రారంభమైంది పరమాణుయుగం. పదిహేను ఏండ్లక్రితం పరమాణుశక్తి మొదట్లో ఒక పెనుభూతంలా కనబడింది. అప్పటి నుంచీ శాస్త్రజ్ఞులు దాన్ని రియాక్టర్లలో అదుపులో పెట్టి, వివిధ శాస్త్ర రంగాల్లో మానవాభ్యుదయం కోసం వినియోగించి చేస్తున్న పరిశోధనలు, వాటి ఫలితాలు చూస్తుంటే పరమాణువు మనకొక పెన్నిధిలా కనబడుతోంది.

పరమాణుశక్తి ప్రయోజనకరంగా వినియోగపడుతున్న రంగాల్లో వ్యవసాయం ఒకటి. యునైటెడ్ స్టేట్సు, కెనడా, స్వీడెన్, రష్యా, జర్మనీ మొదలైన దేశాల్లో పరమాణుశక్తి సహాయంతో వ్యవసాయంలో చాలా అభివృద్ధి కలిగింది. వ్యవసాయంలోనేకాదు, ఆహారం తయారుచేసి నిలవ చేయడంలో కూడా దాని ప్రయోజనాలు కనబడ్డాయి. కొన్ని ప్రదేశాల్లో శ్రేష్ఠమైన ఆహారం, నాణ్యమైన నార సరుకులు సమృద్ధిగా, తక్కువ ఖరీదులో ప్రజల అందుబాటులోకి వచ్చాయి,

పరమాణుశక్తి ప్రయోజనకరంగా వ్యవసాయంలో వినియోగపడుతూందంటే వ్యవసాయదారుడు స్వయంగా దాన్ని ఉపయోగించి తన పైరు పంటల్నీ, పశు సంపదనీ అభివృద్ధి చేసుకుంటాడని కాదు. దానివల్ల కలిగిన ప్రయోజనాలు అతనికి చాలా లాభకరంగా ఉంటాయి. మేలురకం పైరులు, శ్రేష్ఠమైన పశువులు అతనికి దొరుకుతాయి. వాటినుంచి శ్రేష్ఠమైన ఆహారం ఎక్కువగా ఎట్లా ఉత్పత్తి చేయాలో అతనికి తెలుస్తుంది. పరమాణుశక్తి వినియోగం వల్ల పొలంలో పెరిగే కలుపు మొక్కలు, పైరులకూ, పశువులకూ వచ్చే తెగుళ్ళు, పురుగులు ఎక్కువ విజయంతో నిరోధించే అవకాశం అతనికి కలుగుతుంది. ఈ ఫలితాలన్నీ వ్యవసాయదారునికి శాస్త్ర పరిశోధనల ద్వారా లభిస్తాయన్న మాట.

వృక్ష శాస్త్రంలో, జంతు శాస్త్రంలో, భూ శాస్త్రంలో ఇంతకు ముందు జరిగిన ప్రాథమిక, ఉపయుక్త పరిశోధనల ఫలితంగా ఆధునిక వ్యవసాయశాస్త్రం పెరిగి, అధికోత్పత్తికి సహాయపడిన విషయాలు చాలా ఉన్నాయి, ఈ ప్రాథమిక, ఉపయుక్త పరిశోధనలకి పరమాణుశక్తి చాలా సహాయకారిగా ఉన్న ఒక ముఖ్యమైన క్రొత్త పరికరం. దీని సహాయంతో నేలను, సస్యాల్నీ వ్యవసాయపు పశువుల్నీ, తెగుళ్ళను, పురుగులను గురించి యిదివరకు తెలుసుకోడానికి వీలులేని క్రొత్త విషయాలు వ్యవసాయ శాస్త్రజ్ఞులు చాలా తెలుసుకుంటున్నారు.

పరమాణుశక్తి వ్యవసాయంలో రెండు రూపాలలో ఉపయోగపడుతోంది. రేడియో ఐసొటోపుల ద్వారా, అయోకరణ కిరణాల ప్రసరణ ద్వారా. వీటిలో రేడియో ఐసొటోపుల ఉపయోగం చాలా ఎక్కువ. యునైటెడ్ స్టేట్సులోగాని, కెనడాలోగాని వ్యవసాయ శాస్త్ర విజ్ఞానం యింకా ఎక్కువగా సంపాదించడం కోసం రేడియో ఐసొటోపులు వినియోగించని కళాశాలలుగాని, పరిశోధనా కేంద్రాలుగాని లేవంటే అతిశయోక్తికాదు. రేడియో ఐసొటోపులంటే ఏమిటేమ. మనం మామూలుగా చూసే గంధకం అనే మూలద్రవ్యం ఉందనుకోండి. దానిలో ఉండే పరమాణువులు స్థిరత్వంతో ఉండటం వల్ల దానినుండి ఏ విధమైన కిరణ ప్రసారం జరగదు. రేడియో ఐసొటోపు గంధకంలో పరమాణువులు అస్థిరత్వంతో ఉంటాయి. వాటినుండి అయోకరణ కిరణ ప్రసారం జరుగుతూ ఉంటుంది, ఆ కిరణాలు మన కంటికి కనబడవు. ఈ మాదిరిగా మొక్కలు, జంతువులు, పురుగులు, తెగుళ్ల కలిగించే జీవులు మొదలైన వాటి శరీరంలో ఏయే స్థిర మూల ద్రవ్యాలుంటాయో, ఆయా ద్రవ్యాల రేడియో ఐసొటోపులు తయారుచేసి వ్యవసాయ శాస్త్ర వివిధ పరిశోధనల్లో వినియోగిస్తారు. భాస్వరం, గంధకం, కర్బనం, ఖటికం, నత్రజని ఇటువంటి ముఖ్యమైన మూలద్రవ్యాలలో కొన్ని. ఈ ఐసొటోపుల నుండి వెలువడే ఎంత సూక్ష్మమైన కిరణ ప్రసారాన్ని అయినా గుర్తించి, లెక్కపెట్టే యంత్రాలుంటాయి. ఒక ఔన్సు కర్బనం రేడియో ఐసొటోపు ఉందంటే దానిలో సెకండుకు 11,100 మిలి

యన్న పరమాణువులు కిరణ ప్రసారమిస్తూ విచ్ఛిన్నం అవుతూ ఉంటాయిట. దానిలో ఒక లక్షోవంతు భాగం మొక్క శరీరంలో గాని, జంతు శరీరంలోగాని మనం ప్రవేశ పెట్టామనుకోండి. దాన్ని కూడా ఆ యంత్రాలు గుర్తిస్తాయి. అత్యంత స్వల్పంగా ఉన్న ఆ కిరణ ప్రసారంవల్ల మొక్కకిగాని, జంతువుకిగాని ఏమీ ప్రమాదం లేదు. ఈ విధంగా రేడియో ఐసొటోపులతోను, వాటి ప్రమాణాన్ని గుర్తించే యంత్ర సహాయంతోను మొక్కలోగాని, జంతువులోగాని ఏయే మూలద్రవ్యం ఏయే భాగంలో ఎంతెంత ఉపయోగపడుతోంది, అది ఏయే రసాయనిక మార్పులు చెందుతోంది, అది దానికెంత కావాలి మొదలైన విషయాలు శాస్త్రజ్ఞులు స్పష్టంగా తెలుసుకుంటున్నారు.

ఉదాహరణకు కాల్సియం, ఇనుము, జింకు, కర్బనం ఐసొటోపు లుపయోగించి ఈ ద్రవ్యాలు బయటి నుండి మొక్క శరీరంలోకి ఎట్లా ప్రవేశిస్తున్నాయి, అవి ఏ విధమైన మార్పులు చెందుతూన్నదీ, భాస్వరం, కాల్సియం మొదలైన ఐసొటోపు లుపయోగించి వర్తకపు ఎరువులు, పచ్చియెరువులు మొక్కలు తీసుకునే విధానం, ఏ రకం ఎరువు శ్రేష్ఠమైంది, ఏది మొక్కలో ఎక్కడ చేరుతోంది అనే విషయాలు, పోషక పదార్థాల్ని మొక్క వేళ్ళతో మాత్రమేగాక ఆకులు, కాండం, కాయలు, పువ్వుల ద్వారా కూడా లోనికి పీల్చుకుంటుందనీ శాస్త్రజ్ఞులు తెలుసుకున్నారు. భాస్వరం, కాల్సియం, కర్బనం మొదలైన ఐసొటోపులతో భూసారాన్ని, ఎరువు భూమిలో పొందే మార్పుల్ని గురించి తెలుసుకుంటున్నారు. అయొడిన్, కర్బనం మొదలైన వాటి ఐసొటోపు లుపయోగించి మొక్కల పెరుగుదలను నిర్ణయించే పదార్థాలను గురించి, కలుపు మొక్కల్ని నాశనంచేసే మందుల్ని గురించి, పైరు పంటకు వచ్చేకాలం కొంత పొడిగించడం, తగ్గించడం గురించి పరీక్ష చేస్తున్నారు. గంధకం, భాస్వరం, మోలిబ్డినం, ఇనుము, కాల్సియం ఐసొటోపులతో పొగాకు మొదలైన మొక్కలకు పట్టే వైరసు తెగుళ్లు, అనాస మొదలైన వాటి ఎండు రోగం, ఈ మాదిరి తెగుళ్ళను కలిగించే జీవులకు మొక్కలకు గల సంబంధం తెలుసుకుంటూ శ్రేష్ఠమైనఔషధాలు తయారు చేస్తున్నారు. నేలలో వేళ్లు ఎంతవరకు వ్యాపిస్తాయో, దాన్నిబట్టి ఎరువు ఎంత వేయాలో, నేలసారం ఎట్లా వృద్ధిచేయాలో అనే విషయాలు భాస్వరం ఐసొటోపులాంటివి ఉపయోగించి తెలుసుకుంటున్నారు. వాతావరణ సూచనలు, వర్షపాతం, పర్వత శిఖరాలమీద స్థావరంగా ఉన్ననీరు, నేలలో మొక్కలకందుబాటులో ఉండే తేమ, నీటి సరఫరా మొదలైన విషయాలు కోబాల్టు, సీసియం, రుబిడియం ఐసొటోపుల సహాయంతో తెలుస్తున్నాయి.

ఇంతకంటె ముఖ్యమైన విషయం మొక్క తన ఆకుపచ్చని ఆకులతో ఆహారం తయారు చేసుకోడం. దీనిమీదనే ఆధారపడి ఉంది ప్రపంచం అంతా. ఇది ఒక గూఢమైన సమస్య. ఈ రహస్యాన్ని కూడా ప్రాణవాయువు, కర్బనం మొదలైన వాటి ఐసొటోపుల సహాయంతో శాస్త్రజ్ఞులు తెలుసు కుంటున్నారు. ప్రపంచ ఆహార సమస్య పరిష్కరించడానికిది ఎంత వరకు సహాయ పడుతుందో చూస్తున్నారు. ఉత్తమమైన ఫలసాయం, అధికోత్పత్తి మనకు లభించేందుకు పైరులకు ఏయే పదార్థాలిచ్చి ఎట్లా పెంచాలో రేడియో ఐసొటోపులవల్ల కళ్లకు కట్టినట్టు తెలుస్తోంది అన్నమాట.

వ్యవసాయదారుని పశువుల విషయంలో వాటి ఆహారాన్ని గురించి, చయాపచయ వ్యాపారాన్ని గురించి కడచిన పదిహేను సంవత్సరాలలో రేడియో ఐసొటోపుల సహాయంతో తెలుసుకున్న విషయాలు అంతకు పూర్వం తెలియవు. ఆవుల పాలు, గొర్రెల ఉన్ని, కోళ్ల గ్రుడ్లు, ఈ జంతువుల ఉత్పత్తి, వాటికి పెట్టే రకరకాల మేతలలో ఉండే ఆహారపు విలువ, ఆ ఆహార పదార్థాలు ఉపయోగపడే విధానం, ఈ జంతువుల రోగాలు మొదలైన విషయాలను గురించి ఐసొటోపు లుపయోగించి చేస్తూన్న పరిశోధనవల్ల శాస్త్రజ్ఞులకు ఎన్నో క్రొత్త సంగతులు తెలుస్తున్నాయి. ఈ పరిశోధనల ఫలితం ఏమంటే, శ్రేష్ఠమైన వంగడానికి చెందిన పశువుల్ని పెంచుతూ, ఉత్తమమైన పద్ధతులతో తక్కువ ఖరీదుగల మేతనిస్తూ అధికోత్పత్తి చేయడం ఎట్లాగో వ్యవసాయ దారుడికి తెలుస్తుంది.

భాస్వరం ఐసొటోపు సహాయంతో వ్యవసాయ శాస్త్రజ్ఞులు ఎరువుల్ని గురించి చాలా క్రొత్తవిషయాలు తెలుసుకుంటున్నారు. నేలలో నుండి మొక్కలో ప్రవేశిస్తున్న మూలద్రవ్యాలు మొక్కకు ఏ విధంగా ఉపయోగిస్తున్నాయో, అవి ఎంత ప్రమాణంలో ఎంత వేగంగా ప్రవేశిస్తున్నాయో, మొక్క ఏ దశలో వున్నప్పుడు ఏ ఎరువు ఎంత కావాలో, ఏ యెరువు ఎప్పుడు ఏ విధంగా వేస్తే మొక్కకు ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుందో, ఏ నేలలో ఏ రకం ఎరువులు వేస్తే ఎక్కువ లాభదాయకంగా ఉంటుందో మొదలైన విషయాలు తెలుస్తున్నాయి. కొన్ని రకాల మొక్కలు నేలలో వేసిన యెరువుకంటె ఆకులమీద చల్లిన యెరువును అధికంగా పీల్చుకుంటాయి. అందుచేత పురుగులను, తెగుళ్ళను నివారించే ఔషధాలతో పాటు యెరువుల్ని కూడా పైరుమీద చల్లే అవకాశం కలుగుతుంది. ఈ పరిశోధనల ఫలితంగా వ్యవసాయదారుడు ఎరువుల కోసం తక్కువ సొమ్ము ఖర్చు చేస్తూ ఎక్కువ ఫలసాయం పొందేటందుకు వీలవుతుంది.

పురుగులు, తెగుళ్లు, కలుపు మొక్కలు ఏటేట ఫలసాయం నష్టం చేస్తూ ఉంటాయి. రేడియో ఐసోటోపుల సహాయంతో వీటి స్వభావాలు, అలవాట్లు, జీవిత చరిత్రలు, అవి ఒకచోటి నుండి మరొక చోటికి వలసపోవడం, అననుకూల పరిస్థితులలో అవి దాగి ఉండడం మొదలైన విషయాలు శాస్త్రజ్ఞులు మొదట తెలుసుకుంటున్నారు. వాటి నివారణ కుపయోగించే ఔషధాలు వాటి శరీరంలో ఏ విధంగా పనిచేస్తాయి, ఏ రకం ఔషధం, ఎక్కువ పటుత్వంతో పని చేస్తుంది అనే విషయాన్ని గురించి పరిశోధనలు చేస్తున్నారు. దీనివల్ల తక్కువ ఖరీదులో ఎక్కువ పటుత్వం గల ఔషధాలుపయోగించి పురుగుల్ని, తెగుళ్ళను, కలుపు మొక్కల్ని వ్యవసాయదారుడు నివారించుకో గలుగుతాడు. ఈ విధమైన పరిశోధనతో "స్క్రూవరం"అనే ఒక రకమైన పురుగు పశువులకు పట్టి యునైటెడ్ స్టేట్స్‌లో ఒక భాగంలో సాలుకి 20 మిలియన్ల డాలర్లు నష్టం కలుగుతూ ఉంటే, దాన్ని నిశ్శేషంగా శాస్త్రజ్ఞులు నిర్మూలం చేయ గలిగారు.

పరమాణుశక్తి వ్యవసాయ పరిశోధనలలో వినియోగింపబడుతూన్న రెండవ మార్గం అయోకరణ కిరణ ప్రసారాలద్వారా. ఎక్కువ శక్తిగల అయోకరణ కిరణ ప్రసారాలు మొక్కలలోను, జంతువులలోను వంశ పారంపర్యా వచ్చే లక్షణాలలో గొప్ప మార్పులు కలిగిస్తాయని శాస్త్రజ్ఞులు కనిపెట్టారు. దీనివల్ల లాభకరమైన లక్షణాలుగల క్రొత్తరకాలు ఉత్పత్తి అయ్యే అవకాశం చాలా కనబడుతోంది. అధికమైన ఫలసాయం, తెగుళ్ళకు లొంగకుండా ఉండటం, త్వరగా పంటకు రావడం, ఎక్కువ నాణ్యమైన సరుకు దిగుబడి– ఇవీ వ్యవసాయ దారుడికి కావలసిన పైరు లక్షణాలు. ప్రకృతిలో ఇటువంటి మార్పులు అనాది నుండి కలుగుతూనే ఉన్నాయి. కాని, అవి చాల నెమ్మదిగా జరుగుతూ ఉంటాయి, వాటిని పురస్కరించుకునే మన సస్యాలు, జీవధనం యింతవరకు అభివృద్ధి అయ్యాయి. పరమాణుశక్తి వల్ల లక్షణాలతో కలిగే మార్పులు అనేకంగా ఉంటాయి. వాటిలో ముప్పాతిక మూడు వంతులు హానికరమైనవే. అయినప్పటికీ, కొన్ని కొన్ని లక్షణాలలో కలిగిన మార్పులు ఒకటో రెండో చాలా లాభకరంగా ఉంటాయి. శాస్త్రజ్ఞులు వాటిని పరిశీలించి, ఏరి, అభివృద్ధిచేసి వ్యవసాయ దారునికి అందజేస్తున్నారు.

స్వీడెన్ దేశంలో అధిక ఫలసాయం, నూనె యిచ్చే ఒక ఉత్తమమైన రకం తెల్లఆవాలు, బఠానీలలో మరొక శ్రేష్ఠమైన రకం శాస్త్రజ్ఞులు, రైతులకు అందజేశారు. యునైటెడ్‌స్టేట్స్‌లో తుప్పమాదిరిగా పెరిగి, ఎక్కువ పంట పండే "సిమిలాల్" అనే చిక్కుడు రకం మిచిగన్‌లో ఉపయోగంలో ఉంది. శ్రేష్ఠమైన వేరుశనగ రకం డాక్టరు గ్రిగరీ అనే శాస్త్రజ్ఞుని కృషివల్ల నార్తు కెరోలినాలో రైతులకు లభించింది. మన దేశంలో ఎక్కువ నారనిచ్చే జనుము రకాలు, ఎక్కువ పంటనిచ్చే నువ్వు రకాలు, తెగుళ్లకు లొంగని గోధుమ రకాలు శాస్త్రజ్ఞులు తయారు చేశారు. గోధుమ పైరు వంశక్రమంలో కొన్ని మొక్కలకు తెగుళ్ళకు లొంగని లక్షణం ఉంది. ఆ లక్షణాన్ని పరమాణుశక్తి సహాయంతో సాధారణమైన గోధుమ మొక్కలలో అతికించి, తెగుళ్ళకు లొంగని గోధుమ జాతిని అమెరికాలో శాస్త్రజ్ఞులు తయారు చేశారు. బార్లి, ఓట్లు తక్కువ కాలంలో పంటనిచ్చేవి, అధిక ఫలసాయం ఇచ్చేవి, తెగుళ్ళకు లొంగనివి, టొమాటోలలో ఎక్కువ పంటనిచ్చేవి, ఆపిల్ పండ్లలో ఆకర్షణీయమైన ఎర్రని రంగు గలవి, కార్నేషన్ మొదలైన పువ్వులలో చిత్రమైన రంగులు గలవి, పీచ్‌పండ్లలో త్వరలో పండేవి మొదలైన మంచి రకాల మొక్కలు పరమాణుశక్తిని వినియోగించి శాస్త్రజ్ఞులు ఇంతవరకు సాధించిన మరికొన్ని ఫలితాలు.

ఇంతేగాక, గోధుమలు మొదలైన ధాన్యాలు నిలవబోసినప్పుడు పురుగు, బూజుపట్టి చెడిపోకుండా ఉంచేటందుకు పరమాణుశక్తి వినియోగపడుతుందనీ, ఆలుగడ్డలు మొదలైన దుంపలు మొక్క మొలిచి పాడైపోకుండా తాజా స్థితిలో చాల కాలం పరమాణుశక్తి నుపయోగించి నిలవచేయ వచ్చుననీ శాస్త్రజ్ఞులు పరిశోధనల ద్వారా తెలుసుకున్నారు. ఈ విధంగా కొన్ని రకాల ఆహార పదార్థాలు కూడా చెడిపోకుండా నిలవ చేసుకునే అవకాశాలున్నాయి.

మన దేశంలో కూడా పరమాణుశక్తిని వినియోగించి వ్యవసాయ వైద్య శాస్త్రాలలో పరిశోధనలు చేయడం ఇటీవల ప్రారంభం అయింది. ఢిల్లీలో ఉన్నత వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోను, కలకత్తాలో బోసు పరిశోధనా సంస్థలోను, బొంబాయిలో అణుశక్తి శాఖవారి యాజమాన్యం క్రింద ఐసోటోపులతోను, అయోకరణ కిరణాలతోను శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేస్తున్నారు. ఉపయోగకరమైన ఫలితాలు లభిస్తున్నాయి.

(15వ పుట చూడుడు)

ప్రభుత్వ నిర్ణయాలు

గ్రామాధికారుల జీతం, వుద్యోగ నిబంధనల విషయం పరిశీలనకై ప్రభుత్వం ముగ్గురు సభ్యులుగల సంఘాన్నొక దానిని నియమించినది. ఈ సంఘంలో రెవిన్యూబోర్డు సభ్యులు శ్రీ కె. ఎమ్. ఉన్నిథన్, శ్రీ రామలాల్‌గార్లు, ఆర్థికశాఖ వుప కార్యదర్శి, శ్రీ కాంతారావు (సభ్యుడు–కార్యదర్శి) గార్లు వున్నారు.

నాన్‌గెజిటెడ్ వుద్యోగి మరణానంతరం అతని కుటుంబానికి అప్పు యివ్వడానికి ప్రభుత్వం నిర్ణయించినది. ఉద్యోగం ఖాయమైనదైనా, తాత్కాలికమైనదైనా యీ సౌకర్యం లభింప చేయబడుతుంది. గరిష్ఠం రూ. 500 లకు మించకుండా రెండు నెలల జీతం అప్పుగా యివ్వబడుతుంది. ఇది ప్రావిడెంటు ఫండ్ నుంచి కాని చనిపోయిన వుద్యోగి వారసునికి చెల్లించ బడే గ్రాట్యుయిటీ నుంచి కాని తిరిగి రాబట్టుకొనబడుతుంది.

రాష్ట్రమంతటికీ వర్తించే "యునైటెడ్ మెడికల్ ప్రాక్టీషనర్ల" చట్టం చేయుటకై చర్య తీసుకొనవలెనని ప్రభుత్వం నిర్ణయించినది. ప్రస్తుతం మద్రాసు చట్టం ఆంధ్ర ప్రాంతానికి, హైదరాబాదు చట్టం తెలంగాణా ప్రాంతానికి వర్తిస్తున్నవి.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్థిక సంస్థ ఫిక్సెడ్ డిపాజిట్లను రూ. 25 లక్షల వరకును, పది సంవత్సరాల బాండ్లను రూ. 50 లక్షల వరకును తీసుకొనుటకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినది.

ఆంధ్రప్రదేశ్ కౌలుదార్లు రైతుల రక్షణ చట్టాన్ని మరి రెండు సంవత్సరాలపాటు అమలులో వుంచాలని ప్రభుత్వం నిర్ణయించినది. ఇప్పుడు ఆంధ్ర ప్రాంతంలోని జమీందారులకు వర్తించే యీ చట్టం 1961 అక్టోబరు 7లో ఆఖరు కావలసి వున్నది.

ఆంధ్రా స్టేట్ సహకార బ్యాంకు ఇండియా స్టేట్ బ్యాంకువద్ద తీసుకొనే అప్పు రూ. 40 లక్షలకు తాను హామీ వుండటానికి ప్రభుత్వం నిర్ణయించినది. ఈ అప్పు ఇనుము, ఉక్కు, విద్యుచ్ఛక్తి మోటార్ల పంపిణీకై వినియోగింప బడగలదు.

చిత్తూరు జిల్లా కుప్పం—వేపనపల్లి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఒక లక్ష రూపాయలను మంజూరు చేసినది.

రాష్ట్రంలో ఒక సైనిక పాఠశాలను నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినది. కేంద్ర ప్రభుత్వం దేశంలో నాలుగు సైనిక పాఠశాలలను నెలకొల్పాలని నిర్ణయించి, వాటిలో ఒక దానిని ఆంధ్ర ప్రదేశ్‌లో తగిన ప్రదేశంలో యేర్పాటు చేయమని సూచించినది. ★

పరమాణు శక్తితో వ్యవసాయ పరిశోధనలు

ఇక్కడ హైదరాబాదులో కూడా ఈ విధమైన పరిశోధనలు ఇప్పుడిప్పుడే ప్రారంభించాం. వరి, వేరుశనగ, ఆముదాలు విత్తనాలను బొంబాయిలో ఉన్న రియాక్టర్‌లో న్యూట్రానుల ప్రసారంలో ఉంచి, వాటి లక్షణాలలో కలిగే మార్పులు పరీక్ష చేస్తూ ఉంటే, ముఖ్యంగా ఆముదాలలో కొన్ని అభివృద్ధి సూచకమైన మార్పులు లభిస్తున్నాయి. బొంబాయిలో స్థాపించబడిన రియాక్టర్ ద్వారా అణుశక్తి శాఖవారు విరివిగా రేడియో ఐసొటోపులు తయారుచేసి, ప్రతి రాష్ట్రంలోను పరిశోధనలు చేసే శాస్త్రజ్ఞులకు త్వరలోనే అందజేస్తారనీ, మన దేశంలో కూడా వ్యవసాయ పరిశోధనలలో పరమాణుశక్తి సాఫల్యంగా వినియోగపడుతుందనీ మనం ఆశించవచ్చును. క్షణ క్షణం పెరుగుతూ ఉన్న ప్రపంచ జనాభాకు సరిపడే తిండి, బట్ట ఉత్పత్తి అవడానికీ, ఆరోగ్య రక్షణకు పరమాణుశక్తి సహాయకారిగా వినియోగించబడే అవకాశాలు చాలా కనబడుతున్నాయి.

పారిశ్రామిక విశేషాలు

(రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అనుదినం అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టబడుతున్నాయి. వాటిని గురించి తెలుసుకోవడం పారిశ్రామిక వేత్తలకూ, ప్రజలకూ ముఖ్యం. కాబట్టి ముఖ్య పారిశ్రామిక విశేషాలు యీ శీర్షిక క్రింద యివ్వబడుతున్నవి.)

కేంద్ర ప్రాజెక్టులు

దక్షిణాదిని భారీ విద్యుచ్ఛక్తి పరికరాల తయారీకి రెండవ ఫ్యాక్టరీని, "ప్రిసిషన్ ఇన్‌స్ట్రుమెంట్ల" ఫ్యాక్టరీని యెక్కడ నెలకొల్పాలన్న విషయం యింకా కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది.

సనత్‌నగరంలో మందుల ఫ్యాక్టరీ స్థాపన కవసరమైన ప్రాథమిక యేర్పాట్లను త్వరితగతిని చేయుటకై కేంద్ర ప్రభుత్వమొక సీనియర్ ఆఫీసర్‌ను నియమించినది. ఆయన ముఖ్య కార్యాలయం హైదరాబాదులో ఉన్నది.

పరిశ్రమల స్థాపనకు సౌకర్యాలు

1961 ఏప్రిల్ తరువాత నెలకొల్పబడిన కొత్త పరిశ్రమలకు తక్కువ రేట్లకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయవలెనని ప్రభుత్వం యిదివరకే వుత్తర్వు చేసినది. ఇప్పుడు నిర్దిష్ట పరిశ్రమల కవసరమైన నిర్ణీతమైన కొన్ని ముడిసరుకులపై ఆక్ట్రాయ్‌పన్నును తగ్గించే విషయం పరిశీలించమని తెలంగాణా ప్రాంతపు మునిసిపల్ కమిటీల అధ్యక్షులను ఆదేశించినది. ఈ సౌకర్యాల వల్ల రాష్ట్రంలో కొత్తపరిశ్రమలు త్వరగా స్థాపింపబడగలవని భావించబడుతున్నది. పారిశ్రామిక ముడివస్తువులపై అమ్మకం పన్ను తగ్గింపు విషయం కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది.

వస్త్ర పరిశ్రమ

రాష్ట్రంలో ప్రత్తి లభించి నూలు యెక్కువగా వాడకం అవుతుంది. కాబట్టి తృతీయ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఆంధ్రప్రదేశ్‌కి తగినన్ని కదుళ్ళు కేటాయించమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగినది. కొత్త వస్త్రాల మిల్లుల స్థాపనను, ప్రస్తుతపు వాటి విస్తరణను కోరే దరఖాస్తులు కూడ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయబడినవి.

పంచదార పరిశ్రమ

సహకార రంగంలో పంచదార పరిశ్రమ అభివృద్ధిని గమనిస్తూ, జరిగిన పనిని సమన్వయపరచి, శీఘ్రాభివృద్ధికి చర్య తీసుకొనే నిమిత్తం ప్రభుత్వం ఒక "సహకార పంచదార ఫ్యాక్టరీల కమిటీ"ని, ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన యేర్పాటు చేసినది.

దేశంలో పంచదార మిగులు తేలుతున్నందున, మిగులు సరుకు యెగుమతి యేర్పాట్లకు కుదిరేవరకు మిచ్చేవరకు, తృతీయ పంచవర్ష ప్రణాళిక క్రింద పంచదార అదనపు వుత్పత్తికి లైసెన్సులివ్వటం తాత్కాలికంగా నిలిపివుంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినది.

నిజాం పంచదార ఫ్యాక్టరీ

నిజాం పంచదార ఫ్యాక్టరీ విస్తరణ కార్యక్రమం జరుగుతున్నది.

ఈ ఫ్యాక్టరీలో ఉత్పత్తి మళ్ళీ హెచ్చినది. 1961 ఏప్రిల్ ఆఖరుకు 5,68,116 టన్నుల చెఱకు ఆడబడి, 6,06,496 బస్తాల పంచదార తయారు చేయబడినది. క్రితం సంవత్సరం 4,91,313 టన్నుల చెఱకు మాత్రమే ఆడబడి, 5,06,496 బస్తాల పంచదార మాత్రమే తయారైనది. ఈ ఫ్యాక్టరీలో హెచ్చు వుత్పత్తిని

సాధించుటకై ప్రవేశపెట్టిన "ఫలితాలను బట్టి డబ్బు చెల్లింపు" పథకం యింకా కొనసాగుతూనే వున్నది.

సింగరేణి బొగ్గు గనులు

బెల్లంపల్లి రైలు స్టేషన్‌కి యేడు మైళ్ళు తూర్పున గల రామకృష్ణాపురం ప్రాంతంలో ఒక క్రొత్త బొగ్గుగని తెరువబడినది. ఈ ప్రాంతంలో యింతవరకు జరిగిన పనివల్ల 3 కోట్ల టన్నుల బొగ్గు లభించగలదని తేలినది. ఈ పని ముగిసే సరికి మరి 10 కోట్ల టన్నుల బొగ్గు విషయం తేలవచ్చు. ఈ ప్రాంతంలో మే 10న తెరువబడిన రెండు గనులకు రవీంద్రనాధ టాగూర్, మోతీలాల్ నెహ్రూల శత జయంత్యుత్సవ స్మృతి చిహ్నంగా వారి పేర్లు వుంచబడినవి. ఈ గనులలో సంవత్సరానికి 5 లక్షల టన్నుల చొప్పున దాదాపు 20 సంవత్సరాలపాటు బొగ్గును త్రవ్వకోవచ్చు. బొగ్గు యింకా లోతున దొరికితే 20 సంవత్సరాల కంటె యెక్కువ కాలమే త్రవ్వుకోవచ్చు.

తృతీయ పంచవర్ష ప్రణాళికలో సింగరేణి బొగ్గు గనుల లక్ష్యం 56 లక్షల టన్నులుగా నిర్ణయించబడినది. ఈ బొగ్గుగనుల ప్రస్తుత వుత్పత్తి 26 లక్షల టన్నులు మాత్రమే.

ప్రాగాటూల్సు కార్పొరేషన్

సనత్‌నగరం పారిశ్రామిక కేంద్రంలో ప్రాగాటూల్సు కార్పొరేషన్ నెలకొల్పిన సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ మనూభాయ్ షా ప్రారంభించారు. ప్రాగా సంస్థ విస్తరణ కార్యక్రమం క్రింద అవసరమైన అదనపు సాంకేతిక సిబ్బంది తయారీకై యీ కేంద్రం యేర్పడినది. హైదరాబాదులోను, దాని చుట్టుపట్ల గల చిన్న తదితర పరిశ్రమలకు కావలసిన చేతిపని వారి శిక్షణ విషయంలో కూడ యీ కేంద్రం తోడ్పడవచ్చు. శిక్షణకాలం రెండు సంవత్సరాలలోను 18 నెలలు కేంద్రంలోను, మిగిలిన కాలం ఫ్యాక్టరీ ప్రోసెసింగ్ షాపులలోను గడుస్తుంది. టర్నర్‌లు, ఫిట్టర్లు, మెకనిస్టుల వ్యాపారాలలో సిద్ధాంత, ఆచరణలు రెండిటి దృష్ట్యాను ఆరంభంలో 40 మందికి శిక్షణ యివ్వబడుతుంది.

"లోకుల దుఃఖములు దూరము చేయుటకు తగిన ఉపాయములన్నిటిని జెప్పుట నాధర్మము. స్వాతంత్ర్యము గోరువారు తమ తమ యుపాయములన్నిటిని ఎఱిగి యుండవలెను. సామాన్యముగా ఉపాయములన్నియు హింసాత్మకములు. సత్యాగ్రహమే అహింసాత్మకమగు శస్త్రము. దాని యుపయోగము, దాని మేరలను జెప్పుట అనగా దాని ప్రయోగోప సంహారములు జెప్పుట నా ధర్మము".

— గాంధిజీ.

నల్గొండ జిల్లాలో :

ఉత్తమ గ్రామం

నల్గొండ సమీపంలో గల చిన్న గ్రామం మునుగోడు ఆ జిల్లాలో 1960-61కి 'ఉత్తమ గ్రామం'గా ప్రకటింపబడినది. అనేక ముఖ్య విషయాలల్లో ఒకటిగా వార్తా పత్రికలలో యెక్కడో యీ విషయం ప్రకటింపబడినా లోకాని కంతగా తెలియదు. కాని ప్రపంచ విశేషాల హడావిడి సద్దుమణిగాక, నవభారత దేశంలో ప్రశాంతంగా జరిగే విప్లవాన్ని గురించి చరిత్రకారులు వ్రాస్తారు. నవభారత దేశమంటే అసంఖ్యాకమైన "మునుగోడు"ల సమీకరణమే కదా! కాబట్టి మునుగోడు కథ మనం అవశ్యం వినవలసినది.

ఈ గ్రామం నల్గొండ జిల్లా ముఖ్యపట్టణం నల్గొండ పట్టణానికి పశ్చిమాన 14 మైళ్ళ దూరంలో ఉన్నది. దీని జనసంఖ్య 3.800. ఇది నారాయణపురం బ్లాకు లోనిది.

ఇక్కడి ప్రజలంతా ప్రణాళికా లాభాలను పూర్తిగా పొందాలని తహ తహ లాడుతూ వుంటారు. ఇందు నిమిత్తం వారు తమ శక్తికొలదీ విరాళాలిస్తారు. ఉదాహరణకు, గుర్రం చంద్రయ్యను తీసుకోవచ్చు. ఇతని వయస్సు 30 సంవత్సరాలు. ఇతడు చెమటోడ్చి జీవించే వ్యవసాయ కూలీ. ఇతడు వున్నట్టుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ. 250 విరాళం యిచ్చాడు. అలా యెందుకు యిచ్చావని అడుగగా యిలా అన్నాడు. "ఆ కేంద్రం మాది. అది మా ఆరోగ్యాన్ని చక్కజేస్తుంది." అతని కళ్లలో వెలిగిన కాంతి, ఒక పద్ధతి ప్రకారం జరిగే జీవిత విధానం సామర్థ్యంలో అతనికి గల పరమ విశ్వాసం–యివి కాలు కదపకుండా కుర్చీలో కూర్చొని విమర్శలు సాగించేవారికి చక్కని గుణపాఠమని చెప్పవచ్చు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ. 10,000లు మునుగోడు, దాని చుట్టుపట్ల గల కొన్ని గ్రామాలలో సేకరించబడినవి. ఇందులో, మునుగోడు గ్రామస్థులు రూ. 5000 లు యిచ్చారు. ఈ కేంద్రం పని మొదలిడినప్పుడు ఒక ఎమ్. బి. బి. ఎస్. డాక్టర్ (పురుషుడు), యితర సహాయక సిబ్బంది వుంటారు. ఈ కేంద్రం నిర్మాణానికై ఆ గ్రామ రైతులు యిద్దరు– శ్రీ కె. రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు– 3 యెకరాల భూమిని యిచ్చారు. శాశ్వత భవనం నిర్మితమయే పర్యంతం, యీ కేంద్రం ఒక అద్దె యింటిలో నడుపబడుతుంది. అద్దెను ప్రజలు భరిస్తారు.

ప్రాథమిక పాఠశాల

ఇక్కడ ప్రాథమిక పాఠశాలా భవనం రూ. 13,000 లతో నిర్మించబడినది. ఇందులో రూ. 4,000 ప్రజలు పరమ సంతోషంతో యిచ్చారు. 5, 6, 7 తరగతులను నడుపుటకై యిటీవలి వరకు గ్రామస్థులే సాలుకు రూ. 3,000 యిస్తూ వచ్చారు. ప్రజల యీ ఆసక్తిని చూసి ప్రభుత్వం యితర తరగతులను ఆరంభించినది. ఈ విధంగా గడచిన మూడు సంవత్సరాలుగా మునుగోడులో పున్నత పాఠశాల నడుస్తున్నది. ఈ గ్రామంలో ఒక సీనియర్ బేసిక్ పాఠశాల కూడ వున్నది. ఈ సంస్థకై ప్రజలు 6 యెకరాల భూమిని సంపాదించారు. ఈ గ్రామంలో యింత వరకు 4 వయోజన విద్యా శిక్షణ తరగతులు నడచినవి. అయిదవది నడుస్తున్నది. ఒక్కొక్క తరగతి నడచిన కాలంలో సరాసరిని 40 మంది కార్మికులు అక్షరాస్యులు చేయబడ్డారు. ఈ తరగతులకు హాజరై చదువు, వ్రాత, లెక్కలు నేర్చుకొనడంలో కార్మికు

లెంతో ఆసక్తిని చూపారుట. పాఠశాలా విద్యార్థులు ఒక ఆరు బయలు నాటక మందిరాన్ని నిర్మించారు.

గిడ్డంగి

ఈ గ్రామంలో వ్యవసాయశాఖ అధ్వర్యాన ఒక వ్యవసాయ గిడ్డంగి నడుస్తున్నది. ఈ గిడ్డంగి అద్దెను ప్రజలు చెల్లిస్తున్నారు. ఈ గిడ్డంగి ద్వారా (అమ్మకం లేక అప్పుమీద యివ్వబడటం) రూ. 20,000 కిమ్మతుగల విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారులు మొదలగునవి సరఫరా చేయబడినవి. పంచాయతీ కలుపుతీత సాధనాలు, నాగళ్లు, దస్తర్లు వగైరా వ్యవసాయ పరికరాలను కూడ కొన్నది. వాటిని, గ్రామంలో రైతులు తమకు అవసరమైనప్పుడు ఎరువు తీసుకుంటూ వుంటారు. 50 మంది అభ్యుదయ రైతులు పొలాలను జపాను పద్ధతిలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం యీ పద్ధతి క్రింద దాదాపు 200 ఎకరాలున్నవి. పంచాయతీ 50 పెంట ఎరువు గుంటలను త్రవ్వించగా ప్రజలు 600 గుంటలను త్రవ్వారు.

1958లో 11 మంది సభ్యులతో ఒక సహకార పరపతి సంఘం ఆరంభించబడినది. ఈనాడు దానిలో 63 మంది సభ్యులున్నారు. ఇక్కడ మొత్తం 850 మంది సభ్యులుగల నేతపని వారి సహకార సంఘం కూడా ఒకటి వున్నది. ఈ సంఘం నిర్వహణ (వర్కింగ్) మూలధనం రూ. 1 1/2 లక్షలు కాగా, వాటా మూలధనం దాదాపు రూ. 25,000లు. చుట్టుపట్ల గల 24 గ్రామాలు యీ సంఘం సేవను పొందుతున్నవి. ఈ సంఘానికి ప్రస్తుతం నల్గొండ, యాచారం, ఆరుట్ల (చివరి రెండు హైదరాబాదు జిల్లాలో వున్నాయి) మూడు అమ్మకం షాపులున్నవి. త్వరలోనే 32మంది సభ్యులతో ఒక నూనెగానుగల (వారి) సంఘం కూడ ఆరంభించబడ బోతున్నది.

గ్రామంలో 4 బావుల నిర్మాణానికై ప్రజలు రూ. 850/-లను యిచ్చారు. మూడు బావులు పంచాయతీ సొమ్మునుంచి, ఒకటి జిల్లాబోర్డు చేత త్రవ్వించబడినవి. స్థానిక శివాలయాన్ని ప్రజలు రూ. 1000లతో బాగు చేయించారు. గ్రామంలో ఒక సామూహిక రేడియో సెట్టు వున్నది. పంచాయతీ ఒక ముర్రా గేదెను కూడా పోషిస్తున్నది. బ్లాకు అధికారులు కమ్మరులకు, వడ్రంగులకు సగం ఖర్చు ప్రాతిపదికపై (ఈ వృత్తి పనివారు ఖర్చులోసగాన్ని భరించాలి.) వుత్తమ పరికరాలను సరఫరా చేస్తున్నారు. మునుగోడు వృత్తి పనివారు యీ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. ఊళ్ళో ఒక మహిళా మండలి, యువజనుల క్లబ్బు కూడ వున్నవి.

పొదుపు ఉద్యమం

ఈ గ్రామంలో యింతవరకు రూ. 8000 విలువగల బహుమతి బాండ్లు అమ్మబడినవి. ఒక్క సంవత్సరంలో రూ. 5,500 విలువగల సేవింగ్స్ సర్టిఫికెట్లు కొనబడినవి.

గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ ఎమ్. ఎ. సత్తారికి —యీయన పదవీకాలంలో గ్రామానికి చెందిన అభివృద్ధి కార్యకలాపాలలో పెక్కు అమలు పరచబడినవి— బొంబాయితో జరిగిన మొదటి బహుమతి బాండ్ల "డ్రా"లో రూ. 1000 బహుమతి లభించినది. ఈ బహుమతి సొమ్ముతో ఆయన ఒక బావిని త్రవ్వించి, రెండు ఎకరాలలో తోట వేశారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ నడిపిన జిల్లా సంగీత నాటక గోష్ఠిలో, జిల్లా పరిషత్ హైస్కూలు మాజీ ప్రధానోపాధ్యాయుడు శ్రీ ఎమ్. వీరయ్యకు 1959-60కి వుత్తమ ఆర్గనైజర్ షీల్డు లభించినది.

మునుగోడు నల్గొండ జిల్లా గ్రామాలు అనేకంలో ఒకటైనా వాటికి, దానికి యెంతో భేదమున్నది. అక్కడి ప్రజలకు ప్రణాళిక గురించి బాగా తెలుసు. ఉత్తమ జీవితానికై వారు ముహోత్కంఠులై వున్నారు. అందు నిమిత్తం వారు చేసే కృషి మూపరులను ముగ్ధులను చేస్తున్నది.

ఒక్క మాటలో, మునుగోడు ప్రగతి చిహ్నం.

గొలుసు

బుచ్చిబాబు

(గతసంచిక తరువాయి)

మూడో అంకం

(తెర లేవగానే, కుటుంబయ్యగారి ఇంట్లో గది—శాంతమ్మ, **లక్ష్మి**, గదంతా బాగు చేస్తూంటారు.)

శాంత: ఏం లక్ష్మి,— ఇవాళ రిహార్సల్‌కి రాలేదేం? దిగులుగా వున్నట్లున్నావ్—మా మోహన్ అన్నయ్య, వెళ్ళి కనుక్కోరావే అని పదిసార్లు చెప్పాడు.

లక్ష్మి: ఏం చెప్పను శాంతా— నాటకంలో వెయ్యడం మా నాన్న కిష్టంలేదు. నాకు పెళ్ళి కాదుట. తల్లిలేని పిల్ల అని సంబంధాలు రావడం లేదట. ఆ కొరత లేకుండా, తాను మళ్ళా పెళ్ళిచేసుకుని, ఆ వొచ్చిన కట్నంలో భాగం, నా కట్నంగా ఇచ్చి నాకు సంబంధం కుదురుస్తాడుట,

శాంత: అదేమిటి—అన్యాయం. చాలా పెద్దపధకం వేశాడే మీనాన్న ఏమో అనుకున్నాను. చూడు లక్ష్మి—నేనొకటి అడగనా?

లక్ష్మి: అడుగు శాంతా—

శాంత: మరేమీ అనుకోకేం—నీకు మా మోహనం అన్నయ్యంటే ఇష్టం.

లక్ష్మి: అవుతే ?

శాంత: అవుతే కాదు— అవునను చెప్తా.

లక్ష్మి: ఏమో ఇష్టం అంటే ఏమిటో తెలీదు. రిహార్సల్స్‌లో పరిచయం అయింది. చనువుగా, ఆదరంగా మాట్లాడాడు.

శాంత: అన్నయ్యకి నువ్వంటే ప్రాణం.

లక్ష్మి: నీతో అన్నాడా ?

శాంత: అన్లేదనుకో—కాని గ్రహించాను. నీకూ ఇష్టమే—అవునా?

లక్ష్మి: నాకు తెలీదు బాబు!

శాంత: ఓ యబ్బ—ఆ మాత్రం తెలీని చిన్నారి పట్టివి—చదువుకున్నదానివేగా—వాడు రేపు మార్చిలో ఇంజనీరింగ్ పరీక్ష పూర్తి చేస్తాడు. ఇక్కడ ఎక్స్‌టెన్షన్ బ్లాక్‌లోనే ఇంజనీరుగా తీసుకుంటారు. తరవాత, స్కాలర్‌షిప్ మీద కెనడా కూడా పంపుతారుట. కట్నం గిట్నం వుండదు — హాయిగా పెళ్ళి చేసుకోరాదు! ఎదెల్లా వున్నా, సవతితల్లి బెడధ తప్పుతుంది—

లక్ష్మి: ఏమో శాంతా—ఇప్పుడున్నట్లుగా ఎప్పుడూ వుండిపోతే బావుండును. ఇందులోంచి పారిపోతే, మరెందులో చిక్కుకుంటామోనని భయమేస్తుంది.

(పరంధామయ్య వొస్తాడు. ఒక సంచిలోంచి కొన్ని కుట్టు సామాను, దుస్తులుతీసి, లక్ష్మికి వొకటి, శాంతకి వొకటి ఇస్తాడు).

శాంత: ఊర్నించి ఎప్పుడొచ్చారు పరంధామయ్యగారూ. చాలా థాంక్స్. చాలా బాగుంది ఈ చీర. ఎంతైందండి?

పరంధా: ఎంతైతేనేం లే— రేపు వార్షికోత్సవంనాడు మీ ఇద్దరూ వీటిని ధరించాలి. ఏం?

లక్ష్మి: మీరెంత మంచివారు పరంధామయ్యగారు— నిజంగా— ఏమనాలో—ఎల్లా థ్యాంక్ చెయ్యాలో... తెలీడంలేదు,

పరంధా: మీ నాన్నేడీ?

కుటుం: (మెల్లిగా దగ్గుతూ ప్రవేశిస్తాడు)
ఏం పరంధామయ్యా–నన్ను ఈ అధికారులు బ్రతకనీడం లేదు. దొడ్లోగోడ పడగొడతారుట. ఆ పది గజాల భూమి భుక్తం చేసుకుంటారుట. బ్రతిమాలడం పోయి, బెదిరింపులోకి దిగారు.

పరంధా: పోనీ ఇచ్చెయ్యకూడదు? అటునుండి కాని రోడ్డు పడదుట—తిన్నగా రేవులోకి రోడ్డువేసి, వంతెన కడతారట. మా దొడ్లోంచి, భేషుగ్గా పోనిచ్చుకోమన్నాను.

కుటుం: నీకేం చెబుతావ్– బోలెడు భూముంది, ఆస్తుంది, భవనాలున్నాయి—సంతానం లేదాయె.

పరంధా: ఆ– మరిచాను. అంటె మరిచిపోవడం జ్ఞాపకం వుంచుకున్నాను—ఒక వార్త—సిగ్గేస్తోంది—

లక్ష్మి: చెప్పండి పరంధామయ్యగారూ.

శాంత: ఈ చీరలు అవీ చూసి అప్పుడే అనుకున్నాను.

పరంధా: ఊహించండి—చెప్పను. వెళ్ళిపోతా—

కుటుం: ఏమిటి పరంధామయ్య. పెండ్లికూతురుకి మళ్ళే సిగ్గుపడుతున్నావ్?

(రామయోగి వొస్తాడు)

రామయోగి: ఈరోజుల్లో పెళ్ళికూతుళ్ళు చదువుకున్నవారు గావున సిగ్గుపడటం అరుదు. సిగ్గు మొగాళ్లలో చూసి తృప్తి పడాలి మరి—

కుటుం: పరంధామయ్య చెప్పలేకపోతున్నాడు ఏదో వార్తట.

రామయోగి: నే చెప్పనా? మీరు తండ్రి కాబోతున్నారు. అవునా పరంధామయ్యగారూ?

పరంధా: (సంతోషంతో మాటరాక తబ్బిబ్బవుతాడు.)
ఆ– ఆ– అట్లాంటిది—అదే.

కుటుం: ఆ– నిజంగా– నీకు?...నువ్వు?

(పెద్దకేక వేస్తాడు)

రామయోగి: కేవలం ఆయనకే...

(కాసేపు నిశ్శబ్దం. నిమిషం అయ్యాక శాంత, లక్ష్మి పెద్దగా నవ్వుతారు.)

రామ: ఏమిటండోయ్– మీ కథ చూస్తే మా ముందే ప్రసవించేటట్లుగా వుంది—వివరంగా– తేరుకుని చెప్పండి.

పరంధా: అటు తిరిగి చెప్తాను (పక్కకు తిరుగుతాడు.)
నాలుగైదు నెలలక్రితం రాజాపురంలో కుటుంబ నిర్ణీత పద్ధతి ప్రచార శాఖ చూడ్డానికెళ్ళాం— నేను ఆవిడాను. అక్కడో డాక్టరుంది—కాన్పుల స్పెషలిస్టు. అంతా పరీక్ష చేసింది? చిన్న ఆపరేషన్ లాంటిది జరిపింది. అంతే.

కుటుం: మీకు ఆపరేషనా—ఎక్కడండి?

పరంధా: నాక్కాదయ్యా—ఆమెకి. రెండు నెల్లుగా ఎల్లాగో వుందంటె, మళ్ళా ఆవిడ దగ్గరకి తీసుకెళ్ళి చూపించా– సందేహం లేదు. అదే అంది.

కుటుం: మంచివార్త. సంతోషించాల్సిందే.

రామ: అయినా సంతాన నిరోధం పద్ధతుల గుడారంలో పనిచేసే ఆ లేడీ డాక్టర్, పిల్లలుపుట్టే మార్గం బోధించడం ఏం బాగుంది?

పరంధా: అక్కడ రెండు రకాల సలహాలూ ఇస్తారుట. మాకింక వొద్దు మొర్రో అంటున్న కుటుంబయ్యలాంటి వాళ్లకి ఇహ సంతానం కలగకుండా వుండే పద్ధతులూ చెప్తారు—సరే. వారికెల్లానూ ఆ సమస్య లేదనుకో.

కుటుం. పూర్తిగా లేదనడానికి వీల్లేదు.

రామ: అంటే ?

పరంధా: ఏమో—మరేం తప్పుమాట అనలేదు గద.

రామ: ఇట్లాంటివి జరుగుతాయనే, సంతాన నిరోధం పద్ధతుల ప్రచారం మంచిది కాదనీ, అవి తెలుసుకున్నవారు దుర్వినియోగం చేస్తారనీ ప్రజ మొత్తుకుంటున్నారు— బలే పెద్ద మనుషులే.

కుటుం: ఏమిటని నీ ఊహ! గ్రహించలేవు? నేనేం దుర్వినియోగం చెయ్యలేదు. నేనేం వృద్ధుణ్ణికాను... ఇంకా ముందు బోలెడు జీవితం వుంది. వెనక బోలెడు సంసారం వుంది. వారి గతేమిటి? వారి నెవరు చూస్తారు? ఇంటో కనుక్కునే వారెవరు? రేపు నే మంచాన పడితే గొంతులో నీళ్ళు పోసే వారు మీలో వొక్కరున్నారా?

లక్ష్మి: నాన్నా—నీకు బెంగెందుకు నాన్నా? నేవున్నాను నిన్ను కనిపెట్టుకుని వుండడానికి, సరేనా?

కుటుం: ఇప్పుడట్లాగే అంటావు లక్ష్మి— నీ ఇద్దరక్కలు ఏమయ్యారు? వాళ్ళ వాళ్ళ మొగుళ్లతో హాయిగా కాపరాలకెళ్ళారు. పండగలకి వాళ్ళ సంతానానికి ఏమీ పంపలేదని ఈసడిస్తూ ఉత్తరాల పరంపర కురిపిస్తున్నారు.

లక్ష్మి: చెప్పేది విను నాన్నా—నీ కోసం, నేను పెండ్లి చేసుకోను సరేనా?

కుటుం: ఈడొచ్చిన పిల్లకి పెండ్లి చెయ్యక అమ్మాయి జీవితం పాడు చేశాడని ఊళ్ళో నలుగురూ నన్ను ఆడిపోయరటమ్మా.

లక్ష్మి: మరైతే ఏం చెయ్యమంటావు నాన్నా—నీ కెట్లా కావాలంటే అట్లాగే చేస్తాను. చెప్పు.

కుటుం: నీకు చిన్నతనం—నడివయస్కుల సమస్యలు మీకర్థం కావు. జీవితంలో మొదటి సగం దలితండ్రులు, రెండో సగం సంతానమూ ధ్వంసం చేస్తారన్నా డొకాయన. నాకింకా బోలెడు జీవితం వుంది, కోర్కెలున్నాయి. ఆశ యూ లున్నాయి.

రామ: ఇంకా కలలు కంటున్నారా కుటుంబయ్యగారూ- పిల్లల బదులు? బోలెడు మంది అమాయక ప్రాణులని లోకంలోకి తెచ్చారు. ఉన్నది కాస్తా తగలేసి, పెళ్ళిళ్ళుచేసి అత్తవారిళ్లకి సాగనంపారు—మిగతా వారికి చదువులేదు. వినోదం లేదు, వికాసం లేదు—ఇవి చాలక మరో వివాహం— మరో అరడజను సంతానం-స్వార్థానికి అంతుండాలి కుటుంబయ్యగారూ! మీరు తలపెట్టిన పని—హత్య, సంఘం వొప్పుకోదు?

కుటుం: నేనొంటిగా దిక్కులేక మంచాన పడిచస్తే హత్య కదూ? సంఘం పూరుకొంటుందేం?

రామ: మీరు పెళ్ళి చేసుకోండి—విర్రవీగండి. మీ ఇష్టం; మీకు హక్కుంది—కాని కొత్త ప్రాణులను తెచ్చి, రౌడీల కిందా, నేరస్థులకిందా తయారుచేసి దేశంపై వదిలే హక్కులేదు.

లక్ష్మి: అట్లాంటి మాటలనకండి రామయోగిగారూ— ఇప్పుడు మాలో ఎవరూ అట్లాంటివారు లేరు.

పరం: పుట్టగానే అంతా మంచివారే పోషణ, ఇంటి వాతావరణం, ఆర్థిక సాంఘిక పరిస్థితులు, తలిదండ్రుల నుండి సంక్రమించిన శీలం—వీటిని బట్టి, సంతానం గుణగణాలు ఏర్పడతాయని, వారి భావం—.

రామ: కరెక్టు. చిరుతిండికి నాన్న డబ్బివ్వకపోతే అబ్బాయి దొంగతనానికి వొడిగట్టడూ?—కట్నం ఇచ్చి పెళ్ళి చెయ్యలేడు—చదువు, సంగీతం చెప్పించడు—జీవితం వెళ్ళబోసుకునేందుకు వొక వృత్తి, వ్యాపకం కల్పించలేడు—ఈడొచ్చిన అమ్మాయి ఏం చేస్తుంది-? నే చెప్పనక్కర్లేదు. అట్లాంటి వ్యక్తి, తనకీ, సమాజానికి ఎంతటి అపచారం చేస్తుందో వేరే చెప్పాలా?

శాంత: ఏం దారుణంగా మాట్లాడేస్తున్నారు—నా గురించే కాదూ? మీరిట్లాగంటే మర్యాదగా వుండదు

రామ: నీ విషయం కాదు. ఏదో చదువు చెప్పించాడు మీ నాన్న. ఇంత గడించుకుంటున్నావ్. నువ్వు ఏం చేసి నా చెల్లిపోతుంది.

కుటుం: అట్లాంటి ఏర్పాటు లక్ష్మికి చెయ్యాలనే నా ఆలోచన.

పరం: ఏ విధంగా ?

కుటుం: వొచ్చిన సంబంధం మంచిది— స్థితిపరులు. బోలెడు కట్నం ఇస్తారుట.

రామ: వాట్—హోలి హారి—నాకు హారిలో- అసలు ఏ దైవంలోనూ నమ్మకం లేదనుకోండి—ఎవడయ్యా కట్నంపోసి నీకు పిల్లనిస్తానని ఎగబడిన అభాగ్యుడు?

కుటుం: ఛ. ఛ

పరం: ఎవరో వుంటారు.

రామ: మీకు ఏం ఆస్తుందని చూసి వాళ్ల కట్నం ఇస్తారు? అసలు కట్నం ఇవ్వడమే అపచారం, క్రైమ్. మీ యవ్వనం చూశా? హోదా చూశా, సంతాన పరంపరా సోపానం చూశా? దేన్ని చూసి? ఈ పెళ్ళి జరిగితే ఈజిప్టులో కాటకం, హంగెరీలో కరువు, ఆఫ్రికాలో భూకంపం, అస్సామ్‌లో అరిష్టం సంప్రాప్తమవుతాయి.

పరం: అదేవిటి—దానికీ వాటికీ సంబంధం ఏమిటి— నీదంతా చిత్రంగా వుందే!

రామ: కుటుంబయ్యగారు చేసుకోబోయే పిల్ల చక్కంది అనుకుందాం...కన్య—వొక యువకుణ్ణి ఈ పాటికి ప్రేమించే వుంటుంది, అది లా ఆఫ్ లైఫ్. యవ్వనం, యవ్వనాన్ని కోరుతుంది—క్షమించాలి- ఇక్కడ పెండ్లికాని స్త్రీలున్నారు. విత్ అపోలజీస్ టుదెమ్- దేన్ని చూసో మనకి తెలీదు; ఈకి ఆస్తుందనుకున్నారో—ముందు పార్లమెంట్ మెంబరవుతాడనుకున్నారో—లేక కేవలం జాతకాలు కలిశాయన్న అవన్లు మాటపైనో—ఆ యేమీ కాకపోతే, ఈ క్రైమ్‌లో ఇన్సురెన్సు డబ్బు చేతికొచ్చిందో—సరే వారికిస్తామని నిర్ణయించారు ఆ బంగారు కొలికిని. సరే పెండ్లి ఏర్పాటు చేశారు. తండ్రి మాట తోసెయ్యలేక, బలవంతాన చేసుకుంటుంది. వెనక తాను ప్రేమించిన యువకుడి హృదయం భగ్నమవుతుంది. రైల్వేలో సిగ్నల్‌మాన్‌గా వున్నాడనుకుందాం అతను. అతని ఆలోచనలన్నీ ఎప్పుడూ మరొకర్ని వివాహం చేసుకుని కుసిళ్ళి పోతున్న ప్రేయసిని గురించే— మతిచెడి, తప్పుడు సిగ్నల్ ఇస్తాడు, వొస్తూన్న గూడ్స్‌బండి పట్టాలు తప్పి బోల్తాపడుతుంది—ప్రమాదం జరుగుతుంది. ఆ గుడ్స్‌లో అస్సామ్‌కి వెళ్ళాల్సిన ధాన్యం వుంది— ఆ ధాన్యం సకాలా

వికి వారికందదు. అక్కడ ఫ్యాక్టరీ వారికి ఆ రోజు తిండుండదు. పని చెయ్యలేరు. నూనె మరలు నిలిచి పోతాయి.

● ముడిపదార్థం, హంగెరీకి ఎగుమతి అవదు. అక్కడి వారు వాటి కోసం ఎదురు చూస్తూంటారు. అందులో వొకడి బావమరిది ఈజిప్టులో పనిచేస్తూంటాడు—ఇతని భార్య వారిదగ్గరుంటుంది. మొగుడికి పిచ్చెక్కి చనిపొయ్యాడన్న వార్త వినగానే ఆమెకి మతిచెలించి బొగ్గుగనిలో ప్రేల్పుడు జరుపుతుంది. కొన్ని వేల మంది చస్తారు. అక్కడ నుండి సకాలానికి నూనె వగైరా ఎగుమతి కాక విమానాలు, రైళ్లు నిలిచిపోతాయి. ఆఫ్రికాలో జరిగే కలహాలని ఆపేటందుకు సేనలు, పరికరాలు అందవు. అంతర్జాతీయ యుద్ధం తప్పదు.

పరంధా: ఇదంతా వింటూంటే అసలు నే పెళ్ళి ఎందుకు చేసుకున్నానా అని బెంగేస్తోంది.

కాంత: ఇన్ని చెప్పారు రామయోగిగారు మాత్రం పెండ్లి చేసుకోరేమోలెండి—ఏమండి, అంతేనా?

రామ: చెప్పమే– ఆదర్శప్రేయసి దొరకాలిగా— దొరికినా, ఆమె దృష్టిలో నేను ఆదర్శమూర్తిని కావాలిగా. ఈ రెండూ జరిగి చేసుకున్నా—అంతా వొక పద్ధతి ప్రకారం జరుగుతుంది— నా వయస్సెంత? ఆస్థిపాస్తు లెట్టివి? ఎందర్ని పోషించగలను ఇవన్నీ భార్యా రత్నంతో కూడాబలుక్కుని...

కాంత: ఆ మహా ఇల్లాలెవరో తెలుసుకో వచ్చా?

రామ: ఫ్రాంక్‌గా. నిర్మోహమాటంగా మంచిచెడ్డలు తర్కించగల స్త్రీయే ఆ మహా ఇల్లాలు. ఏదో– వొక మొగపిల్లాడు— మరో మూడేళ్ళకి, ఆదాయం కాస్త పెరిగాక, ఈసారి వో ఆడపిల్ల,— ఫరెఛేంజ్– దెన్‌స్టాప్. నేటి నలభైకోట్ల జనాభాలోనూ 184 లక్షల మందికి మాత్రం కుటుంబ నియంత్రణం ఆవశ్యకత, పద్ధతులు తెలుసు. ప్రతి రాష్ట్రంలోనూ కొన్ని ప్రాంతాలలో ఈ నియంత్రణ కేంద్రాలు స్థాపించి, అక్కడి ప్రజలకు ఈ ప్రక్రియలు ప్రచారంచేసి, అమలు జరపాలని కేంద్ర ప్రభుత్వం పూనుకుంది. ఇప్పుడు నజాప్‌గర్‌లో వొక కేంద్రం పని చేస్తూంది. ఛాందసులు, తెలివి హీనులు, స్వార్థపరులు, అమాయకులు చేసే విమర్శలూ, కల్పించే అవరోధాలకూ తట్టుకుని, వారు సాధించిన ఫలితాలు తృప్తికరంగా వున్నట్లు తెలుస్తోంది.

కాంత: పత్రికా విలేఖరి ధోరణిలో చెబుతున్నారు సరేకాని—ఈ నియంత్రణ పథకం కూడా సంక్షేమ కేంద్రంలో వొక విభాగంగా కాకుండా, వొక ప్రత్యేక శాఖగా నెలకొల్పి ప్రచారం చేస్తే బావుండును. నాబోటి వారిచేత, ఈ ముఖ్యమైన శాఖ లేక, సంబంధంలేని అడ్డమైన పనులన్నీ చేయిస్తున్నారు.

రామ: ఓ అంగనా నీ పేరు వోరిమి! బిషేషంట్. దాన్ని ప్రత్యేక శాఖగా నెలకొల్పాలనే కేంద్రం ఆలోచిస్తూంది. వీలైతే లోక్ సభ సభ్యులు కొందర్ని సలహా సంఘంలో నియమిస్తే–

పరం: ఆ కొందరూ కలిసి ఏపనీ కొనసాగనివ్వరు—కమిటీఅంటె అంతేగా—

రామ: ప్రతివారికీ ప్రభుత్వాన్ని ఆక్షేపించడం వొక ఫాషనైంది. మనం ఏమీ చెయ్యం. బద్ధకపు చక్రవర్తులం. ప్రతిదీ ప్రభుత్వం చెయ్యాలి—పెళ్ళిళ్ళు, పిల్లల్ని కనడం, తిండి తినడం ప్రతిదీ—వారు జోక్యం కలగచేసుకోకపోతే, ఏమీ చెయ్యడం లేదని సుసుగుడు—చేస్తే విరుచుకు పడడం—

పరం: నాయనా, ఉపసంహరించుకుంటా ఎదన్నా పొరబాటు ప్రతిపాదన చేసివుంటే.

రామ: ఏమీ లేదు, నే చెబుతున్నది అట్లాంటి పెద్దలు సలహాదారులుగా నియమిస్తే ప్రజకి గురి హెచ్చుతుంది. చిత్రం, ఈ నియంత్రణ విషయంలో పురుషులకంటె స్త్రీలే ముందంజ వేస్తున్నారు.

పరంధా: అవును మరి. నవమాసాలు మోసి కన్న స్త్రీకి తెలుసు ఆ అవస్త ఎట్లాంటిదో!

రామ: సంతాన నిరోధానికి పూనుకుని, తగిన సలహా పొందిన స్త్రీల సంఖ్య 66261— పురుషులు 41786 మాత్రమే— చూడండి తేడా.

కుటుం: అవుతే నీ సలహా వివాహం చేసుకుని పిల్లలు లేకుండా చూడమంటావ్, అంతేనా?

పరం: అట్లాగైతే వివాహం చేసుకోవడం దేనికి? దాని ప్రయోజనమే పాయె. స్త్రీకి మాతృత్వంతో కాని పరిపూర్ణ జీవితం లేదంటారు పెద్దలు.

రామ: తెలుగులో సమాధానం నావల్ల కాదు; సెంటి మెంటల్ రబ్బిష్. మొగాళ్లు తమిష్టమొచ్చినట్లు, హద్దుమీరి ప్రవర్తించే స్వభావాన్ని కప్పిపుచ్చేటందుకు కల్పించిన కుతంత్రతత్వం. వైజ్ఞానిక స్నేహం, ఆదర్శాల సాధన, సమాజసేవ, కళ, ఆత్మల కలయిక, ప్రకృతి ఆరాధన—ఎన్నో వున్నాయి. ఇద్దరూ కలిసి చేసే పనులు— వొక్క పిల్లల్ని కంటం మట్టుకే తెలుసు మన వారికి— దానిక్కూడా, పురాణాలలో ప్రమాణాలు కావాలి. తిథివార నక్షత్రాలు కావాలి. జాతకాలు వొడబొయ్యాలి– ఈ జాతి బాగుపడదు.

శాంత: ఏమోస్మాండి— కేవలం మొగాళ్ల వినోదం కోసం, విలాస వస్తువుగా స్త్రీని కట్టుగోడం నాకూ ఇష్టంలేదు. పురుషులంతా స్వార్థపరులు– మీ కాలక్షేపం కోసం పెళ్ళా? ఆమె, తనకి సంతానం లేకుండా,– మీ మొదటి భార్య పిల్లల్ని చూసుకుని మురిసి పోవాలా?

కుటుం: నా జాతకంలో రెండో పెళ్ళి కావలసి వుందిట— నా చేతుల్లో లేదు.– అప్పుడే నిశ్చయం కూడా అయింది.

(లక్ష్మి, రామయోగి, పరంధామయ్య– "ఆ""ఆ"అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చుతారు.)

అవును. దానయ్య చెప్పాడు. కట్నం ఇస్తారుట. దాంతో లక్ష్మి పెండ్లి.

లక్ష్మి: నే నసలు పెండ్లే చేసుకోను.

కుటుం: ఈడొచ్చిన పిల్లని పెండ్లి లేకుండా ఇంట్లో వుంచితే నలుగురూ గడ్డిపెడతారు.

శాంత: అవుతే ఇంట్లోంచి పొమ్మంటారా? లేక బలవంతంగా పెండ్లి చేస్తారా?

కుటుం: కుదిర్చిన సంబంధాని కిష్టపడకపోతే పోవాల్సే వొస్తుంది.

లక్ష్మి: ఆ—నాన్నా—నిజమా?– ఎంత మాటంటున్నావ్!

శాంత: సవతితల్లి వొచ్చి వేరే తరమకుండా ముందు ఆ పని మీరే చేసేస్తున్నారన్న మాట!

కుటుం: మరి చెప్పినమాట వినక నాటకాల్లో వేషాలేస్తూ అల్లరి చిల్లర మూకలతో ఇష్టం వొచ్చినట్లు రాత్రింబవళ్లు తిరుగుతూ రేపు ఏ......

రామ: వాక్యం పూర్తి చెయ్యకండి మహాప్రభో! మీరన బోయ్యేది మాకు తెలుసు. అల్లరి చిల్లర మూకంటారా మమ్మల్ని? మీరు మర్యాదైన కుటుంబం పేరిట రహస్యంగా నాలుగు గోడల మధ్యా పాతికేళ్లు వినోదించి డజను మందిని కని పారేసి వాళ్లని పోషించలేక ఇంట్లోంచి తరిమి, మళ్ళా పెళ్ళి చేసుకుని మళ్ళా పిల్లల్ని కని, వారిని వీధంటపడి బ్రదకమంటూన్న మీరు మర్యాదస్తులూ– రాత్రింబవళ్ళు వాక ఆదర్శం కోసం, సంఘ సంక్షేమం కోసం కృషి చేస్తున్న మేము అల్లరి చిల్లర మూకా–? మీ అమ్మాయిని, అబ్బాయిని ఇంట్లో నుంచి తరిమివేస్తే సంఘం వూరుకుంటుందనుకున్నారా? మేమంతా లేమూ!

పరంధా: అంతదాకా ఎందుకొస్తుందిలే– తిరుమల చదువు నే చూసుకుంటాలే.

శాంత: లక్ష్మి పెళ్ళి విషయం నే చూసుకుంటాను మా అన్నయ్య కిచ్చి చేస్తాను.

కుటుం: ఏమిటి? మీ అన్నయ్యా! ఏదో గ్రంథం జరుగుతూ దన్న మాట. పూటకి టికాణా లేని మీ మోహన్‌తో తిరుగుతుందని నాగయ్యంటే ఏమో అనుకున్నాను.

శాంత: టికాణా లేనివాడు, టికాణాలేని దాన్నే కట్టుకుంటున్నాడులెండి. మీలా కట్నాల కాసించడం లేదుగా. కానీ కట్నం లేకుండా చేసుకుంటాను.

కుటుం: నువ్వు పెళ్ళి చేసుకుని ఆఘోరించావు– నీకైందా పెళ్ళి పాతికేళ్ళు దాటినై? ఎందుకవలేదని ప్రశ్నించుతున్నావా? మర్యాదగలవాడు, నిన్ను చేసుకునేవాడు ఎవ్వడూ లేడు గనక– తెలిసిందా? అందుకని పెళ్ళి పెటాకులూ లేకుండా, అవివాహితవై గోత్రాలుగా...

రామ: రామ రామ పాపం శాంతించుగాక. మీ దీవనలు కట్టబెట్టండి. ఆంధ్ర యువకుడి కండరాలు, పటిమ, ప్రేమానురాగాలు, శక్తి సామర్థ్యాలూ నశించాయనుకున్నారా– మీవాదం ఖండించేందుకైనా సరే శాంతని నే చేసుకుంటా.

కుటుం: ఆ, ఆ–

రామ: ఆ, అ, అ, ఇ ఈ, లు లేవు. ఎందుకు చేసుకుంటానని మీ ఊహ. మేం ప్రేమించుకున్నాం కనక.

శాంత: ఏం మ్మాటలు రామయోగిగారు. ఇదంతా వారి ముందు ప్రస్తావించాలా?

కుటుం: నేనంత తీసిపోయిన వాణ్ణా? అంత తీసిపోయిన వాడి కూతుర్ని మీ అన్నకెల్లా కట్టబెడతావ్?

రామ: ఆ అమాయక, ఆముగ్ధ– ముక్కుపచ్చలారని, కన్యకామణితో వాగ్వివాదం ఎందుకండీ– నాకు వెలిబుచ్చండి మీ సందేహ పరంపరలు, కులగోత్ర నామాలు చూడడు ఈనాటి ఆంధ్ర యువకుడు డబ్బు, హోదా, పలుకుబడి, బిరుదాలు, వాటి నుండి జనించే మర్యాద– సోకాల్డు రెస్పెక్టబిలిటీకి– కాతర్ చెయ్యడు భావిపౌరుడు. గుడ్డి సంప్రదాయం, మూఢాచారం, అర్థంలేని లాంఛనాలు గమనించడు భారతీయ యువకుడు...ప్రేమ అనే ఆదర్శాన్ని మాత్రం పాటిస్తాడు– దానికి తలొగ్గుతాడు, దాసోహమంటాడు– దానికోసం ఏదన్నా త్యాగం చేస్తాడు భావిపౌరుడు, భారతీయ యువకుడు, ఆంధ్ర యువకుడు – వారి ప్రతినిధైన ఈ రామయోగి "త్రీ ఇన్ వన్—" కంబైన్డుగా, ఏక మొత్తంగా, తెలిసిందా! —రెండో పెళ్ళికి

సిద్ధమై మొదటి భార్య సంతానాన్ని వాకిటిపాలు చేసి. రెండో భార్య సంతానాన్ని మీ ఇంటి వెనకవున్న కాలవలో పారెయ్యడానికి వొడిగట్టిన వో పంఘద్రోహి, స్వార్థపరుడైన వో కుటుంబయ్యా—తెలిసిందా—అమ్మ!' గుక్కతిప్పకుండా నడిచింది—నా వాక్యం. వ్యాకరణకర్త పరవస్తు చిన్నయసూరి ధన్యుడు—స ఘ సంక్షేమ శాఖా వ్యవస్థాపకులు ధన్యులు—!

కుటుం: ఏయ్ రామయోగి—ఎరుగున్న, వాడవని, లా చదువుతున్నావని, మర్యాదగా వూరుకుంటున్నాను. జాగ్రత్తగా మాట్లాడు.

రామ: ఏమీ పొల్లుపోలేదు—ప్రతివాక్యమూ, మాట, అక్షరమూ బాలెన్స్‌లో—మేడ్ ఇన్ ఇంగ్లండ్ ఫార్మర్లీ—నౌ ఇన్ ఇండియా—స్వయంగా భారతీయ విజ్ఞాన శాస్త్ర నిపుణులు స్వంత కర్మాగారంలో తయారు చేసిన బాలెన్స్‌లో తూచి, తెచ్చి నాకిచ్చిన భావ పరంపర మీ పైన కురిపించాను—తగకపోయినా క్షమించండి.

కుటుం: పరంధామయ్య—ఊరుకుంటా వేం? నీ కెల్లాపుడి?

పరంధా. చెప్పిన విషయం సబబుగానే తోస్తోంది—భాష కొంచం వక్రించినా,

రామ: వాట్! నాకు భావంకంటే భాషే ప్రధానం. మన మనస్సుల్లో—ఎవరెవరి మనస్సులో ఏయే భావా లున్నాయో మనందరికీ తెలుసు. కాని వాటికి సరైన భాష దొరక్కే, పేచీలు, సంగ్రామాలు, యుద్ధాలు, అంతర్జాతీయ స్పర్ధలు,—వరల్డు వార్స్—అందుచేత, ఇంకా నా భావాలని ఆక్షేపించండి కాని, భాషని పల్లెత్తుమాటంటే నేను, నా వెనక వున్న, భాషావాదులు ఘూర్ణిల్లుతాం—ఇవ్ దటీస్ దివర్డ్ ఐ వాంట్!

కుటుం: నీ సలహా ఎవడిక్కావాలి—బోడి సలహా—

రామ: నేను బోడిని కాను. ముందవను. శాంతను పెండ్లిచేసుకుంటాను.

శాంత. నే వెళ్ళిపోతాను బాబు, సిగ్గేస్తోంది—

కుటుం. తక్షణం వెళ్ళు కొంపలోంచి.

శాంత. పొమ్మంటున్నారా?

లక్ష్మి. శాంతవెడితె నేను వెడతాను.

కుటుం: ఎక్కడికి వెడతావే?—సిగ్గు శరంలేవూ? రేపు—వ...

రామ: (కుటుంబయ్య నోటిమీద అరిచెయ్యి అనించి) వాక్యం పూర్తి చెయ్యకండి. అశ్లీలం. అశుభం. లక్ష్మి, మోహనాన్ని చేసుకుంటుంది. ఆమెకి ఏం జరిగినా భయం లేదు. ప్రేమ ఆమోదిస్తుంది. సంఘం హర్షిస్తుంది. మా కేంద్రంలో శోభాయమానంగా కల్యాణం జరుగుతుంది. ఆ రాత్రి, బుర్రకథ, హరికథ, నాటకం—వుంటాయి. "కుటుంబ నియంత్రణ పథకం ఆవశ్యకత గురించి...అదెట్లా?
ఇట్లు—

కాలిపీచు కాదుర పిల్లలు
గాలిపటం కాదుర పిల్లలు
పిల్లలు దైవం, పిల్లలు ప్రాణం
పిల్లలు జాతికి నాడి
భారతమాతకి గుండి
నదీ నదాల వరదనీరు—
పిల్లలు ప్రేమకి కార్చే కన్నీరు.
పిల్లలు, కయ్యాలకి పిల్లులు కాదుర వోరన్నా
కనిపారేశేందుకు
చదవక పారేసిన పత్రిక కాదుర వోరన్నా
ఆ పారేసిన కాగితం గాడిద తింటుంది—
మరి గాడిదల్ని కంటుంది—
అంతేనా నీ సంతానం?
భరతమాత కంఠం పలికించని
పిల్లకి పల్లెలో తావులేదుర వోరన్నా
భరతమాతకి కూడెట్టని పుత్రోడు
ఎండిన కాలవలో బల్లకట్టుతో సమంరా.

శాంత: (పాట అందుకుంటుంది)
కనిపారేసిన కన్యకి వరుడేడిర వోరన్నా
కన్యకన్న పాపకి తండ్రేడిర వోరన్నా

రామ: కాన్పుకీ కాన్పుకీ మధ్య కనీసం మూడేళ్లైనా వుండాలండి.
తల్లి ఆరోగ్యం చెడి ఏమవుతుందీ?
చెడి, సత్తువ తగ్గి
ఆసుపత్రికే వెడుతుందిర వోరన్నా
మంత్రసాని రైటుచేసి కొంపకి తెస్తే
ఏడాది తిరగంగ మరోకాన్పు—
మళ్ళా మంత్రసాని—మరి మరణం
మొగుడికి మళ్ళీపెళ్ళి, మళ్ళా పిల్లలు
ఆ పిల్లలు, ఈ పిల్లలు ఏకమై
పిల్లులల్లె కయ్యాలే మరి—పల్లెల్లో—
ఆపైన పార్టీలు, పోటీలు,
వోటులు ఎలక్షన్లు, కూనీలు
కోర్టులు, శిక్షలు, తీర్పులు

తిండిలేక చోటులేక పరదేశాలకు
వలస పోవటాలు, దేశ విద్రోహాలు,
గూఢచారులై లడాయిలు
అంతర్జాతీయ సమరం
బుద్ధుడేం చేస్తాడు పాపం,
ఏసు మొరెవడు వింటాడు,
మహమ్మద్ చెంతకొచ్చే శిఖరం ఏది?
మహాత్ముడు విప్పిపారేసిన
వస్త్రం కప్పేదెవడు?

అయ్యా కుటుంబయ్యగారూ, ఈ విధంగా సాగుతుంది. ఆనాటి కార్యక్రమం—ఆ విధంగా సాగుతుంది. మీ దాంపత్య జీవితం—ఇప్పటికైనా విరమించండి.

కుటుం: నడు నడు—నీ పాటలు, పదాలు బాగానే వున్నాయి. కొంపలోంచి తక్షణం నడు. అసలు నా జోలి నీకెందుకు? మువ్వెవడివి?

రామ: దానికి సమాధానం వెంటనే చెప్పగలను. మీ శ్రేయస్కామిని. తరవాత—ఈ కొంపలోంచి నడవను.

కుటుం: ఎందుకు నడవ్వూ? ఇది నా ఇల్లు.

రామ. ఇది మీ స్వార్జితంకాదు. మీ తాత ముత్తాతలు కట్టించింది మీ తరవాత—వారు కోరితే మీరుండగా కూడా—మీ పిల్లలకి ఇందులో వాటా వుంది. మీ లక్ష్మికి భాగం వుంటుంది. కొత్తయాక్టు ప్రకారం—ఇప్పుడు నేను నిలబడ్డ అడుగునేలా లక్ష్మిది కాబట్టి, ఇక్కడనుండి వెళ్ళమనే హక్కు మీకులేదు.

రామ: ఏమిటోయ్—పాకం ముదురుతున్నట్లుంది. నే బ్రతికుండగా ఇదంతా నాదే.

రామ: కాదు స్వామీ. పరీక్ష ఫేలయ్యాను గనక నాకు లా బాగా తెలుసు. ఇది లక్ష్మి భాగం. ఏం లక్ష్మి—నీ వాటాలోంచి వెళ్లమంటావా నన్ను?

లక్ష్మి: నేనేం చెప్పను. నాకేం తెలుసు? ఏమిటి నాన్నా—పాఠాలు చెప్పే అయన్ని పొమ్మంటావేమిటి?

కుటుం: నువ్వు నోరెత్తావంటే దవడ పళ్లూడతాయి. ఈ చదువు చదివే ఇల్లా తయారయ్యావ్, ఇంక నుండి నువ్వసలు ఇంట్లోంచి బైటకెళ్లడానికి వల్ల కాదు.

లక్ష్మి: (ఏడుస్తూ)—పోనీ నా వాటాలో నేవుంటాలే—

కుటుం: మరే—వాటా — దాచ బెట్టావు — ఏదీ—నీ వాటా ఏమిటి—? చూపించు.

రామ: నన్నడగండి, నేనిలబడ్డది ఆమె వాటా—ఇక్కడ నిలబడు లక్ష్మి, నేవెడతా నీచోటులోంచి.

లక్ష్మి: ఏమో బాబు—నేవెళ్లి పోతా (ఏడుస్తూ వెడుతుంది. వెనకాలె శాంత వెడుతుంది)

పరంధా: ఏమిటి కుటుంబయ్య చూస్తూ వూరుకుంటావు?

కుటుం: ఉరెట్టుకోనా—పోతే పోనీ—ఎక్కడికి పోతుంది! రాత్రికి ఆకలేసి—"నాన్నా" అంటూ రాదూ!

(ప్రతాపరాజు వొస్తాడు—విసుగ్గావుంటాడు. చేతిలోసంచి పారేసి)

ప్రతా: ఏమిటి లక్ష్మిని ఇంట్లోంచి పొమ్మన్నావటగా? మమ్మల్ని కనడం ఎందుకూ—ఈ అవస్థ పెట్టటం ఎందుకు?

కుటుం: కోడలి కెట్లావుందిట—పాపం శిశువు దక్కలేదటగా.

ప్రతా: చాలా మంచి పనైంది. ఉద్యోగం లేక నానా అగచాట్లు పడుతున్నాను. అప్లికేషన్ ఫారమ్‌కి డబ్బైనా ఇవ్వవు—ఇప్పుడు ఈ పిల్లల్ని పోషించేదెవడు? చావడమే మంచిది.

పరంధా: హరిహరి—అట్లాంటి మాటలనకు ప్రతాపం, చాలా తప్పు.

ప్రతా: మీ కేం తెలుస్తుంది పరంధామయ్యగారూ అమ్మిచ్చిన పొలం కాస్త ఎవ్వళ్లతో చెప్పకుండా అమ్మించేశాడు.

పరంధా: నాకా విషయం తెలుసు. కొన్నది నేనే—అది తాకట్టు పొలం అని తెలిసి కూడా.

రామ: మీకంత దయ ఎందుకు పుట్టిందో అడగొచ్చా?

పరంధా: ఓ భేషుగ్గా—నీరుతోడే యంత్రం పెట్టించి ఎరువులు పోసి దాన్ని సారవంతం చేసి లాభంగుంజి రెండేళ్లల్లో తనఖా సొమ్ము తీర్చిపేసి, మిగతా లాభంతోలండ నెడదామని—

రామ. మరెప్పుడు లండన్ ప్రయాణం?

పరంధా: అంత దూరం వెళ్లకుండానే వ్యవహారం పరిష్కారమైంది, అందులో సగభాగం బ్లాక్ వారికి కావాల్సి వొచ్చింది—రోడ్డు వెయ్యడానికి తణఖా బాకీ పదిహేనొందలూ వారిమ్చుకొని భూమి భుక్తం చేసుకుంటామన్నారు.

కుటుం: ఏమిటేమిటి? బాకీ తాలూకువడ్డీ ఐదొందలైందిగా—దాని మాటో?

పరంధా: ఇప్పుడు మీదొడ్డి వైపు స్థలం గోడ పడగొట్టించి—రోడ్డు పోనిస్తే ఆ స్థలం కూడా, వొడ్డి పరిహారంగా చెల్లించి.. భుక్తం చేసుకొంటారు...

కుటుం: ఆ స్థలం ఇవ్వడానికి చస్తే వొప్పుకోను.

రామ: ఎందుచేతనో అడగొచ్చా?

కుటుం: నీకనవసరం.

రామ: మీది కాదా ఏం?

కుటుం: ఛీ. నోర్ ముయ్.

రామ: వాట్?

ప్రతా: ఎందుకియ్యవు—?

కుటుం: పొలం అమ్మగానే—హక్కు ఖత్మాయికొన్న పరంధామయ్యవే.

ప్రతా: తణఖా భూమికొని నీకు వుపకారం చేసినందుకు శాస్తా? అసలది అమ్మే హక్కే—నీకు లేదు—ఈ క్షణం దావా పడేస్తాను—తమ్ముళ్లకి, అక్కలకి వ్రాసి.

కుటుం: అమ్మడు పత్రం మీద మీ అందరి సంతకాలూ తగలబడ్డాయోయ్!—మరిచి పోకు!

ప్రతా: మా కేదో మత్తు మందిచ్చి, మాయచేసి, మైకంలోవుంటగా, సంతకాలు పెట్టించి, కొందరి సంతకాలు ఫోర్జరి చేసి...

కుటుం: నోర్ ముయ్—వెర్రివాగుడు వాగావంటే చంప పగుల్తుంది

రామ: లంచాలుచ్చుగోడానికి—ఫోర్జరీకీ అవినాభావ సంబంధమా అదేదో అంటారే—అట్లాంటి దుంది. దాని కలవాటు పడ్డవారు ఇది లేకుండా వుండ లేరు—స్త్రీ వ్యసనంకీ త్రాగుడికే సంబంధం వున్నట్లు—ఇదంతా గొలుసు తత్వం—చైన్ రియాక్షన్.

కుటుం: లంచాలెవడుచ్చుకున్నాడోయ్—ఇట్లాంటి అపవాదు వేసినందుకు కోర్టుకీడుస్తాను.

రామ: ప్లీడర్నే కోర్టు కీడ్చిన క్లయంటుని ఇంత కాలానికి ఆంధ్ర దేశంలో దర్శించాను ధన్యుణ్ణి. కోర్టులోనే రుజువు చేస్తాను. ఆధారం వుండండోయ్,—గొలుసు—వొక్క నా తత్వానికే కాకుండా, యథార్థ నిదర్శనంగా కూడా, ప్రత్యక్షమై పరమాత్మలానన్ను కటాక్షించింది. పరంధామయ్యగారు,— ఊరుకుంటారేం?

పరం: ఇప్పుడవన్నీ ఎందుకు త్రవ్వడాలు. ఎప్పుడో జరిగిపోయిన విషయాలు.

కుటుం: ఏమిటి నువ్వనేది—ఏం జరిగి పోయింది?

రామ: గతం—తన అద్భుత నీడల్ని ప్రస్తుతం పైన ప్రసరింప జేస్తుంది—ప్రస్తుతం భవిష్యత్తుపై ప్రసరింప చేస్తుంది. వెనక ముందు అనే రెండింటిమధ్య వొక కొక్కెంగా—కాలం అనే గొలుసులో మనిషి బంధించ బడ్డాడు. కలం వొక గొలుసు—మానవలోకం వొక గొలుసు. సృష్టి వొక గొలుసు. జీవితం అంతా వొక గొలుసు. ఒక్కొక్కడి చేతిలో వొక్కొక్క మెరుగొస్తుంది దానికి, మట్టితో గొలుసు; ప్లాస్టర్ తో గొలుసు; ఇనపగొలుసు; తుత్తినాగం గొలుసు—ఎంత అందమైన మాట! ఉక్కు, ప్లాస్టిక్ వొక గొలుసు. హైడ్రజన్ ఆక్సిజన్ ఏటమ్స్ వొక గొలుసు—వెండి గొలుసు, బంగారం గొలుసు. మీరు లంచంగా తీసుగుని భార్య మెడలో అలంకరించని గొలుసు, బంగారంది అనుకుని అమ్మబోయిన గిల్టు గొలుసు.

కుటుం: (తబ్బిబ్బై) ఏమిటి? ఏది? ఏ గొలుసు? నీకెట్లా—నీకెవరు?

రామ: సీనయ్యా—మంచి తీర్థంకాని, ఇంత మజ్జిగకాని తీసుకురా—అయ్యగారు గతం అనే నదీ ప్రవాహంలో పడి కొట్టుకు పోతున్నా, దప్పికలో డగ్గుత్తిక చెందుతున్నారు—తక్షణం తీసుకురా.

సీనయ్య: వొస్తుండా (నీళ్ల తెస్తాడు)

కుటుం: (తేరుకుని, మంచి నీళ్ల త్రాగి) అది బంగారంది. బంగారం యేమిటి కాకపోవడం మేమిటి? అది లంచం సొమ్ము కాదు—పడవల వాళ్లు, చేపల వాళ్లు ఏటేటా ముట్టచెప్పే మామూలు.

రాం: బ్రిటిష్ ప్రభుత్వం రోజుల్లో అవి మామూలు, లాంఛనం. గౌరవంగా స్వీకరించే బహుమానం. ప్రభువులు చెల్లించే ముద్దు. ఈ నాడు ప్రజా స్వామ్యంలో లంచం, బ్రైబరీ—కరప్షన్, ఆ నాడు లంచాలిచ్చుగుని, మేడల మీద కులుకుతున్నవారి బ్యాంక్ ఏకౌంట్స్ తణిఖీ చేస్తున్నారు. ఈ గొలుసు ఉదంతం, దుకాణాదారుని ద్వారా, రహస్యాలు శోధించే అధికారుల నోటీస్ లోకి వెళ్లింది. వారు దీన్ని గురించి కొన్ని కుశల ప్రశ్నలడుగుతారు. సమాధానాలు సిద్ధపరిచి వుంచండి.

ప్రతా: బాగుంది. అక్కడికెడితే అదీ, ఇక్కడికొస్తే ఇదీ నా—ఎందుకీ బ్రతుకు? అప్రదిష్ట!

పరం: ఏదో అయిపోయింది. వాళ్లకి సర్దిచెప్పొచ్చు. పైగా లంచం సొమ్ము అనుకోడం తప్పు. ఋజువు లేందే. అందరూ పుచ్చుగుంటున్నట్లే అయనా పుచ్చుగొని వుండొచ్చు. ఇంతకీ అది బంగారం గొలుసేగా?

కుటుం: కాకపోవడం ఏమిటయ్యా? గిల్టు గొలుసులు పడవల వాళ్లకెట్లా వొస్తాయి? నువ్వు ఆ దుకాణంలోనే వున్నావుటగా.

పరం: అవన్నీ ఎందుకులేగాని—వెళ్లి బ్లాక్ వాళ్లదగ్గర నుండి ఆ కాగితాలు తెస్తానుండు. సంతకాలు పెడుదువుగాని—హాయిగా వారు రోడ్డు వేయిస్తారు. వంతెనకడతారు—

రామ: పిల్లల ఆట్లకి పార్కు వేస్తారు—పల్లెకీ, గ్రామానికీ వొక లంకె వేస్తారు—పట్టణాలన్నీ నాగరికత కూర్చిన సదుపాయాలు

అనుభవిస్తుంటె, బట్టలు విప్పేసుగుని నగ్నంగావున్న ఈ పల్లెలో మనం వెనకబడి వుండంకుండా. రవాణా, విద్యుత్, యంత్ర పరికరాల, ఆనాగరికతా సొంపులను స్వంతం చేసుగుని అనిభవిద్దాం—పదండి నేను వొస్తాను. సాక్షుల సంతకాలు కావాలిగా.

కుటుం: ఆకాస్త నేలా నా స్వార్జితం, అది మాత్రం చస్తే ఇవ్వను—మీరేం చేసినా సరే—

ప్రతా: ఎందుకివ్వవు? నాకు రావల్సిన ఆస్తికి ముదరగా ఆ నేల పుచ్చుగుని, నేఇచ్చేస్తాను. వాళ్లేదో ముట్ట చెబుతారు. దాంతో నాకు ఉద్యోగమేనా దొరుకుతుంది.

కుటుం: నేనివ్వను నీ దిక్కున్న వాడితో చెప్పుకో.

ప్రతా: ఇక్కడుంటాననుకొన్నావా — మా మామగారు ఆస్తుల విషయంలో ఆరితేరిన ఆసామీ—ఆయన చేతులో బోలెడు లాయర్లున్నారు. ఈకథ ఏమిటో కనుక్కుంటాను (వెడతాడు)

కుటుం: వెళ్లు – నేనూ చూస్తాగా—ఏం జరుగుతుందో,

పరం: తమాయించు కుటుంబయ్యా—కాస్త నిదానంగా ఆలోచించు—నీ కొచ్చిన నష్టం ఏమీ లేదు. నేవెళ్లి కాగితాలు తీసుకొస్తాను. కాసేపు విశ్రమించు — మెదడు తేటబడుతుంది. ప్రతాపంతో నచ్చచెబుతాగా—ఏదో చిన్నతనం. ఆవేశంలో అనేశాడు—అతని ఉద్యోగం ధరఖాస్తు సొమ్మునే సర్దుతాగా.
(పరంధామయ్య వెడతాడు)

కుటుం: (కళ్లంట మెరిసే కన్నీటిని త్రోసివేస్తు) ప్రతాపం వెళ్లాడు. అమ్మాయి వెళ్లింది. పరంధామయ్యా వెళ్లాడు. అందరూ వెళ్లారు. నువ్వు మాత్రం దేనికి నాయనా—నువ్వూ వెళ్లు.

రామ: నేను వెళ్లనని ఏనాడో విజ్ఞప్తి చేశాను.

సీన: నాగయ్య గారొస్తుండారండి.

రామ: ఏ నాగయ్య? •

నాగ: (అదర్దా కనబరుస్తూ) ఏంకుటుంబయ్యా. దిగులుగా వునట్లున్నావు?

రామ: కలలు కంటున్నారు, ఆనంద బాష్పాలు.

నాగ: ఇహనేం—బ్లాకు వాళ్ల పేచీ తీరిందా—మీరంతా వుండి నచ్చ జెప్పకూడదుటయ్యా రామయోగి? మొత్తానికి నన్ను లొంగదీసుకొన్నారు బ్లాక్ వాళ్లు. ఇందాక రాసేశాను. ఆ ఆరెకరం నేలా—వాళ్లిష్టమొచ్చినట్లు చేసుకోమని.

కుటుం: అదేమిటి, నన్నేమో ఇవ్వద్దన్నావు, నువ్వెలా ఇచ్చావు?

రామ: నేచెప్పనాండి?

నాగ: చెప్పు చూద్దాం.

రామ: మీ అబ్బాయికి అందులో ఉద్యోగం ఇస్తామన్నారు—అంతేనా?

నాగ: హార్సీ. అసాధ్యుడవు—అవును.

కుటుం: అంతేనా? అబ్బాయికి ఉద్యోగం ఇస్తాననగానే ఇచ్చెయ్యడమే?

నాగ. దానికి దానికి సరిపోతుందిగా.

కుటుం: ఇట్లా వుంటుంది మన ఒట్టుదల.

నాగ. నువ్వూ ఇచ్చెయ్యి.

కుటుం· ఎందుకివ్వాలి?

రామ. ఇవ్వకుంటె వారు బలవంతంగా లాక్కోగలరు. తెలుసా? రాజ్యాంగంలో పేర్కొన్నారు కూడా—

కుటుం. బలాత్కారమే? చూస్తాగా—నేనూ చూస్తా.

నాగ. నీ ఇష్టం మరి—పెద్ద ఘటాన్ని తోచింది చెప్పాను. ఇంతకీ నే వొచ్చిన పని పేరు చెప్పనా?

రామ: ఏమిటండీ—మళ్లీ వివాహం తలబెట్టారా?

నాగ ఎందుకు బాబూ—ఉన్నవాళ్లతో చస్తుంటే? అది కాదు. మా రత్తమ్మ నెరుగుదువుగా—రత్తి—దానిమెళ్లో బంగారంలాంటి గొలుసు పోయింది.

కుటుం: ఏమిటి? గొలుసా?

రామ. ప్రతివారికీ నాగొలుసు తత్వం పట్టుబడింది. నాకానందంగా వుంది. గర్వంగా వుందన్నా తప్పులేదేమో.

నాగ. చెప్పడం ఎల్లాగోవుందనుకో—ఇది డబ్బుతో వ్యవహారం ఆయిరి. అందుకంటున్నా. మీ తిరుమల పని.

కుటుం :ఏమిటి? మా తిరుమల మీ అమ్మాయి గొలుసు కాజేశాడా? మా తిరుమల!

నాగ. అంధుకు సందేహం ఏమిటి? ఇదివరకెన్నో జరిగాయి—చిల్లర సరుకులు ఎన్ని'ఎత్తుకు పొయ్యేవాడో—ఏదో పోనిస్తూ కుర్రాడు గదాఅని, అశ్రద్ధ చేశాను. మరిప్పుడు చెప్పక తప్పింది కాదు.

కుటుం: మా తిరుమల అల్లాటి పని ఎప్పుడూ చెయ్యడు.

రామ: ఎందుకు చెయ్యడండీ? అట్లాంటి పనే చేస్తాడు. పాకెట్ మనీగా, వాడికి వొక్క కాని ఇవ్వరు. ఏం చేస్తాడు మరి?

పిల్లలకి నా సొమ్మని నీ సొమ్మని బేధాలుండవు. అంతా తమ స్వంతంగా వాడుకుంటారు. సోషలిస్ట్ పాటరన్ ఆఫ్ సొసైటీకి పునాదులు వారే.

కుటుం: ఛి. ఛి—ఏంమ్మాటలవి. మా వాడు దొంగ పని చేశాడంటె ఎప్పుడూ నమ్మను.

రామ: మీ వాడు దొంగపని చేశాడని ఎవ్వరూ అనడం లేదు. ఆ పని చేసింది మీరు? స్తోమతకి మించిన సంతానాన్ని కన్నారు—వారిని పోషించ లేరు. అంచేత ఆ పని చేస్తారు. పిల్లలు—అదొక ఆర్థిక సూత్రం.

కుటుం: అనవసరపు వాగుడు కట్టి బెట్టు—తిండి లేక పోతే చావనైనా చస్తాంగాని, దొంగపని చేస్తామా?

రామ: మీబోటి పెద్దలకు ఆపట్టింపులు. పిల్లలకి ఆ వ్యత్యాసాలుండవు.

కుటుం: మళ్లీ అదే వాగుడా—ఏడీ మా వాణ్ణి పిలిపించండి—నాలుగూ అడుగుతాను—సీనయ్యా,—వెళ్లి అబ్బాయిగార్ని తీసుకరా,

సీన: అబ్బాయిగారు పై వూరెల్లారండి.

కుటుం: అదేమిట్రా?

సీన: ఎవళ్లో స్నేహితులతో కలసి, సైకిల్ ఎనకా తల కూర్చుని మూడు గంటలాటికి సినిమా కెల్లారంటండి.

కుటుం: నీకెవరు చెప్పారా?

సీన : ఆరేనండి.

కుటుం: చేతులో కానీ లేదు. ఎల్లా వెళ్లాడ్రా.

నాగ; ఈ గొలుసుందిగా.

కుటుం: ఛ, ఛ—ఏట్లా వొచ్చిందినోరు నాగయ్యా నీకు అట్లాంటి మాటలనడానికి? మా వాడు తీశాడనడానికి ఆధారం?

నాగ: మా రత్తి చెప్పింది. లాక్కు పొయ్యాడని.

కుటుం: హార్—రానీ—అడుగుతాను. మా వాడు అట్లాంటి వాడు కాదే—

రామ: మీవాడు కాదండి—మీరు అంటున్నాను.

కుటుం: ఏయ్ రామయోగి కొంప లోంచికదులు. ప్రాణం విసిగించక.

రామ: ఇదె నిష్క్రమిస్తున్నాను. కాగితాలతో దర్శనం చేసుకుంటాను.

కుటుం: మా వాడు అట్లాంటిది చెయ్యడు—చేస్తే చీరి ఎండేస్తాను. నీ గొలుసు సొమ్ము నేనిచ్చుగుంటాను. సరా?

నాగ: నాకు తెలీదా ఏమిటి?—ఏదో స్నేహంగనక చెప్పాను. మందలించి బుద్ధి చెబుతావని. మరి అదే ఆలోచిస్తూ కూర్చోకు.

(వెడతాడు)

(కుటుంబయ్య ఘోషాణం తీసి వెదకడం మొదలెడతాడు)

కుటుం: చూస్తావేం సీనయ్యా, వెతకరా?

సీన : ఎక్కడా లేదండి.

కుటుం: ఏమిటి లేదురా?

సీన: మీరేది వెదుకుతుండారో—అది.

కుటుం: ఏమిట్రా అది. నువ్వు చూస్తుండగానే కదట్రా ఘోషాణంలో పెడతా.

సీన: ఏటుండది? పొడుంకాయా?

కుటుం: ఛీ నోర్ముయ్. నేను పొడుం పీల్చే ముసిలిపీనుగననుకున్నారట్రా—గొలుసురా—గొలుసు.

సీన: నాకిచ్చి పంపిందాండి. అది బ.గారంది కాదు కదండి.

కుటుం: నువ్వేమన్నా సత్కరించావా ఏంరా?

సీన: బమ్మదేవుడి సాక్షికంగా—నేనెరగనండి. అయినా వోటి గొల్సు నాకెందుకండి. మరోదపా చూడండి.

(ఇద్దరు వెదుకుతారు)

కుటుం: అయ్యో, అయ్యో కొంప మునిగింది సీనయ్యా—ఇంకేముంది గొలుసు కాజేశారు గొలుసు.

సీన: అదేమండి నాగయ్య కూతురు గొలుసు పోయె, మందీ పోయె. ఎవడో గొలుసు దొంగ పనేనండి. వోవేళ మన తిరుమలయ్యగారు...

కుటుం: (లెంప మీద కొడతాడు) నోర్ముయ్—వెదుకు వెదుకు గొలుసు—అయ్యో—నా గొలుసు:

(పరుగెడుతాడు —తెరపడుతుంది)

(వచ్చే సంచికలో ముగింపు)

ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదల, వ్యవసాయం

యస్. ఏ. ఖాదర్

దేశంలోని మిక్కిలి పెద్ద రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ మూడవది.

దానిలో మూడు ప్రాంతాలు కలిసి వున్నవి. తూర్పునగల ప్రాంతాన్ని సర్కారులు అనీ, దత్త మండలాలను రాయలసీమ అనీ (యీ రెండూ పాత మద్రాసు రాష్ట్రంలోనివి) పూర్వ హైదరాబాదు జిల్లాలను తెలంగాణా అనీ అంటారు. ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 106 వేల చ. మైళ్లు లేక 664 లక్షల యెకరాలు. ఇక్కడ ప్రతి చదరపు మైలుకు సగటున 295మంది నివసిస్తారు. రాష్ట్రంలో యెక్కువ భాగం భూమి సమతలమై, సారవంతమై హెచ్చుపంట పండుతుంది.

కోస్తా వెంబడిని, నదీ తీరాలను మిక్కిలి సారవంతమైన ఒండ్రుమన్ను భూములు కలవు. రాష్ట్రంలో చాల భాగం భూములు ఎర్రనేలవి. వీటి రంగు లేత బూడిద రంగునుంచి ముదురు ఎరుపు వరకు వుంటుంది. వాటిలో గరుకు యిసుక రేగడి భూములు, ఒక మోస్తరు సన్న యిసుక రేగడి భూములు, సన్నయిసుక రేగడి భూములు, ఎర్రరేగడి భూములు వుంటవి. ఇవి వుత్తమ రకం భూములయినందున, నీటి పారుదల, రసాయన యెరువుల సహాయంతో వాటిలో హెచ్చు పంటను పండించవచ్చు. రాష్ట్రంలోని నల్లమట్టి భూములు కూడ మంచివే. ఆంధ్రప్రదేశ్ నల్లమట్టి భూములు—దక్కనులో వలె కాక, నల్లరాతితో యేర్పడుతవి. అందువలన, నీటి పారుదల, సరైన నిర్వహణ వున్నచో అవి కూడా హెచ్చుపంటను యివ్వగలవు. నెల్లూరు జిల్లా కొన్ని ప్రాంతాలలో గల బొంతరాతి నేలలు నీటి పారుదల క్రింద చక్కగా పండినవి. రాష్ట్రపు మొత్తం భూమిలో 42 శాతం సాగుక్రింద నున్న. మరొక 42 శాతం పబ్లిక్ బయళ్లు, బీళ్ళు, అడవులు, తోటల క్రింద నున్నది. 16 శాతం మాత్రమే కొండమయమై సాగులాయకు కాకున్నది. దీనిని వ్యవసాయేతరమైన భూమి అనవచ్చును.

వ్యవసాయ రంగం

రాష్ట్ర జనాభాలో 87 శాతం వ్యవసాయంపై ఆధారపడతారు ఇక్కడి నీటి పారుదలకు బహు పురాతనమైన చరిత్ర వున్నది: ఇక్కడ పురాతనమైన జలాశయాలు, వేలాది చెరువులు యితర పంట నీటి వనరులు కలవు. వాటిలో 13వ శతాబ్దికి చెందినవి కూడ కలవు.

దక్షిణ భారతదేశపు గొప్పనదులైన కృష్ణా గోదావరులు రెండు మొత్తం 2,13,000 చ. మైళ్ళ అరగాణిని కలిగి వున్నవి. ఈ నదుల దిగువ భాగాలు ఆంధ్రప్రదేశ్ మీదుగా పశ్చిమమునుంచి తూర్పుకు ప్రవహిస్తూ, ఉధృతమైన తమ వరద నీటిని బంగాళాఖాతములో కలుపుతవి. రాష్ట్రంలో 240 లక్షల యెకరాల విస్తీర్ణంగల సారవంతమైన భూములు యీ నదులు, వాటి వుపనదుల క్రింద సాగవుతున్నవి.

రాష్ట్రంలో నైఋతి ఋతుపవనాల వల్ల, ఈశాన్య ఋతుపవనాల వల్ల కూడ వర్షాలు కురుస్తవి. రాష్ట్రం ఆయా ప్రాంతాలలో వర్షపాతం 20 అం. నుంచి 50 అం. వరకు వుంటుంది: దీనికి నిలకడలేదు. నిలవనీరు లేకుండా నీటి పారుదలకు యిది చాలదు. ఉష్ణోగ్రత యెక్కువే; యిది 100° నుంచి 120° ఫా. వరకు వుంటుంది.

కోస్తా జిల్లాలకు, తెలంగాణాలోని ఆదిలాబాదు, నిజామాబాదు జిల్లాలకు పంటలకు తగిన వర్షాలు కురుస్తవి. కాని ఇక్కడ సైతము అవి అన్ని చోట్ల ఒక మోస్తరుగా కురియవు. కేవలం ఆ వర్షపు నీరు పంటకు చాలదు కూడ.

కొరత పరిస్థితుల నిర్ణయానికి మొత్తం వర్షపాతం ప్రమాణమే కాక దానిలో కలిగే హెచ్చుతగ్గులు కూడ తెలియాలి.

ఈ పరిస్థితిని పరిశీలించగా రాయలసీమ వంటి కొరత ప్రాంతాలలో మామూలు కంటె తక్కువ వర్షాలు యెక్కువ తరుచుగా కురుస్తవని తేలినది.

ఆంధ్రప్రదేశ్‌లో విస్తారమైన కొరత ప్రదేశాలున్నవి. 1878 భారతీయ నీటి పారుదల కరువు కమిషన్ అంగీకరించిన

గరిష్ఠ పరిమితి 30 అం. లను సాలు సరిసగటు వర్ష పాతంగా, కొరత ప్రాంతాల నిర్వచనం నిమిత్తం, తీసుకొనినచో, రాష్ట్రంలో దీని క్రిందకు వచ్చే ప్రాంతం:

ఆంధ్రప్రదేశ్

1.	కృష్ణా ఆరగాణి	15,700	చ. మైళ్లు
2.	తుంగభద్రా ఆరగాణి	4,220	,,
3.	మూసి, పాలేరు, మున్నేరు వంటి వుపనదులు	3,120	,,
4.	పెన్నారు	13,700	,,
		36,740	చ. మైళ్లు

(తుం. భ. బేసిన్ మినహా 32,520 చ. మైళ్ళు)

దీనికి శ్రీకాకుళం జిల్లా కొరత ప్రాంతాలను, విశాఖపట్నం జిల్లా మెట్ట ప్రదేశాలను కలపాలి.

కృష్ణానదీ బేసిన్‌లో ఎక్కువభాగం యీ 30 అం. సగటు క్రిందకు వస్తుంది. రాయలసీమలో కొన్ని ప్రాంతాలలో సంత్సరానికి 20 అం. వర్షమే కురుస్తుంది. ఈ ప్రాంతంలో తక్కువ వర్షాలు పడుటకు తోడు, సందూరు కొండల శ్రేణికి పశ్చిమాన గల పశ్చిమ సగానికి, 30 అం. క్రిందగల తూర్పు సగానికి వర్షాకాలలో అనగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు కురిసే వర్షాల హెచ్చు తగ్గులలో స్పష్టమైన తేడా వున్నది. మిగిలిన సందూరు కొండల శ్రేణితో పోల్చినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వర్షంలేని సంవత్సరాలు యెక్కువ, వర్ష ప్రమాణంలో తగ్గుదల కూడ యెక్కువ విస్పష్టంగా కనుబడుతుంది. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో, తక్కువ సాలుసరి సగటు వర్షంగల ప్రాంతం మిక్కిలి యెక్కువ.

కొరత జిల్లాలు

బళ్ళారి, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలు నాలుగు పీటికే దత్తమండలాలు అనిపేరు—నీటి కరువువల్ల తరుచు యెక్కువ బాధపడుతూ, కఠినతరమైన కరువుకు గురి అవుతూ వుంటవి. వర్షాభావంచే యీ జిల్లాలు బాధపడినంతగా రాష్ట్రంలో మరే ప్రాంతము బాధపడదు. 1876_78 కరువులో యిక్కడ జరిగిన జన నష్టం భయంకరమైనది. (1875 నుంచి 1931 వరకు) 57 సంవత్సరాల వర్షపాతం వివరాలను పరిశీలించగా నైఋతి ఋతు పవనాల అభావం వల్ల 12 సంవత్సరాలు, ఈశాన్య ఋతు పవనాల అభావం వల్ల 24 సార్లు వర్షాభావం కలిగినదని తేలినది. 1876, 1896, 1900, 1907, 1909, 1923_24 సంవత్సరాలలో వర్షాభావం ఈశాన్య ఋతు పవనాల ప్రభావంవల్ల కలిగినది.

దీనికి పల్నాడు, వుదయగిరి, కరువు ప్రాంతాలను, శ్రీకాకుళం. విశాఖపట్నం జిల్లాల మెట్టప్రాంతాలను చేర్చాలి.

కొరత ప్రాంతాల నిర్ణయానికి తగిన పరిస్థితుల దృష్ట్యా కాని కొరత, కరువుల సంభవాలకు సంబంధించిన కఠిన చారిత్రిక సత్యాల దృష్ట్యా కాని ఆంధ్రప్రదేశ్‌లోని విశాల ప్రదేశాలు అక్షరాలా కొరత ప్రదేశాలని సుస్పష్టం.

ఈ విధంగా నిలకడలేని, అన్ని ప్రాంతాలలోను ఒక తీరున కురవని, చాలీ చాలని వర్షపాతానికి తోడు సరైన నీటి పారుదల సౌకర్యాలను కల్పించనిదే ఆంధ్రప్రదేశ్‌లో సారవంతమైన సువిశాల ప్రదేశాలను పూర్తిగా పండించలేము. సరి కదా. విస్తార భూభాగాలను అనిశ్చయమైన వర్షాల దయకు వదిలివేసి, తద్వారా కరువు కాటకాలను కొనితెచ్చుకోవలసి వస్తుంది.

పారిశ్రామికంగా

ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల విషయంలో వెనుకబడి వున్నది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో వస్తూత్పత్తి పెట్టుబడి, ఉద్యోగావకాశాల అంకెలను పోల్చిచూస్తే పరిస్థితి విస్పష్టం కాగలదు. ఈ అంకెలు_కేంద్ర ప్రభుత్వం ప్రచురించిన భారతీయ వస్తూత్పత్తిదారుల 13వ సెన్సస్ సంగ్రహ నివేదిక నుంచి గ్రహించబడిన 1953 పారిశ్రామిక స్టాటిస్టిక్స్‌లో యివ్వబడినవి.

రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి కూడ చాల తక్కువ వుత్పత్తి అవుతుంది. ఇక్కడ తలసరి వాడకం 15 కె. డబ్ల్యు. హెచ్.

ఈ విధంగా పారిశ్రామికంగా వెనుకబడివుండి విద్యుచ్ఛక్తివి తక్కువ వుత్పత్తిచేసే ఆంధ్రప్రదేశ్ 1961 జనాభా లెక్కల ప్రకారం, 3 కోట్ల 61 లక్షల మందిని పోషించవలసి వున్నది. దీనికి తోడు, వ్యవసాయం కూడా దెబ్బతిని, వెనుకబడినచో లేక దానికి అవసరమైన జలాలను మళ్ళించి ప్రభుత్వం తగిన ప్రోత్సాహమివ్వని యెడల రాష్ట్రం నిరంతర కరువు కాటకాలకు నిలయమై పోగలదు.

గమనించదగిన యితర విషయాలలో, యితర ప్రాంతా

లతో పోల్చినప్పుడు ఆంధ్రప్రదేశ్ పేదరికము ఒకటి. దాని ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యావసాయికం కావడం ఒకటి పేర్కొన దగినవి.

36 కోట్లలోను 1951 జనాభా లెక్కల ప్రకారం 3 కోట్ల 12 లక్షల జనాభాగల ఆంధ్రప్రదేశ్ మొత్తం ఆదాయం రూ. 80 కోట్లు మాత్రమే. భారత దేశపు రాష్ట్రాలన్నిటికి యిది రూ. 955 కోట్లు. దేశం మొత్తం జాతీయాదాయం రూ. 11,177 కోట్లు కాగా. ఆంధ్రప్రదేశ్ జారీ యాదాయం రూ. 851 కోట్లు మాత్రమే. 1956_57లో ఆంధ్రప్రదేశ్ తలసరి రాబడి 255. మొత్తం భారతదేశం సగటు 388.

1957 వ్యవసాయ స్టాటిస్టిక్సు ప్రకారం రాష్ట్రంలో గ్రామీణ జనాభాకు సాగుచేయబడే భూమి నిష్పత్తి 0.95 యెకరాలు మాత్రమే. 1960 జనవరి ఆహార స్టాటిస్టిక్సు బులెటిన్‌లో అంకెల ప్రకారం రాష్ట్ర పట్టణ: గ్రామీణ జనాభా నిష్పత్తి 13:87. ఇందు వల్ల ఆంధ్రలో గ్రామాల జనాభా యెక్కువ అని విదితం. వ్యవసాయ. రాష్ట్ర ఆదాయాల నిష్పత్తి 57:6 (1956_58) దీని వల్ల ఆంధ్ర ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యావసాయికం అని తేలుతున్నది.


బియ్యం ఉత్పత్తి

ప్రస్తుతం దేశానికి మిగులు బియ్యం యివ్వటంలో మన రాష్ట్రం అన్ని రాష్ట్రాలకంటె ముందున్నది. శతాబ్దాల తరబడి జరుగుతున్న వరిసాగులో గల అనుభవం ఆంధ్ర రైతుల సొత్తు. ఇక్కడ యెకరా పంట హెచ్చుగా వుంటుంది. కొరత రాష్ట్రాలలో పంపిణీకై మిగులు సరుకును యెగుమతి చేయటం మిక్కిలి లాభకరం కాబట్టి మన రాష్ట్రం వరిని బాగా హెచ్చుగా పండించాలి. ఈ దృష్ట్యా దేశ ఆర్థిక వ్యవస్థలో మన రాష్ట్రానికి మిక్కిలి ప్రాముఖ్యమున్నది.


కృష్ణా. గోదావరీ జలాలను నీటి పారుదలకై యితర ప్రాంతాలలో కంటె ఆంధ్రప్రదేశ్‌లో యెక్కువ సులువుగా. చవుకగా మళ్ళించవచ్చుననేది నిర్వివాదం. మన రాష్ట్రంలో నదులు సులవువైన దిగుడు పాతంలో ప్రవహిస్తూ. పంటకాలువల త్రవ్వకానికి అనువుగా వుంటవి. వీటిద్వారా నదులనుంచి మిక్కిలి దూరాన గల ప్రాంతాలకు కూడ అద్భుతమైన నీటి పారుదల సౌకర్యాలను కల్పించవచ్చు. ఈ రెండు నదుల ముఖద్వారాలవద్ద సువిశాలమైన డెల్టాభూములు వున్నవి. అంతేగాక, గోదావరిపై పోచంపాడు—దీని క్రిందగల ప్రాంతం 50 లక్షల యెకరాలు— కృష్ణపై 80 లక్షల యెకరాలు (కుడివైపున 50 లక్షలు, ఎడమ వైపున 30లక్షలు)గల నాగార్జునసాగర్‌లవంటి బృహత్ ప్రాజెక్టుల నిర్మాణానికి అవకాశమున్నది. ఈ నదీ జలాలను పెద్దయెత్తున నీటి పారుదల, విద్యుచ్ఛక్తిల వుత్పత్తికి వినియోగించే అవకాశం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే గలదు.

ఈ నదులలో లభ్యమయ్యే జలాల ప్రమాణం, మొత్తం జాతి ప్రయోజనానికై నదీ జలాలను పెద్దయెత్తున నీటిపారుదలకై వినియోగించుటకు గల అవకాశాలు 1951 కేటాయింపుల సందర్భం లోనే పూర్తిగా పరిశీలించబడినవి. నీరు తగినంత లేకపోవటం వల్లను, సమావేశాన్ని యేర్పరచిన కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ప్రయోజనాలను సమానంగా కాపాడాలని ఆదుర్దాపడటం వల్ల-ప్రధానంగా యీ రెండు కారణాలవల్లె అప్పుడు ఆంధ్ర ప్రదేశ్‌కి అంత జలమే యివ్వబడినది. ఇదివరకే చెప్పినట్లు, ఆంధ్రప్రదేశ్, లభించాలే కాని కృష్ణా జలాలు 3,500 టిఎమ్‌సి అ.లను. గోదావరి జలాలు 2,400 టిఎమ్‌సి అ.లను వినియోగించుకో గలదు. కాని 1951 ఒప్పందం ప్రకారం అన్నిరాష్ట్రాలకు నీటి పారుదలకై లభించే నీరు కృష్ణలో 1,715 టిఎమ్‌సి. అ.లు, గోదావరిలో 2,500 టిఎమ్‌సి అ. లు మాత్రమే వున్నది. ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి పరిశోధన జరిగి, అమలుకు సిద్ధంగా వున్న ప్రాజెక్టులు యెన్నో వున్నవి. కేంద్ర ప్రభుత్వం సానుభూతి, తగిన సౌమ్ము లభ్యమైన నాడు ప్రాథమికావసరమైన ఆహారం విషయంలో ఒక్క ఆంధ్రనే కాక మొత్తం దేశాన్నే సుభిక్షం చేయగలశక్తి వాటికున్నది.

ఈ విధంగా, దేశ విదేశ ద్రవ్యనిల్వలను హెచ్చించి వెనుక వేసుకొనడం దృష్ట్యా జాతీయ లేక అఖిల భారత ప్రయోజనాల దృష్ట్యా కాని యీ నదుల క్రింద సాగు కాగల ప్రాంతాల వాస్తవమైన అవసరాల దృష్ట్యా కాని ఆంధ్రప్రదేశ్ వాదం తిరుగు లేనిది. ఇందుకు విరుద్ధమైన యే విధానమైనా జాతీయ సౌభాగ్య, ప్రాంతీయ అభివృద్ధులు రెండిటికి భంగం కలిగిస్తుంది. 1951 ఒప్పందం సందర్భంలో ప్లానింగు కమిషన్ వీటినే లెక్కలోనికి తీసుకొన్నది. ఇప్పుడు ఇప్పుడు వాటినే తిరుగ తోడ జూస్తే ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం జరుగగలదని వేరే చెప్పనవసరంలేదు.




ఉత్తమ గ్రామం మునుగోడు——ఒక దృశ్యం. (18వ పుట చూడుడు)



మునుగోడులో కొత్త మంచినీటి బావి.



మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ. 400/- విరాళమిచ్చిన శ్రీయుతులు గుర్రం చంద్రయ్య (30 సంవత్సరాలు). బుచ్చయ్య 55 సంవత్సరాల).



నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌లో రేడియో గోష్ఠి.



శ్రీమతి చూడమ్మ—నల్గొండ జిల్లా మట్టంపల్లి స్త్రీల పంచాయతీ అధ్యక్షురాలు



మట్టంపల్లి స్త్రీల పంచాయతీ సభ్యురాండ్రు (మధ్యనున్న ఆమె గ్రామంలోని మహిళామండలి అధ్యక్షురాలు శ్రీమతి ఆదెమ్మ.)

(9వ పుట చూడుడు)



చౌటుప్పల్‌లో 'గొల్లసుద్దులు' ప్రదర్శన.



అప్సరస–నల్గొండ జిల్లాలోని పానగల్ దేవాలయం కుడ్యాలపై శిల్పా



స్వర్గీయ శ్రీ ఖాసా సుబ్బారావు

(33వ పుట చూడుడు)



చిత్రకారుడు: జి. జి. కృష్ణమూర్తి.
గుంటూరు.

తన్మయత్వం మతిని చెరచు

అల్లూరి సీతారామరాజు చరిత్ర

ఆంధ్రవీరుని అద్భుత జీవితము

అన్ని వివరాలతో

సచిత్రంగా వర్ణింపబడినది

(రచయిత: యఱ్ఱమిల్లి నరసింహారావు)

★

ఆర్టు పేపరు మీద మనోజ్ఞంగా ముద్రింపబడిన

ప్రభుత్వ ప్రచురణము

వెల: రూ. 2-75 న. పై.

పోస్టేజి అదనం

ప్రతులకు: సమాచార పౌరసంబంధముల శాఖ

ఆంధ్రప్రదేశ ప్రభుత్వం,

హైదరాబాదు - 1

విశిష్టుడైన పత్రికా రచయిత:

శ్రీ. శే. ఖాసా సుబ్బారావు

'ఓల్డ్ టైమర్'

"ఖాసా" అద్వితీయుడు. పత్రికా రచయితలు లేక రచయితల లోనే కాదు ప్రజాసేవా రంగంలో పనిచేసే యే తరగతి వారిలోనైనా సరే అటువంటి వ్యక్తిని కనుగొనడం కష్టం. శ్రీ ఖాసా నూటికి కోటికి అరుదుగా వుండేరకం మనిషి అని చెప్పాలి

అయితే యెలాగ? ఎందువల్ల? అనే ప్రశ్నలకు జవాబు చెప్పడం కష్టం.

వెనకటికి గాంధీజీ గొప్పతనాన్ని నిర్వచించడానికి యెవరో ప్రయత్నించారు. ఈ విషయాన్ని నిష్పాక్షికంగా తేల్చుకుందికి "ఆయన కంత గొప్పతనమిచ్చి లక్షలాది ప్రజలాయనను యెందుకు ఆరాధిస్తున్నారు?" అని ప్రశ్నించుకున్నాడు. కాని అలా ప్రశ్నించుకొన్న వారి మనస్సులోనే వ్యతిరేకమైన జవాబులు వచ్చేవి: ఆయన గొప్పకవి కాడు; మహా రచయిత అంతకంటె కాదు; ఆయన కంటే బాగా వ్రాయగలిగిన వారెందరో వున్నారు. మన తత్త్వశాస్త్రవేత్తలలో అధికతముడు కాదు రాజకీయాలలో మాత్రం ఆయన అందరినీ మించిన బుద్ధిశాలియా? నిజానికాయనా హిమాలయా పర్వతాలవంటి పెద్దపెద్ద పొరబాట్లు చేస్తూనే వుంటాడు..."మరి అయితే అందరూ ఆయనను 'మహాత్మ'డని గౌరవించి జాతీయ నాయకులలో మణిపూస వంటి వారని యెందుకు ప్రశంసిస్తారు? ఆయన గొప్పతనం అందరికీ కనబడేది, యెవరూ కాదనలేని. అయితే నేం దానికి మూలకారణమేమిటో చెప్పడం మాత్రంసాధ్యం కాదు.

అలాగే ఖాసా సుబ్బారావు అద్వితీయమైన వ్యక్తిగా యెందుకు కనబడే వాడో నిర్వచించడం కష్టం. ఆయన కాలంలో ఆయనతో పాటు పని ప్రారంభించి భాగ్యశాలులైన పత్రికా రచయితలున్నారు: తమ గ్రంథాలను విదేశీయ సంస్థలచే ప్రకటింపజేసుకొని అమిత ధనాన్ని రాయల్టీలుగా పొందిన రచయితలున్నారు. త్యాగధనులై కష్టాలనుభవించిన రాజకీయ వేత్తలున్నారు. వారిపేర్లు దాదాపు ప్రతిరోజూ పతాక శీర్షికలలో దర్శన మిచ్చేవి, కాని "ఖాసా" తో కొన్నిక్షణాల పరిచయంతో మనిషి ముఖంలో వెలిగే ఆనందోత్సాహాలు కాని మహా గౌరవం కాని కలిగించడం వారికి సాధ్యమయేది కాదు,

రోజూ పగలు పదకొండు గంటలకు, చేతిలో కలంతో, బంగారు ఫ్రేము కళ్ళజోడును ధరించి, సంపాదకీయం వ్రాసేటప్పుడు చూడాలి ఖాసాను. ఆ ముఖంలో యే విధమైన భావోద్రేకము, అలసట కనబడేవి కావు: ప్రశాంత మనోహరంగా, గంభీరంగా వుండేది. ఆ సమయంలో యెవరైనా చూడటానికి వెడితే అభ్యంతరం చెప్పేవారు కాదు, సరికదా యెంతో వుత్సాహంతో ఆనాటి సమస్యను చర్చించి తను వ్రాసిన సంపాదకీయాన్ని చదివి వినిపించేవారు. ఆయన చిత్తశుద్ధి, దృఢవిశ్వాసం వున్నదానిని వున్నట్టు చెప్పే ధైర్యం ఆయన ప్రతి వాక్యంలోనూ తొంగి చూచేవి. వాటితో యెదటి వ్యక్తి ముగ్ధుడై చిరునవ్వుతో ఖాసా అభిప్రాయాలను అమోదించకుండా వుండలేక పోయేవారు. ఈ వ్యక్తికి ఆయన యందు ప్రశంసా భావమేకాక ఉల్లాసంగా, ప్రశాంతంగా వున్న ఆయన ముఖాన్నిచూసి, తను అప్పుడే విన్న సంపాదకీయాన్ని తలచుకొని, యీయన యింత తీక్షణంగా ఆలోచించి యింత గంభీరంగా యెలా వ్రాయ గలిగేడా అని ఆశ్చర్యం కూడా కలిగేది.

"ఖాసా"యెన్నడూ మాటలను వృధాజేసి యెరుగడు. ఆయన అంతర్దృష్టి బహులోతైనది, నిశితమైనది కావడాన యెంతసున్నితమైన భావాన్నైనా సరిగ్గా దానికి తగిన పదాన్ని వాడి వ్యక్తం

చేసేవారు, శ్రీ అరవిందు రచనలకు ముగ్ధుడై తానుకూడా భావ వ్యక్తీకరణకొక పద్ధతిని రూపొందించుకొన్నారు. "మీరు అసలైన సాహిత్యం వ్రాస్తారు"అని స్వర్గీయ కట్టమంచి రామలింగా రెడ్డి ఖాసాకు ఒకసారి వ్రాశారు. విధివిరామంలేకుండా ప్రతిరోజూ హడావిడిగా సంపాదక వ్యాసాలు వ్రాసే యే పత్రికా రచయితా సి.ఆర్. రెడ్డి వంటి మేధావిచే అటువంటి ప్రస్తుతిని బడయలేదు. సాహిత్య విలువగల సంపాదకీయాలు వ్రాసేశక్తి ఒక్క ఖాసాకే కలదు. వార్తా పత్రికలలో సాధారణంగా సంపాదకీయాలను అంతగా యెవరూ చదవరు. అందువల్ల లాభమే పరమావధిగాగల యజమానులు వాటిపట్ల అంత శ్రద్ధవహించే వారుకాదు. కాని ఖాసా సంపాదకీయాలను తొలుదొల్త చదివేలా చేసేవారు. పత్రిక ఆఖరుపేజీ అడుగు భాగాన, యెంత చిన్న అక్షరాలలోనైనా సరే, ఆయన పేరు కనబడినంత కాలం, ఆయననెరిగిన పఠితలందరూ ముందు సంపాదకీయాలకై పేజీలు త్రిప్పేవారు—యీ సంపాదకీయాలు రోజూ వ్రాసేవయినా విసుగు జనించకుండా నిత్య నూతనంగా వ్రాసే శక్తి ఖాసాకు కలదని పఠితలకు తెలుసు. ఈ రోజులలో వార్తా పత్రికలు తగినంతగా విక్రయమై నిలువగలగాలంటే పాశ్చాత్య పద్ధతుల ననుసరించి అనేకమైన ఆకర్షణలు కల్పించవలసి వస్తున్నది — అనగా రంగుల ఛాయాచిత్రాలు, కార్టూనులు, వినోదాలు వగైరా, కాని ఖాసా పత్రిక, వారపత్రిక అయినప్పుడు కూడ, బొమ్మలు, కార్టూనులు. యితర అలంకారాలు లేకుండా, కేవలం పఠనీయ విషయాలతోనే నడవగలిగినది. ఖాసా యీ విషయంలో అద్వితీయమైన కృషి చేశారు— ఏ విధమైన వాణిజ్య ప్రకటనలు లేకయే విజయవంతంగా వార పత్రికను నడిపిన గాంధీ మహత్తర కృషికి సమతుల్యమైన కృషి అది.

ఖాసా కేవలం సంపాదకీయాలతో తృప్తిపడి వూరుకోలేదు. "సాకా"అనే మారు పేరుతో "సైడ్ లైట్స్" వ్రాస్తూ మంచికి అడ్డువచ్చి. సౌందర్యాన్ని చెడగొట్టే యే విషయాన్నైనా విమర్శించేవారు. ఈ విమర్శ యెంత నిర్దాక్షిణ్యంగా వుండేదో అంత న్యాయంగా వుండేది. వార్తా పత్రికల-పనితో వూపిరి సలుపక సతమతమవుతూ కూడ శ్రీ ఖాసా పుస్తకాలు కూడా వ్రాశారు. వీటిలో కొన్ని బహు ఉత్తమమైనవి. వాటికి సాహిత్యంలో శాశ్వత స్థానము చేకూరుట తథ్యం.

ఆయన కలానికీ శక్తినిచ్చినది ఆయన వ్యక్తిత్వమే. మనిషి బహునిరాడంబరుడు. స్నేహశీలి. ఈ స్నేహానికి వారూ, వీరూ అనే భేదంలేదు. నిశ్చయాలకు రావడంలో యెంతో విశాలంగా ఆలోచించేవారు. సర్వకాల సర్వావస్థలలోనూ ఒక సిద్ధాంతం కోసం ఆత్మత్యాగం చేయడానికి సంసిద్ధులై వుండేవారు. ఆయనతో మసలి, ఆయనతో కలసి జీవించిన వారికీ సంగతి బాగా తెలుసు—ఈ సద్గుణాలన్నీ మేళనమై సాహిత్య రూపాన్ని గైకొన్నవో అన ఆయన రచనలకొక విశిష్టత యేర్పడేది వీటికి నిశితమైన శక్తితో పాటు పఠితల మనస్సులను రంజింపచేసే సామర్థ్యం కూడ వుండేది. విశిష్టలక్షణలక్షణాంకితమైన యీ పత్రికా రచనను దేశమెన్నటికి మరువజాలదు. దానిని అనుకరించడం అసలే అసాధ్యం. భారతీయ పత్రికా రచనాకాశంలో సాటిలేని మేటి తారగా ఖాసా ప్రకాశించగలడు.

ఎల్లకడలకు వెలవడు నింద్రియముల
బాలపుత్రులఁ దండ్రియు బోలెనాగు
మవియు మనమును నిశ్చలైకాగ్రభావ
మొందుటుత్తమ తపమది యుజ్వలాత్మ

—భార: శాంతి.

శుభోదయం

"సస్యశ్రీ"

ఫలించింది నేటికి మన
తెలుగు వాళ్ల తపస్సు;
విశాలాంధ్ర నలుమూలల
ఉదయించిదుషస్సు;

తెలంగాణ తొలి కోకిల
పలికింది శుభోదయం;
'కోయనె రాయల కోనల'
'కో, కో' యనె కోస్తా,

కను మిదిగో అరసవెల్లి
కను విచ్చిన ప్రభాతం;
విను మదిగో తిరుపతిలో
స్వామి సుప్రభాతం;

కరుణ కురిసి కృష్ణకాటు
కలు కన్నుల పండ,
కొలువై కూర్చుందపుడే
కనకదుర్గకొండ.

వడ సారపు బంగారం
ఒడిని వేసుకొచ్చి.
వరి మళ్లకు పంచుతోంది
వంశధార వచ్చి.

పొంగిన ఎదలోని ఎదను
రంగరించి, నిగ్గు
కేదారాలకి పట్టెను,
గోదావరి ఉగ్గు.

చేపిన చనుబాల తనిపి
చెఱకు తోట తృష్ణ,
పసుపు చేల జలక మాడ
పారుతోంది కృష్ణ.

మంజీరా తుంగభద్ర
మాగాణికి మళ్లేయ్,
ఒంగో ల్నందులు బీళ్లకు
ఏళ్ల తోలు కెళ్లేయ్,

నాగార్జున సాగరాన
మ్రోగింది నగారా;
తెలుగుతల్లి ప్రాంగణాన
వాగింది ఢకోరా.

ప్రశ్నోత్తరావళి

ప్రశ్న : 160 శ్రీ కె. ఆర్. అప్పలనాయుడు, పండిట్, ఐముట్ పేరక్ (మలయా.)

శాస్త్రీయ పరిశోధన మూలకముగా తెలుగు భాష అభివృద్ధికి ఆ భాష ఆధునికీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమేమైనా చర్య తీసుకుంటున్నదా ?

జవాబు: అటువంటి ప్రతిపాదనలేమీ ప్రభుత్వ పరిశీలనలో లేవు.

ప్రశ్న: 161 శ్రీ టి. రామాచార్యులు, తెనాలి.

1. గుంటూరు జిల్లాలో అమరావతి సమీపములో గల "వైకుంఠపురం" పంపింగ్ స్కీము అమలుపరుచుటకు ఎంతధనము వ్యయమగును?
2. ఎన్ని యెకరములు సాగులోనికి వచ్చును ?
3. ఫలితమే పొందు గ్రామముల పేర్లేమి?
4. వెంటనే అమలు పరుచుటకు ఉన్న ప్రతిబంధకము లేవి?
5. ఎప్పుడు అమలుపరచెదరు?
6. ప్రస్తుతము యే దశలో నున్నది?

జవాబు: 1. ప్రత్యక్ష, పరోక్ష ఖర్చులతో సహా యీ పథకం వ్యయం దాదాపు రూ 34.00 లక్షలు.

2. ఈ పంపింగ్ స్కీము క్రింద దాదాపు 17,000 యెకరాలకు నీటి పారుదల లభిస్తుంది.

3. దిగువ గ్రామాలు లాభం పొందుతవి:

1. వైకుంఠపురం	7. వెలగపూడి
2. హరిశ్చంద్రపురం	8. మల్కాపురం
3. బోరుపాలెం	9. మందెడం
4. అబ్బురాజపాలెం	10. ఐనవోలు
5. రావిపూడి	11. నీరుకొండ
6. కొండంరాజుపాలెం	12. పెదపరిమి

4. కేంద్ర జల విద్యుచ్ఛక్తి కమిషన్ యీ పథకాన్ని ఆమోదించవలసి వున్నది.

5. ఈ పథకం కొత్త పథకాలలో 75వ పథకంగా రాష్ట్ర తృతీయ ప్రణాళికలో చేర్చబడినది.

6. విపుల ప్రణాళికలు, అంచనాలకు గుంటూరు ఇన్వెస్టిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీరు క్రింద తుది రూప మివ్వబడుతున్నది.

ప్రశ్న: 162 శ్రీ వి.ఎల్. నారాయణ, శంకరంపేట, మెదక్ జిల్లా. మన రాష్ట్ర మందు క్రొత్తగా యింకనేమైనా పోలీసు స్టేషన్లను యేర్పరచనున్నారా? అందు మా గ్రామము చేరి యున్నదా?

జవాబు: ఈ రాష్ట్రంలో పోలీసు స్టేషన్లను యేర్పరచాలనే ప్రతిపాదన యేదీ యిప్పుడు లేదు.

ప్రశ్న: 163 శ్రీ షేక్‌సయ్యద్ మస్తాన్, వప్పిచెర్ల, గుంటూరు జిల్లా 1. ఆంధ్రప్రదేశ్ జిల్లా లన్నిటిలోకి, క్రొత్త జనాభా లెక్కల ప్రకారము ఎక్కువ జనాభా గల జిల్లా యేది ? దాని జనాభా యెంత ?

2. గుంటూరు జిల్లా జనాభా యెంత? గుంటూరు జిల్లాలోని తాలూకాలవారీగా జనాభా యెంత ?

జవాబు: 1. ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లాలో మిక్కిలి యెక్కువ జనాభా ఉన్నది, అది: 30,09,997.

2.

తాలూకా పేరు		జనాభా
1. గుంటూరు	......	5,78,913
2. తెనాలి	......	4,00,538
3. రేపల్లె	......	2,35,105
4. బాపట్ల	......	4,87,213
5. ఒంగోలు	......	3,88,832

6. నరసారావుపేట	......	3,21,909
7. వినుకొండ	......	1,24,825
8. పల్నాడు	......	2,28,002
9. సత్తెనపల్ల	......	2,44,660

ప్రశ్న: 164 శ్రీ కటారి కృష్ణమూర్తిరెడ్డి, తిరుపతి.

అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్‌లోని యే పట్టణము ఎక్కువ ఆధిక్యతను సంపాదించుకొనుచున్నది? శాతమెంత?

జవాబు: తిరుపతి. మొత్తం జనాభాలో అక్షరాస్యులు శాంత 55.32.

ప్రశ్న: 165 శ్రీ భైరవభొట్ల శేషగిరిరావు, మధిర, ఖమ్మం జిల్లా.

1. మన రాష్ట్రంలో అత్యధికంగా అక్షరాస్యులయే జిల్లాలో వుంటారు? తాలూకా యేది?

2. మన రాష్ట్రం యొక్క ఆదాయం సగటున తలసరి యెంత?

3. మనదేశం యొక్క ఆదాయం సగటున తలసరి యెంత?

జవాబు: 1. గుంటూరు జిల్లాలో మిక్కిలి యెక్కువ మంది అక్షరాస్యులున్నారు. గుంటూరు జిల్లాలో మొత్తం అక్షరాస్యుల సంఖ్య 401,528,(1951 జనాభా లెక్కలు.)

హైద్రాబాద్ జిల్లాలో మొత్తం జనాభాలో అక్షరాస్యుల శాతం హెచ్చు. శాతం 22% హైద్రాబాద్ జిల్లాలోని మొత్తం అక్షరాస్యుల సంఖ్య 4,01,064 (1951 జనాభా లెక్కలు)

2. ప్రస్తుత ధరల ప్రకారం 1958-59 కి రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూపాయలు 275.99 అని అంచనా.

3. అలాగే దేశ సగటు తలసరి ఆదాయం రూ 313 అని అంచనా.

ప్రశ్న: 166 శ్రీ ఎన్. చెన్నకేశవులు, బొటికలపాడు, ఉదయగిరి తాలూకా, నెల్లూరు జిల్లా.

నెల్లూరు జిల్లాలో బస్సులను యెప్పుడు జాతీయం చేస్తారు?

జవాబు: మిగిలిన జిల్లాలలో రవాణా జాతీయకరణ కార్యక్రమం గురించి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్డు రవాణా కార్పొరేషన్ ఇంకా యేమీ నిర్ణయించలేదు.

ప్రశ్న: 167 శ్రీ పమిడి లక్ష్మినారాయణ, అనంతపురం.

అ. అనంతపురం జిల్లాలోని "పెనకచెర్ల" ప్రాజెక్టు ఏ సంవత్సరానికి పూర్తి అవుతుంది?

ఆ. దీనికి యెంత డబ్బు ఖర్చు కాగలదు?

ఇ. ఎంత భూమికి నీటి పారుదల లభించును?

ఈ. ప్రధాన కాలువలు యేయే గ్రామాలగుండా ప్రవహిస్తవి?

జవాబు: అ. దక్షిణ, ఉత్తర కాలువలతో సహా మధ్య పెన్నారు రెగ్యులేటర్‌ను 1963-64 నాటికి పూర్తి చేయాలని సంకల్పించబడినది. (నిజానికి అసలు "పెనకచెర్ల ప్రాజెక్టు" అనే పేరుగల ప్రాజెక్టు లేనేలేదు. కాని మధ్య పెన్నారు రెగ్యులేటర్ పెనకచెర్ల గ్రామం సమీపంలో వున్నది. అందువల్ల యీ సమాచారం యివ్వబడుతున్నది.)

ఆ. 1956 అంచనా ప్రకారం మధ్య పెన్నారు రెగ్యులేటర్‌కు దాని రెండు కాలువలకు రూ. 286.00 లక్షలు ఖర్చు కాగలవు.

ఇ. ఈ మధ్య పెన్నారురెగ్యులేటర్ పథకం క్రింద మొదటి దశలో దక్షిణ కాలువ. క్రింద దాదాపు 70,615 యెకరాలు. వుత్తర కాలువ క్రింద 13,500 యెకరాలు లాభం పొందగలవు. కాని ఆయకట్టు స్థిరీకరణ పని యిప్పుడే చేపట్టబడినది. ఆయకట్టు వివరాలు, గ్రామాల జాబితాలో స్వల్పమైన సమార్పులు రావచ్చును.

ఈ. కాలువలు దిగువ గ్రామాల మీదుగా ప్రవహిస్తవి:

మధ్య పెన్నారు ఉత్తర కాలువ

1. మారుట్ల,	...	అనంతపురం తాలూకా
2. కత్రిమల	...	గుత్తి తాలూకా
3. పాలెం	...	,,
4. రామగిరి	...	,,
5. ఎద్దులపల్ల	...	,,
6. సౌరకాయలపేట	...	,,
7. నెమళ్ళపల్లి	...	,,
8. పామిడి	...	,,
9. దేవరపల్లి	...	,,
10. గనిమికొండ్ల	...	,,
11. గజరాంపల్లి	...	,,
12. మిడుతూరు	...	,,
13. ఎక్లురూరు	...	,,
14. రామరాజుపల్లి	...	,,
15. పెద్ద వడుగూరు	...	,,
16. ఆవులంపల్లి	...	,,

మధ్య పెన్నారు దక్షిణ ప్రధాన కాలువ

1. పెంకనచెర్ల	...	అనంతపురం తాలూకా
2. కప్పలకొండ	...	,,

3. కృష్ణాపురం ... అనంతపురం తాలూకా
4. ఎర్రగుంటాల్ ... ,,
5. బుదేడు ... ,,
6. మార్టాడు ... ,,
7. ఘొడిరాళ్ళ ... ,,
8. తాటిచెర్ల ... ,,
9. సోమనదొడ్డి మై. 16_3_430 మై. 17_2_240 అనంత పురం తాలూకా
10. నారాయణపురం మై. 17_2_240 మై. 18_4_580 ,,
11. సోమనదొడ్డి మై. 18_4_580_మై. 18_6_540 ,,
12. నారాయణపురం మై. 18_6_540 మై. 19_7_420 ,,
13. అనంతపురం ... అనంతపురం తాలూకా
14. బుక్కరాయ సముద్రం ... ,,
15. రెడ్డిపల్లె ... ,,
16. బోడిగాని దొడ్డి ... ,,
17. కొర్రపాడు ... ,,
18. కొండకింద అగ్రహారం... ,,
19. బొండ్లవాడ ... ,,
20. పప్పూరు ... ,,
21. దేగుమర్రి ... ,,
22. గుడుగు ... ,,
23. దేగుమర్రి ... ,,
24. నార్పల ... ,,
25. చానలూరు ... ,,
26. నడిమి దొడ్డి ... ,,
27. వెంకటంపల్లి ... ,,
28. కొడవకల్లు ... ,,

తాడిపర్తి శాఖ (మ.పె. దక్షిణ కాలువ)

1. అమ్మల్లదిన్నె ... తాడిపర్తి తాలూకా
2. జూటూరు ... ,,
3. పెద్దపొలమడ ... ,,
4. చింతకుంట ... ,,
5. కందికాపుల ... తాడిపర్తి తాలూకా
6. పుట్లూరు ... ,,
7. కోమటికుంట ... ,,

ప్రశ్న: 168 శ్రీ వై.ఎస్. నరసింహారావు. బి.ఎ., రాజమండ్రి.- శ్రీ సంజీవరెడ్డి శంకుస్థాపన చేసిన తొర్రిగడ్డ పంపింగ్ స్కీము నిర్మాణం యెప్పుడు ఆరంభమవుతుంది? ఎప్పుడు పూర్తి అవుతుంది? ఎంత ఖర్చు అవుతుంది? ఎంత భూమికి నీటి పారుదల లభిస్తుంది? కాలువ యేయే గ్రామాలమీదుగా ప్రవహిస్తుంది?

జవాబు: 1. తొర్రిగడ్డ పంపిగ్ స్కీము నిర్మాణం జరుగుతున్నది.

2. దాని ఖర్చు రూ 36.205 లక్షలు.

3. దీని క్రింద 15,400 యెకరాలకు నీటి పారుదల కల్పించాలని సంకల్పం.

4. ఈ పథకం కుడికాలువ దిగువ ప్రదేశాల భూములకు నీటి పారుదల లభింపజేస్తుంది. పురుషోత్త పట్నం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, చినకొండేపూడి, రఘుదేవపురం, ముగ్గల, దానిశివా, రుపేదులుపల్లి, రాజంపేట, తాటవరం, జాలిమూడి, బొబ్బర్లంక.

ఎడమ కాలువ దిగువ ప్రదేశాల భూములకు నీటి పారుదల లభింపచేస్తుంది.

పెదకొండేపూడి, చీపురుపల్లి, దానిశివార్లు, నాగంపల్లి, నల్గొండ, కోటి, కూనవరం, మునగాల, కాపవరం, బూరుగుపూడి, గుమ్మిలూరు, బుచ్చంపేట.

ప్రశ్న: 169 శ్రీ గంగయ్య, లింగంపేట, నిజామాబాద్ జిల్లా.- చిన్న చిన్న గ్రామాలకు, నిజాంసాగర్ నుంచి విద్యుచ్ఛక్తి సరఫరా అవుతుంది. కాని మా "లింగంపేట" యింత పెద్ద గ్రామమైనా దానికి విద్యుచ్ఛక్తి సరఫరా కాకపోవటానికి గల కారణమేమిటి?

జవాబు: "లింగంపేట గ్రామానికి విద్యుచ్ఛక్తి సరఫరా విషయం 1961_62 మొదటి మూడు నెలల్లోను పరిశీలించబడుతుంది.

ఈ పరిశీలనానంతరం, యీ పథకం లాభకరమని తేలినచో యీ గ్రామానికి విద్యుచ్ఛక్తి సరఫరాకై అవసరమైన యితర చర్యలు తీసుకొనబడగలవు.

తపఃప్రకాష్ఠ

జొన్నలగడ్డ మృత్యుంజయరావు

కందుకలీల నైతమును గ్లానిని గూరుచు నే పడంతి క
ల్యందునిభాస్య యంబిక వహించెఁ గఠోరతరవ్రతస్థితిన్;
సుందనపుం బయోజమునఁ గోమలి మై రచితమ్ము; నిశ్చయ;
మ్మందులకే నిసర్గమృదు వయ్యు ససారమయై తనర్చుటల్.

2

అతులితనిష్ఠమై విశదహాస సుమధ్యమ ప్రజ్వలచ్చతు
ర్హుతవహమధ్యసీమమున నుండి తపం బొనరించుచున్ శుచిన్
క్షితిధరరాజకన్య నిజనేత్రయుగప్రతిఘాతికాంతిసం
హతిని సహించుకొంచు నరుణాంశునిఁ జూచె ననన్యదృష్టియై.

3

ఆ వసుధాధరేంద్రతనయామణి ముద్దుమొగమ్ము పంకజ
శ్రీ వహియించె భాస్కరమరీచికదంబకతప్తమై యటుల్;
తావుకొనెం దదీయముఖతామరసమ్మున సోగలైన కన్
గ్రేవలయందు మాత్రము వినీలిమ యత్తఱి మెల్లమెల్లనన్

4

అమరును వేఁడకుండ నెది యా యుదకమ్మన క్రోలుఁ గేవల
మ్మమృతమయాత్ముఁడౌ విధుని యంశుచయమ్మన యారగించు నా
రమణి; గ్రహింప దన్యము; ధరాధరరాజతనూజ కిట్టు లా
సమయమునందుఁ బారణ యొసంగు మహీరుహవృత్త్యభిన్నమై.

5

హిమనగసార్వభౌమసుత నిట్లు నభశ్చరమున్ సమిత్సమి
ద్ధము నగు నగ్నిపంచకము దారుణభంగిఁ దపింపఁ జేయ, న
య్యమయుఁ దపాత్యయమ్మున నవాంబుచయోక్షిత యైనయంత బా
ష్పము వెడలించె నూర్ధ్వగముఁ బంచహుతాశనతప్తభూమితోఁ,

6

కాంత పక్ష్మములన్ నిల్చి క్షణము, తాడి
తాధరములయి, కుచసముత్సేధపాత
జర్జరములయి, వళులందు స్ఖలితములయి
తుదకుఁ బ్రథమోదబిందులు తొనఁకె నాభి.

7

అటులు నిరంతరమ్ములయి యంతరవాతము లైన వృష్టులన్
గటికిశిలం బరుండుచు నగారము వీడి వసించుచుండఁగన్
బటుతరమౌ తపమ్మునకుఁ బాయని సాకిరులైన శర్వరుల్
తటిదవలోకనమ్ముల నిలాధరపుత్త్రిని జూడఁ బోలెడిన్,

8

కమలదళాక్షి గౌరి యుదకంబులఁ గోరికమై వసించుచున్,
సముఖమునన్ వియోగమున సారెకు నొక్కటి నొండు పిల్చు చ
క్రములను దద్దయుం గనికరమ్మునఁ గాంచుచుఁ బుచ్చుచుండె స
త్యమిత హిమోత్కరానిలములై యలరారు సహస్రరాత్రులన్.

9

అబ్జగంధియుఁ, గంపమానాధరదళ
శోభియును నైన ముఖమున సుదతి నిశలఁ
దుహినవృష్టి వినష్టపాథోజలక్ష్మి
కుదకమున కబ్జఘటనమ్ము నొసఁగఁ బోలు.

10

క్షితిజములనుండి స్వయము విశీర్ణమైన
పర్ణతతిఁ దించు మనికి తపః ప్రకాష్ఠ;
అదియు విడుచుట నా ప్రియంవద నపర్ణ
యనియు సంద్రు పురావిదులైన మునులు.

11

ఆ లలనాకులాభరణ మట్టి వ్రతమ్ములచే మృణాలికా
పేలవమౌ నిజాంగమును బెట్టు కృశింపఁగ జేసి రేవగల్,
చాల దృఢమ్ములౌ తనువులన్ మునివర్యులు గాంచు నా తప
శ్శీలను సైతముం గరముఁ గ్రిందగునట్లొనరించె నత్తఱిన్.

—ఆంధ్రీకృత కుమారసంభవము నుండి.

హింస సేయనివాఁడు లేఁ డిజ్జగమున
నొక్కఁడైనను దమతమ యోపినట్లు
హింస తెరువున కెడగల్గి యేఁగవలయు
నదియచూపె యహింసనా సతిశయిల్లు

— భార.

విశేషాలు

రెండు సన్మానాలు

మే మూడవ వారంలో మౌంట్ ఆబూలో జరిగిన తాటి బెల్లం పనివారి అఖిలభారత సమావేశంలో మనరాష్ట్రానికి రెండు సన్మానాలు లభించినవి.

ఒక ప్రాథమిక సహకార సంఘంద్వారా శాస్త్రీయ పద్ధతిలో తాటిబెల్లం వుత్పత్తికి దోహదం చేసినందుకు ఆంధ్రప్రదేశ్‌కి ఒక షీల్డు బహూకరించబడినది. ఆంధ్రప్రదేశ్ మద్యనిషేధం, తాటి బెల్లం పరిశ్రమ అభివృద్ధి సంఘం కృషి మిక్కిలి ప్రశంసించబడినది. మద్యనిషేధం, తాటిబెల్లం పరిశ్రమలకు సంబంధించిన సర్వ విషయాలను ప్రజలకు బోధించడంలో ఆ సంస్థ చూపిన ధైర్య స్థైర్యాలను వుగ్గడిస్తూ దానికి ఒక సన్మాన పత్రం కూడా యివ్వబడినది.

ఆంధ్రలో వికేంద్రీకరణ:
లోకసభ అధ్యక్షుని ప్రశంస

రాజస్థాన్, ఆంధ్రలు దేశంలో మిగిలిన రాష్ట్రాలన్నిటి కంటే ముందుగా ప్రజాస్వామ్య వికేంద్రీకరణ పథకాన్ని ప్రవేశ పెట్టినవనీ, యిలా ప్రవేశ పెట్టినందులకేమి, దానిని విజయ వంతంగా అమలు జరుపుతున్నందులకేమి యీ వుభయ రాష్ట్రాల ప్రజలు తమను తాము అభినందించుకోవచ్చునని లోక్‌సభ అధ్యక్షుడు శ్రీ అనంతశయనం అయ్యంగారు యిటీవల జయపురంలో పేర్కొన్నారు.

ఆంధ్ర విద్యార్థికి అమెరికా సన్మానం

వాల్తేరుకు చెందిన శ్రీ సీతారామ శాస్త్రిని వైజ్ఞానిక ఫలితాల సాధనకు అమెరికా నేషనల్ సైంటిఫిక్ ఆనరరీ సొసైటీ సన్మానించినది. ఇండియానా యూనివర్సిటీలో యిట్టి సన్మానం పొందిన ఆర్గురు భారతీయ విద్యార్థులలో శ్రీ శాస్త్రి ఒకరు. ఈయనకు ఆ సొసైటీ ఇండియానా యూనివర్సిటీ చార్టర్‌లో సభ్యత్వ మీయబడినది. ఈయన విద్యారంగం పదార్థ విజ్ఞాన శాస్త్రం.

హైదరాబాదులో పారిశ్రామిక సంస్థ

ఫోర్డు సంస్థ సహాయంతో కేంద్ర ప్రభుత్వం త్వరలోనే హైదరాబాదులో కేంద్ర పారిశ్రామిక విస్తరణ శిక్షణా సంస్థ నొకదానిని నెలకొల్పగలదు. ఇటువంటి సంస్థ యింతవరకు భారత దేశంలోనే, బహుశా ఆగ్నేయ ఆసియాలోనే లేదు. ఈ సంస్థకు ఒక కోటి రూపాయలకు మించి ఖర్చు కాగలదని అంచనా.

విస్తరణ సిబ్బంది శిక్షణ కవసరమైన సాధన సంపత్తిగల యీ సంస్థలో మూడు పెద్ద గ్రూపులను చదువవచ్చు: 1. ఆర్థికాభివృద్ధిలో చిన్న పరిశ్రమలు— 2. విస్తరణ పద్ధతులు. కమ్యూనికేషన్ పద్ధతులు. 3. చిన్న పరిశ్రమల నిర్వహణ.

ఈ సంస్థలో గల శిక్షణా కార్యకలాపాలకు తోడు ఫీల్డు పరిశీలన, పరిశోధనలతో సహా ప్రత్యేక విద్యా కార్యక్రమం వుంటుంది. (మిగతా 51వ పేజీలో)

కథానిక:

మామిడి పండు

'నవ్య శ్రీ'

బజారంతా చాలాసందడిగా వుంది. మధ్యందిన మార్తాండుని ప్రచండకిరణ సముదాయమును గూడ లెక్కచేయకుండా జనము అదే పనిగా సాగిపోతున్నారు. నాటుబండ్ల గరగరలు, కారు హారన్ల సవ్వడులు, సైకిలు గంటల గణగణలు, జట్కావాళ్ల కేకలతో బజారంత చాలా కోలాహలంగా వుంది. వింతవింత వస్తువులతో, ట్యూబులైట్ల తళతళలతో చూపర్లకు ముచ్చట గొలుపుతున్నాయి షోకేసులు.

ముఖము నుండి దిగజారే స్వేదస్రవంతిని మోకాళ్లక్రిందకు వ్రేలాడుతున్న చొక్కా అంచుతో తుడుచుకుంటూ శూన్యంగా వున్నతన జోలెలోనికి దృష్టిని సారించి భారంగానిట్టూర్చాడు రాము', తన వంకా, తనచొక్కావంకా బాధగా చూసుకున్నాడు. భారంగా రెండడుగులేశాడు. ఎదురుగా కనిపించిన దృశ్యం చూడగానే శరీరం జలదరించింది అతన్నంత భయపెట్టిన ఆ దృశ్యమూ ఎదురుగా మోటారుకార్ల షోకేసు అద్దంలోకనిపించినతన ప్రతిబింబమే! తైలసంస్కారములేక జడలుకట్టిన జుత్తు, లోతుకు పోయిన దవడలు, ఎముకలు బయటకు పొడుచుకొచ్చిన తన ఆకారం తనకే భయం కల్గించింది. రెండు చేతులతో తన కండ్లను గట్టిగా మూసేసుకున్నాడు. అప్రయత్నంగా ఆ పసివాని నయనద్వయం నుండి రెండేరెండు కన్నీటిబొట్లు ఆలేత చెక్కిళ్ల మీదుగాజారి నేల మీద పడి యింకి పోయాయి. భారంగా ముందుకు సాగాడు. మీద నెత్తి క్రిందకాళ్లూ మాడుతుంటే, ఆకలి బాధ అతిశయిస్తుంటే ఆ పసివానిలో ఓపిక రానురాను సన్నగిల్ల సాగింది. సూర్యోదయాది విర్వారామంగా కాళ్లరిగేటట్లు తిరిగి గొంతు చించుకుని అరిస్తే ఏం ప్రయోజనం ఒక్క నయా పైసా దొరక లేదు కదా పైపెచ్చు తిట్లు కూడా తిన్నాడు. అయినా తను ముష్టెత్తితే వీళ్లకేం చిన్నతనం? అంత చిన్న తనమనుకున్న మనుష్యులు తనకో, బేడో, పావలో పారెయ్య కూడదూ? అనుకున్నాడు రాము.

అట్లా ఆలోచిస్తూనే నడుస్తున్నాడు. నడుస్తున్నవాడు హఠాత్తుగా ఆగి పోయాడు. ఫ్లోరసెంటు ట్యూబుల కాంతిలో, అగరువత్తుల పరిమళంలో తెల్లని స్టెయిన్‌లెస్ స్టీలు పళ్లేలలోని రకరకాల మిఠాయిలు 'రండయ్యారండి! మమ్మల్ని రుచి చూసి మరీ కదలండి!' అంటూ స్వాగత గీతాలు పల్కుతున్నాయి. గల్లా పెట్టి దగ్గర కూర్చున్న షావుకారు 'సవ్యసాచిలా రెండు చేతులతో డబ్బులు పుచ్చుకుంటున్నాడు, పావులాలు, అర్ధలూ, రూపాయిలూ గలగల్లాడుతూ అతని చేతిలోనుండి గల్లా పెట్టిలోకి మాయమవుతుంటే మంత్రముగ్ధుడై ఆ దృశ్యాన్ని అట్టే తిలకిస్తూ మైమరచి పోయాడు. రాము, కొంత సేపటికి ఆమైకం నుండి తేరుకుని తన జోలలోకి దృష్టి సారించాడు. ఆశ్చర్యాంబుధిలో నుండి బైటపడిన అతని మనసుని విషాద మేఘాలు ఆవరించుకున్నాయి. వెల్లువలై పెల్లుబికి వచ్చే దుఃఖ స్రవంతిని? అతి కష్టం మీద దిగమ్రింగుకున్నాడు–ఇటూ అటూ కలయ జూశాడు. ఇంతలోనే తల్లి ఎపుడో అన్న మాటలు హఠాత్తుగా జ్ఞప్తికొచ్చాయి.

'మనమంతా భగవంతుని బిడ్డలము నాన్నా!"–అంది తల్లి.

"కాదు! మమ్మాటికీ కాదు! భగవంతుడే అందర్నీ పుట్టిస్తే వాడి గల్లా పెట్టెలో అంత డబ్బుండడమేం? తన జోలెలో చిల్లి కాని కూడ లేకపోవడమేం? భగవంతునికింత పక్షపాత మెందుకు? అమ్మా నాన్నలకందరు బిడ్డలూ సమానమే గదా? తన తల్లి అబద్ధం చెప్పింది. అందరూ దేముడి పిల్లలు కారేమో?'–ఇట్లా సవాలక్ష ప్రశ్నలాక్షణమందే ఆ లేతమనసుని వుక్కిరి బిక్కిరి చేసేశాయి.

ఈ ప్రశ్నలతో ఆ లేత మనసు సతమతమవుతుంటే ఆ అంగడికి ఒక కుఱ్ఱాడు. ఒక మధ్యవయస్కుడొకాయన ఆ కుఱ్ఱవాడి తండ్రికాబోలు వచ్చారు ఆ తండ్రి కుఱ్ఱవాడికి మైసూర్‌పాక్‌కొని

పెట్టాడు. వుత్సాహంగా ఆ మైసూర్‌పాక్ ముక్కను తీసుకుని ఇవతలకొచ్చి నిలబడ్డాడు కుఱ్ఱాడు. అచ్చంగా తనలాగే, తనంత పొడుగేవున్న ఆ అబ్బాయిని చూడ ముచ్చటేసింది 'రామూ'కి పొడుగు చేతుల సిల్కు లాల్చీ, కాకీ నిక్కరు, చిన్న బూట్సు జోడు తొడుక్కుని రీవిగా నిలబడ్డాడు ఆ కుఱ్ఱాడు, ఆ ముద్దుగొలిపే ముఖమూ, ముచ్చటైన వుంగరాల జుత్తువంక చూస్తూ అట్టే నిలబడి పోయాడు రాము,

'ఎంత తేడా తనకీ అతనికీ?' — బోలెడు ఆశ్చర్యపోయాడు. తామిద్దరూ దేముడి బిడ్డలే అయినా ఎంత పక్షపాతం దేముడికి? ఆ మాటకొస్తే దేముడికన్నా తన తల్లేనయం. తననీ, చెల్లాయిన్నీ సమంగా చూసుకుంటుంది. వీసమంతైనా హెచ్చు తగ్గులు రానీయదు. ముమ్మాటికీ తన తల్లే నయం దేముడికన్నా! భయదజీ సంకుమూల రోదసీ కుహరంలో క్షణంకాలం మెరసి ఆరిన తటిల్లతలా విషాదమేఘాచ్ఛాదితమైన అతని వదనబింబము మీద మందహాసద్యుతి మెరిసి మాయమైంది.

ఆ సిల్కు లాల్చీ అబ్బాయి మైసూరుపాకు ముక్క చిదిమి నోట్లో పడేసుకున్నాడు.

రామూ నోరూరింది—ఆశాపూరిత నయనాలతో ఆ కుఱ్ఱవాని ముఖంలోకి చూశాడు. అప్రయత్నంగానే అతని చెయ్యి ముందుకు పోయింది. రాముని చూశాడా అబ్బాయి.

ఎంత దీనమైన చూపు!

ఎంత జాలిగొలిపే రూపు!!

ఆ పసి హృదయం ద్రవించింది. అమాంతం తన చేతులో వున్న ముక్కనంతా ఇచ్చెయ్య బోయ్యాడు. రామూ సంతోషంతో అందుకోబోతున్నాడు. ఇంతలో వురుము లాంటి తండ్రికేక విని కుఱ్ఱవాడు గజగజా వణకిపోతూ జాపినచేతిని వెనుకకు లాగేసుకున్నాడు. రామూ గజగడలాడి పోయాడు. తన గురించి కాదు. ఆ కుఱ్ఱవాడి నతని వెర్రి కోపంలో తండ్రి ఏం చేస్తాడోనని విలవిల్లాడింది రామూ పసి ప్రాణం. కాని అంత ప్రమాదకరమైన పనేదీ ఆ తండ్రి చెయ్యలేదు—"ఫూల్! బుద్ధి లేదూ? ఎంతో డబ్బు తగలేసి నీకు కొనివ్వడం నువ్వు ప్రతి అడ్డమైనవాడికీ దానం చెయ్యడానికా? ఇంటికి పద" అని రెక్క పట్టుక ఈడ్చుక పోతూ రామునివంక కోపంతో వురిమిచూసి "ముష్టి వెధవ! అమాయకుడ్ని చూసి మైసూరుపాకు కాస్తా కాజేయాలని చూశాడు" అని విసవిస నడిచి పోయాడు. మానుతున్న గాయానికి కారం తగిలినట్లయింది. లోపలినుండి వుబికి వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు. కండ్లవెంట జిలజిలా కన్నీరేకారింది. కారే కన్నీటిలో నుండి మసకమసకగా కనిపించే ఆ తండ్రికొడుకుల ఆకారాలు దూరమయ్యేవరకూ అట్లాగే నిల్చున్నాడు. ఇంతలో కీచుమని శబ్దం చేసుకుంటూ ఆగిన కారు, చుట్టూపోయే జనంకోలాహలం విని తిరిగి బాహ్య ప్రపంచంలో కొచ్చి పడ్డాడు. ఎదురుగా కండ్లవెంట విస్ఫులింగాలు క్రక్కుతూ పెద్ద అంగలతో సమీపించి ముష్టివెధవా! కళ్లు కనిపించడంలే? రోడ్డు నీ బాబు వేయించినట్లు అడ్డంగా తగలడ్డావు దిష్టిబొమ్మలాగ? నీలాంటివాళ్లు ఛస్తే పీడవిరగడవుతుంది గానీ పోలీసు స్టేషను చుట్టూ తిరగలేక నా పనవుతుంది" అంటూ రెండు చేతులతో ఒక్క విసురు విసిరాడు ఆ డ్రైవరు రామును. ఆ విసురుకి ఈన పుల్లలాగున్న రామూ ఈ వినోదం చూడటానికి మూగిన జనం మీద పడ్డాడు. "ఛీ !" అని చీదరించుకుంటూ తలో మాట అనుకుంటూ జనమంతా తమ దారిని తాము పోయారు.

ఈ సంఘటనతో ఆ పసి హృదయం తునాతునకలై పోయింది. చెక్కిళ్ల మీద నుండి సంతత ధారాపాతంగా కారే కన్నీటినైనా తుడుచుకోకుండా ఆ బజారుగుండా ముందుకు సాగి పోయాడు.

నడుస్తున్న అతని కాళ్లకి మళ్లీ సడన్ బ్రేక్ పడింది. నింగిలోని నక్షత్రంలా ఆ తారురోడ్డు మీద తళతళ మెరుస్తున్నదొక రూపాయి. ఆ పసి వాడి కండ్లు చెదిరాయి ఒక్క సారి. కళ్లు గట్టిగా నలుపుకుని మళ్లీ చూశాడు. నిజంగా రూపాయే ! హృదయం ఆనందంతో నిండిపోయింది. సంతోషంతో మనస్సు పరవళ్లు త్రొక్కింది. ప్రవాహంలో కొట్టుక పోయేవాడికి కట్టెదుంగ దొరికి నప్పుడు కలిగే సంతోషం లాంటిది ఆ సంతోషం: ఇటూ అటూ బెదురుగా చూశాడు. తననెవ్వరూ గమనించ లేదు. ఎవరి పనుల్లో వారు హడావుడిగా తిరుగుతున్నారు. రెప్పపాటుకాలంలో ఆ రూపాయిని చేజిక్కించుకున్నాడు. దాని స్పర్శ ఒక్కసారి అతని మనస్సుమీద టానిక్కులా పనిచేసింది. అతనిలో ఒక క్రొత్త వుత్సాహం పుట్టుకొచ్చింది. మనస్సంతా అనేకమైన వూహలతో పద్మవ్యూహంలా తయారైంది. "అబ్బ! ఎంత హాయిగా వుంది ఈ రూపాయి చేతిలోకి రాగానే? డబ్బంటే అందరికీ ఎందుకంత ప్రేమో ఒక్కసారి అతనికి తేటతెల్లమయింది.

తన తల్లికీ రూపాయి తీసుకెళ్లి యిస్తే ఎంత సంతోషిస్తుందో? రెండు రోజులనుండీ తామెవ్వరూ కడుపునిండా అన్నమే తినలేదు. ఈ నాడు తాము హాయిగా కడుపునిండా భోంచేయొచ్చు. సంతోషంతో వూగిసలాడి పోయింది ఆ పసి హృదయం. నడక వేగము హెచ్చించాడు.

"ప్రక్కకు చూడవయ్యా!"— హెచ్చరించింది మనస్సు. బుర్ర ప్రక్కకు తిప్పాడు. కాళ్లను సడెన్‌గా బ్రేక్ పడింది. ఎదురుగా దోరగా పండిన మామిడి పండ్లు బుట్టలలో నుండి యాతాయత జనంబుల వంక తొంగి చూస్తూ అందరినీ రమ్మని ఆహ్వానిస్తున్నాయి. ఓరగా తెరచిన తలుపు ప్రక్కన నిలబడి సిగ్గుతో క్రీగంటను రహదారి వెంటవోయే బాటసారులను వీక్షించే కన్నె పిల్లల్లాగా అందర్నీ ఆకర్షిస్తున్నాయి ఆ పండ్లు. చేతిలోని రూపాయి "పదవయా! నేనుంటే నీకేం భయం?—అని హామి యిచ్చింది. అతని కాళ్లు అప్రయత్నంగా ఒక అంగడి వైపు నడిచాయి. అంగడి ముందు ఆగాయి. తన చేతిలో రూపాయివంక చూసుకున్నాడు. అంగడి వాడ్నిచూసి చెరుకు రసాలవంక చెయిపెట్టి చూపించి "ఆ పండ్లెలా?"—అని అడిగాడు. రాముని ఆపాదమస్తకం పరిశీలించాడు అంగడి యజమాని. "పావలాకు మూడు" నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు.

"అయితే ఒక పావలా వియ్యి!"—అంటూ రూపాయి చేతికిచ్చాడు రామూ. తన చేతిలో రూపాయి వంక చూశాడు. రాముని ఆపాదమస్తకం పరిశీలించాడు. ఒక్కసారి అతనిలో నిద్రాణమైయున్న రాక్షస ప్రవృత్తులు జాగరిత మయ్యాయి.

"ఎక్కడిదిరా నీకీరూపాయి?"—గర్జించాడు కోపంతో. రామూ చలించి పోయాడు. భయంతో నోట మాట రాలేదు. "ఏం మాట్లాడవేం?"— మళ్ళీ గర్జించాడు, ఒక్కసారి మౌనం పటాపంచలయిపోయింది. బొంగురుపోయిన గొంతుకతో నీరసంగా "దొరికిందండీ"—అన్నాడు. "ఎక్కడ?"—మళ్లీ అదే గర్జన.

"బజారులో దొరికిందండి"—అన్నాడు దీనంగా ముఖం పెట్టి. ఈ జవాబు వినిపకాలుమని నవ్వాడు భూమ్యాకాశాలు దద్దరిల్లేలా. అమాంతం ఇంత కఠినత్వం ముఖానికి పులిమేసుకుని "రూపాయిలు దొరికే అదృష్టవంతుడివైతే ఈ దౌర్భాగ్యమెందుకురా నీవు నిక్షేపం లాగుందువు. అబద్ధాలాడక చెప్పు ఇది ఎవడి జేబు కత్తిరించి తెచ్చావ్? అబద్ధమాడావో డొక్క చీరేస్తాను. ఆ వచ్చే బీట్ కానిస్టేబుల్‌ని పిల్చి జెయిల్లో పెట్టిస్తాను. ఊఁ! చెప్పూ!" అన్నాడు పసివాడి ముఖంలోకి సూటిగా చూస్తూ.

వాడి లేత హృదయం వేయి సమ్మెటలతో కొట్టినట్లు విలవిల్లాడింది. ఉప్పెనలా దుఃఖం ముంచుకొచ్చింది. తను దొంగా? జేబుదొంగా?—మనస్సులో బాధగా గొణుగుకున్నాడు. అంగడి వాని చేతిలో రూపాయివంక చూశాడు. ఫస్టు తారీఖునాడు ఇంటి ముందు ప్రత్యక్షమైన కాబూలివాడిని చూసిన గుమాస్తా గుండెలా శరీరమంతా భయంతో జలదరించింది. తనలో శక్తి నంతా కూడ దీసుకుని పరుగు లంకించుకున్నాడు వెనుకకు తిరిగి. అంగడి వాడు విజయసూచకంగా వికటాట్టహాసం చేశాడు.

బజార్లన్నీ దాటి చాలా దూరం వచ్చాక గాని వాడు ఆగ లేదు. ఆగి ఇటూ అటూ చూసి "అమ్మయ్య!" అని నిట్టూర్చాడు. మనస్సులో మాత్రం మామిడి పండ్లమీద మమకారం తగ్గ లేదు.

దారిలో ఒక ఇంటి అరుగుమీద కనబడిన దృశ్యము అతని నెంతో ఆకర్షించింది. ఆ అరుగుమీద కొందరు పిల్లలు కూర్చుని మామిడిపళ్ళు తింటున్నారు. ఒకరిలో నొకరు సరాగాలాడుకుంటూ మధ్య మధ్య ఆ మామిడి పండ్లలోని రసాన్ని పైకె గమీలుస్తూ వుల్లాసంగా వున్న ఆ పిల్లలను చూసి అ పసిహృదయం హర్షప్రపుల్లితమైంది మామిడి పండ్లు తినడమంటే అదృష్టమే! తన లాంటి దౌర్భాగ్యుడి కట్టి అదృష్టం పట్టడం కూడానా? భారంగా నిట్టూర్చాడు. ఇంతలో ఇంట్లోనుండి మరో చిన్నమ్మాయిచేతిలో మరో 'తాజా' మామిడి పండుతో తయారయింది. ఉషారుగా మామిడిపండు తినబోతున్న సమయంలో ఆ అమ్మాయి దృష్టి రామునిమీద పడింది. ఆ లేత హృదయం కరుణాలవాలమయింది. ఆశ్చర్యంతో రాముని చూసి "నీ పేరేమిటి?"—అడిగింది.

"రాము"—అన్నాడు లేని వుత్సాహం తెచ్చుకుని

"మీ యిల్లెక్కడ?"

"రైలుకట్ట ప్రక్కగుడిసెలో వుంటున్నాము నేనూ, మా అమ్మా"—అన్నాడు.

"మరి మీ నాన్నో?"-అమాయకంగా అడిగింది.

నాన్నమాట తల్చుకోగానే ఏడుపొచ్చింది రామూకి. అయినా అందరు పిల్లల ముందర ఏడిస్తే బాగుండదని దుఃఖాన్ని తనలోనే దిగమ్రింగుకుని "నాన్న లేడు. చచ్చిపోయాడు—" అన్నాడు గద్గదకంఠంతో, ఈ సంభాషణ మిగతా వారిని కూడా ఆకర్షించింది, అందిరూ కుతూహలంతో రామువంక చూడసాగారు.

"గుడిసెలో వుంటున్నారా మీరు? అయితే మీరు బీద వాళ్ళా?"—అడిగింది అమాయకంగా ఆ చిన్నమ్మాయి.

"అవును"అన్నాడు నీరసంగా. ఆ పసివాళ్ళ అమాయకంగా సానుభూతితో పరామర్శిస్తుంటే లోలోపల అణగియున్న దుఃఖం కడుపులో దాచుకోలేక పోయాడు. కండ్లు రెండూ రెండు జలపాతాలే అయాయి. తన దేలతనానికి మళ్ళీ అంతలోనే సిగ్గు

పడి పోయాడు. కన్నీటిని తన చొక్కాతో తుడిచేసుకున్నాడు. అందరూ జాలిగా చూశారు అతడివంక. ఆ చిన్నమ్మాయి మనసు వెన్నపూసే అయిపోయింది,

"మామిడిపండు తింటావా?"—అమాయకంగా అడిగింది. ఆ ప్రశ్న వినేసరికి ఒక్కసారి అతని హృదయాన్నావరించుకున్న మేఘాలు పటాపంచలయి పోయాయి. ఆనంద తన్మయతలో తనను తానే మరచి "ఊ!" అనేశాడు. "ఇందః తీసుకో!"అని ఆ అమ్మాయి రాముకిచ్చేసింది తన చేతిలోని మామిడిపండును.

"ఎంగిలి అయిపోయాయి కాని లేకపోతే మేమూ ఇచ్చే వాళ్ళము. రేపురా! ఇంకా బోలెడు ఇస్తాము"— అన్నారు మిగతా వాళ్ళు తాము కూడ ఇవ్వలేక పోయామే అన్న బాధ మనసును పీకుతుంటే. రాము ఆ మామిడిపండును ఆప్యాయంగా గుండెకు హత్తుకున్నాడు. ఇంతలో ఇంట్లోనుండి తల్లికేక విని పిల్లలంతా వులిక్కిపడ్డారు. ఆ చిన్నమ్మాయి కంగారుగా "రామూ! ఇక్కడినుండి వేగం వెళ్ళిపో. మా అమ్మ మంచిది కాదు" అని హెచ్చరించింది భయం భయంగా. కృతజ్ఞత నిండిన హృదయంతో ఆ మామిడి పండును తన జోలిలో పడేసుకుని క్షణంలో ఇంటివంక పరుగు తీశాడు.

ఒక్క క్షణంలో తల్లిముందు వ్రాలాడు. అంతవరకు శోక సముద్రంలో ఈదులాడుతున్న ఆ రామూ "ప్రతిబింబము" "వచ్చావా నాయనా?" అంటూ పలకరించింది ఆప్యాయతతో, "అమ్మా!" అంటూ ఆమె ఒడిలో వాలిపోయాడు. అంత వరకూ అతను పడిన బాధలూ, అవమానాలు ఆమె గాఢ పరిష్వంగంలో, మాతృ వాత్సల్యంలో మర్చిపోయాడు. తల్లిముఖంలోకి చూస్తూ "ఏడుస్తున్నావా అమ్మా?"—అని అడిగాడు. ఒక్కసారి తృళ్ళిపడి చీరకొంగుతో కన్నీటిని తుడుచుకుని "లేదురా బాబూ! కంట్లో నలుసు పడిందిరా"—అంది. ఆ లేత మనసు అంతటితో సంతృప్తి పడింది. ఇంతలో మనసు మామిడిపండు మీదకు పరుగులు తీసింది. గబగబా తన జోలెలోని మామిడిపండు బయటకు తీసి "అమ్మా! మామిడిపండే. ఆ వీధిలో పిల్లలిచ్చారు నాకు. వాళ్ళెంత మంచి వాళ్ళనుకున్నావు! ఇంకా రేపుకూడ ఇస్తారుట! రమ్మన్నారు నన్నుమళ్ళీ. అందులోకీ ఒక రెండు జడల అమ్మాయుంది చాలా మంచిదమ్మా!"—అంటూ వుత్సాహంతో అక్కడి తతంగమంతా చెప్పుక పోతున్నాడు.

ఆమె ఈ మాటలేవీ వినిపించుకునే స్థితిలోనే లేదు. ఆ మామిడిపండు చూడగానే గతంలో జరిగిన ఘోరం ఆమె కళ్ళ ముందు తిరిగి ప్రత్యక్షమయింది. "రక్తపు మడుగులో తేలియాడుతున్న భర్తశవం, చుట్టూరా జనం! ఆ మామిడిపండే తన భర్తను పొట్టన పెట్టుకుంది. మామిడి పండ్లంటే అతనికింత ఇష్టం! అయినా తామిద్దరూ గడించి తెచ్చుకున్న రూపాయ డబ్బుల్లో రెండుపూట్ల అన్నమే తింటారా? మామిడిపండ్లు కూడా కొంటారా? ఎంత ఇష్టమైన పళ్ళయితే మట్టుకు అంత ఘోరం తలపెడతాడు తన భర్తని ఆమె అనుకుందా? అయినా ఎన్నడూ లేని దొంగబుద్ధి అతని కానాడే ఎందుకు కలగాలి? "వెధవ! దొంగతనానికి ప్రతిఫలం అనుభవించాడు", ఇట్లాంటి దొంగ వెధవలు ఎంతమంది చస్తే అంత బాగుపడుతుంది లోకం!" అన్న విమర్శల మధ్య లారీ ఖారానికి చితికిపోయిన మామిడిపళ్ళ మధ్య. నెత్తురు మడుగులో తేలియాడుతున్న భర్త మృత కళేబరం ఆమె కన్నుల ముందు ప్రత్యక్షమయింది, ఒక్కసారి కెవ్వన కేకేసి కళ్ళు గట్టిగా మూసుకుంది. కోపంతో "వెధవా! ముందా ముదనష్టపు పండవతల పారెయ్యి!"—అని గట్టిగా అరిచింది. తల్లిలోని ఈ హఠాత్పరిణామము చూసి వెర్రిచూపులతో తల్లిని చూడసాగాడు. ఆమెలో రేగుతున్న సంక్షోభం, జరుగుతున్న సంఘర్షణ ఆతనికి తెలియవు. ఆమెలోని ఆవేదన, బాధ అర్థం చేసుకునే స్థోమత ఆ పసివాడికి లేదు. అట్లాగే తల్లివంక బిత్తర పోయి చూడసాగాడు. ఇంకా చేతిలో మామిడిపండుతో సహా అక్కడే నిలుచున్న కొడుకును చూడగానే ఆమెలో సహనం నశించింది. కోపంతో గట్టిగా రామూ రెండు చెవులూ నులిమి "దొంగవెధవా! అవతల పారేయి నీకు అమ్మ కావాలా? మామిడి పండు కావాలా?"—అంటూ గట్టిగా తిట్టి అక్కడే కూలబడి. వెక్కి వెక్కి ఏడ్వసాగింది,

అంతే! ఆ పసివాడు గిర్రున వెనుకకు తిరిగి ఒక్క అంగలో వీధిలోకి పోయి ఆ మామిడిపండును కసిక్కీరా ఎదురాగా వున్న మురుగ కాల్వలోకి గిరవాటేశాడు, పెద్దబరువు హృదయంలో నుండి దిగిపోయినట్లయింది. గబగబా పోయి తల్లి ఎదురుగా నిల్చున్నాడు,

ఆ తల్లిమనసు గర్వంతో వుప్పొంగి పోయింది. ఎర్రబడిన కొడుకు రెండు చెవులూ చూసి ఆ మాతృ హృదయం విలవిల్లాడి పోయింది. కట్టలు తెంచుకుని పొర్లివచ్చే ప్రేమసుధా స్రవంతిలో వుక్కిరి బిక్కిరి అవుతూ "నాయనా!"అని చేతులు జాపి దగ్గరకు తీసుకుంది

"అమ్మా!"అంటూ ఆనందంతో ఆ మాతృమూర్తి ఒడిలో వ్రాలిపోయాడు!

వాత్సల్యసుధా ప్రపూరితమైన ఆమె గాఢపరిష్వంగ సుఖంలో తన్మయత్వం చెందింది ఆ పసి హృదయం!

క్షణకాలం ఆ తల్లీ కొడుకులు తమ బాధల కతీతులై పోయారు!

ప్రగతి పథంలో

(జిల్లాల నుంచి అందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గూర్చిన సంక్షిప్త వార్తలు)

ఆదిలాబాదు

జపాను పద్ధతి వరిసాగు

1960-61లో యీ జిల్లాలో 11,532 యెకరాల భూమిలో జపాను పద్ధతిలో వరి పండించబడినది. నిర్మల్ తాలూకా గ్రామాలలో 3,940 యెకరాలకు గట్లు పోయబడినవి. 15 స్ప్రేయర్లు 32 కలుపుతీత సాధనాలు సబ్సిడీపై సరఫరా చేయబడినవి. 5 విత్తనాల కొట్లు నిర్మించబడినవి. ఇప్పుడు మరి పది నిర్మాణంలో నున్నవి,

అనంతపురం

ఎక్కువ పాఠశాలలు

జిల్లా పరిషత్తు యీ సంవత్సరం యిక్కడ 22 మాధ్యమిక పాఠశాలలను తెరువగలదు. గ్రామీణులు రూ. 5,000 డిపాజిట్టు చేసినప్పుడల్లా యెక్కువ పాఠశాలలు తెరువబడు చుండును.

చిత్తూరు

పాఠశాలలకై సొమ్ము సేకరణ

చిన్న గొట్టిగల్లు బ్లాకు పంచాయతీ సమితి అధ్వర్యాన, సమితి అధ్యక్షడు శ్రీ జి. వి. చంద్రశేఖరరెడ్డిచే 1961 జూన్‌లో బద్దలవారిపల్లి నుంచి పాదయాత్ర (రెండవ ఘట్టం) ప్రారంభించబడినది.

714 గ్రామాలలోను 176 గ్రామాలు తొలిఘట్టంలోను. 115 గ్రామాలు మలిఘట్టంలోను సంచరించ బడినవి.

ఈ యాత్రలో, శ్రీ రెడ్డి, బ్లాకు సిబ్బంది తోడ్పాటుతో భకరపేట, చిన్న గొట్టిగల్లులలో రెండు వున్నత పాఠశాలల నిమిత్తం రూ. 14,000లను, ప్రాథమిక పాఠశాలా భవనాల నిమిత్తం భూమిని రూ. 3,000 కిమ్మతుగల ఇతర సామగ్రిని సేకరించారు.

హార్స్‌లే కొండలపై వసతి గృహం

హార్స్‌లే కొండలపై తక్కువ రాబడివర్గం యాత్రికుల నిమిత్తం నిర్మించిన వసతి గృహాన్ని మే 26న పబ్లిక్‌వర్క్స్ శాఖామంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు ప్రారంభించారు. ఈ వసతి గృహం నిర్మాణం ఖర్చు రూ. 1,77,000లు.

పిల్లలకు సెలవుల సదనం

కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘం పోషణక్రింద చిత్తూరు శ్రీ మహాత్మాగాంధీ బాల సంఘంచే నడుపబడే సెలవుల సదనం తిరుమలలో మే 20న రాష్ట్ర చిన్న పరిశ్రమల మంత్రి శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీచే ప్రారంభించబడినది.

తూర్పు గోదావరి

కొత్త టెలిఫోన్ సబ్-డివిజన్

రాజమండ్రీ కొత్త టెలిఫోన్ సబ్-డివిజన్ 1961 మే లో ప్రారంభించబడినది.

సామర్లకోటలో కుంభకార పరిశ్రమపై గోష్ఠి

ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామ పరిశ్రమల బోర్డు అధ్వర్యాన, సామర్లకోటలో మే 25, 26 తేదీలలో అంతర్‌రాష్ట్రీయ గ్రామ కుంభకార పరిశ్రమపై గోష్ఠి యేర్పాటు అయినది. ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాలలోని వివిధ కుంభకార పరిశ్రమదారుల సహకార సంఘాల ప్రతినిధులు యీ గోష్ఠికి హాజరయారు,

గుంటూరు

పాఠశాలా భవనం ప్రారంభం

తెనాలి తాలూకా గుదిబండవారి పాలెంలో కొత్తగా నిర్మించబడిన పరిషత్ ప్రాథమిక పాఠశాలా భవనం మే 14 న జిల్లా పరిషత్ అధ్యక్షునిచే ప్రారంభించబడినది. ఈ భవనానికైన ఖర్చులో సగం రూ. 5,750 లను శ్రీ గుద్దిబండ నాగిరెడ్డి విరాళమిచ్చారు. మిగిలిన సగాన్ని పరిషత్ పెట్టుకొన్నది.

నిర్బంధ విద్య

సమితి ప్రాంతంలో నిర్బంధ విద్యా పథకం అమలులో వుపాధ్యాయుల నెదుర్కొనే చిక్కులను గురించి చర్చించుటకై ఈమని సమితి ప్రాథమిక పాఠశాలోపాధ్యాయులు మే 19న సమావేశమయారు. ఈమని సమితి అధ్యక్షుడు శ్రీ పుతుంబాక శ్రీరాములు అధ్యక్షత వహించారు.

కొత్త పంచాయతీ భవనం

తెనాలికి నూరుమైళ్ళ దూరంలో గల గుడివాడ గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవనం మే 20న రాష్ట్ర ఆర్థిక మంత్రిచే ప్రారంభింప బడినది.

ప్రాథమిక పాఠశాల

తెనాలి తాలూకా వెల్లాబాదులో ప్రత్యేక జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల మే 19న శా. స. స, శ్రీ ఎ. వెంకటరామయ్యచే తెరువబడినది.

పంచాయతీలకు వ్యవసాయ పరికరాలు

సమితి ప్రాంతంలోని 12 పంచాయతీలకు వ్యవసాయ పరికరాల సరఫరాకై ఈమని పంచాయతీ సమితి దాదాపు రూ. 1,000లను మంజూరు చేసినది.

హైదరాబాదు

లోక సహాయక సేనా శిబిరం

రాష్ట్ర వ్యవసాయ మంత్రి మే 15న హైదరాబాదులో లోక సహాయక సేనా శిబిరాన్ని ప్రారంభించారు.

రాజేంద్రనగరంలో ఎన్.సి.సి. వార్షిక శిబిరం

తెలంగాణా ప్రాంతపు ఎన్.సి.సి. రైఫిల్ కేడెట్ల వార్షిక శిక్షణా శిబిరం మే 20 నుంచి జూన్ 4 వరకు రాజేంద్రనగరంలో జరిగినది.

ఖమ్మం

ఏజన్సీ ప్రాంతాలకు గ్రామ పంచాయతీలు

ఏజన్సీ ప్రాంతాలలో గ్రామ పంచాయతీల యేర్పాటు విషయంలో సర్వే జరిపి, ప్రాథమిక చర్యలు తీసుకొనే నిమిత్తం ప్రభుత్వం భద్రాచలం సబ్-డివిజన్‌లో నలుగురు డివిజనల్ పంచాయతీ ఆఫీసర్లను నియమించినది.

కృష్ణా

విజయవాడలో పోలియో టీకాల మందు సరఫరా

విజయవాడలో రష్యన్ పోలియో టీకాల మందు యిచ్చే 5 రోజుల కార్యక్రమం మే 12న ముగిసినది. ఈ టీకాలమందు 19,268 మంది పిల్లలకు యివ్వబడినవి.

కర్నూలు

కర్నూలు-కడప కాలువ తూముకు శంకుస్థాపన

కర్నూలు-కడప కాలువ 108/1 మైలు వద్ద పెద్ద నిర్గమన ద్వారం గల తూముకు మే 23న శా. మం. స. శ్రీ ఎన్. వెంకట సుబ్బయ్య శంకుస్థాపన చేశారు. ఇది దాదాపు 13,000 యెకరాల చెఱకు పొలాలకు నమ్మకంగా నీటి సరఫరా చేయవలెనని తలపెట్టబడినది.

మహబూబునగరం

తెలుగులో వ్యవహారాలు

మహబూబునగరం జిల్లా పరిషత్తు మే 25న సమావేశమై నప్పుడు తన వ్యవహారాలను తెలుగులో జరపాలని నిర్ణయించినది.

విద్యుచ్ఛక్తి సరఫరా

రాష్ట్ర ఆర్థికమంత్రి మే నెలలో వెల్దండ గ్రామానికి విద్యుచ్ఛక్తి సరఫరా ప్రారంభించారు.

మెదక్

కొత్త పూర్వ విస్తరణ కేంద్రం

1961 మే నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి దౌలతాబాదులో పూర్వవిస్తరణ కేంద్రాన్ని ప్రారంభించారు.

ముఖ్యమంత్రిచే పూర్వ విస్తరణ కేంద్రం ప్రారంభం

1961 మే నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దిపేటలో పూర్వ విస్తరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన భూములులేని వారికి పట్టాలు కూడా యిచ్చారు.

గాంధీపుర్

1961 మేలో సిద్దిపేట తాలూకా పొన్నాల్ గ్రామంలో "గాంధీపుర్"కి రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

నల్గొండ

స్వయం సహాయ దినోత్సవం

1961 మే నెలలో నల్గొండ పంచాయతీ సమితిలోని తిప్పర్తి గ్రామంలో మహోత్సాహంతో "స్వయం సహాయ దినోత్సవం" జరుపబడినది. గ్రామస్థులంతా గ్రామాభివృద్ధికై నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు.

జిల్లా పరిషత్ కార్యాలయం

రాష్ట్ర ముఖ్యమంత్రి యిటీవల నల్గొండలో జిల్లా పరిషత్ కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేస్తూ, పరిషత్తులు గ్రామ ప్రాంతాలలో మంచి నీటి పథకాలకు ముందు ప్రాధాన్యత యివ్వాలని అన్నారు.

కరువు రక్షణకు నాలుగు లక్షలు

నల్గొండ జిల్లాలో కరువు రక్షణ పనులకై రాష్ట్రప్రభుత్వం నాలుగు లక్షల రూపాయలను మంజూరు చేసినది.

నెల్లూరు

కొత్తసమితి

1961 మేలో బాలిరెడ్డి పాలెం పంచాయతీ సమితి ప్రారంభింపబడినది.

కొండపి సమితికి కొత్త భవనం

1961 మేలో కొండపి పంచాయతీ సమితి కార్యాలయ భవనాలకు కేంద్ర పనులు, గృహవసతి, సరఫరా శాఖామంత్రి శ్రీ బి. గోపాలరెడ్డి శంకుస్థాపన చేశారు. జిల్లాలో కెల్లా వుత్తమమైనదని నిర్ణయింపబడిన జరుగుమల్లి పంచాయతీకి మంత్రిగారు రూ. 250 రొఖ్ఖం బహుమానాన్ని యిచ్చారు. ఈ బహుమతి జిల్లా పరిషత్తు తరపున యివ్వబడినది.

విద్యుచ్ఛక్తి సరఫరా

1961 మేలో, కేంద్రపనులు, గృహవసతి, సరఫరా శాఖా మంత్రి బాలిరెడ్డి పాలెమునకు విదుచ్ఛక్తి సరఫరాను ప్రారంభించారు.

ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై గోష్ఠి

కేంద్ర పనులు, గృహవసతి, సరఫరా శాఖామంత్రి శ్రీ బి. గోపాలరెడ్డి మే 22న నెల్లూరులో పంచాయతీ పరిపాలనపై తొలి జిల్లా స్థాయి సమ్మేళనాన్ని ప్రారంభించారు. రెండు రోజులు జరిగిన యీ సమ్మేళనం జిల్లాపరిషత్తుచే యేర్పాటు చేయబడినది. పంచాయతీ సమితుల అధ్యక్షులు, జిల్లా పరిషత్తు సభ్యులు, శాసన సభ్యులు, ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య వంటి ప్రముఖులు, సంఘ సేవకులు యీ గోష్ఠిలో పాల్గొన్నారు. పంచాయతీ పరిపాలనను విజయవంతంగా అమలు జరిపే పద్ధతులు చర్చించబడినవి. ప్రతినిధులు వివిధ విషయాల చర్చకై వర్గాలుగా విభజిత మయారు.

నిజామాబాదు

గ్రామ సహాయకుల శిక్షణా శిబిరం

బన్స్వాడ సమితి మాతల్చేరు గ్రామంలో మే 15 నుంచి 17 వరకు గ్రామ సహాయకుల శిక్షణా శిబిర మొకటి నడుపబడినది. 50 మంది గ్రామ సహాయకులకు శిక్షణ యివ్వబడినది.

శ్రీకాకుళం

రామభద్రపురం గోష్ఠి

రామభద్రపురం పంచాయతీ సమితి బ్లాకు ప్రాథమిక పాఠశాలోపాధ్యాయులు నిర్బంధ వుచిత ప్రాథమిక విద్యపై మే 7న. రామభద్రపురంలో గోష్ఠి జరిపారు. శా. స. స. శ్రీ బి రాజయ్య యీ గోష్ఠిని ప్రారంభించారు.

రెడ్‌క్రాస్ శిక్షణా శిబిరం

1961 మేలో శ్రీకాకుళం మునిసిపల్ హైస్కూలులో జూనియర్ రెడ్‌క్రాస్ కౌన్సిలర్ల శిబిరం నడుపబడినది. రెడ్‌క్రాస్ రాష్ట్రశాఖ కార్యదర్శి శ్రీ ఎస్. నారాయణస్వామి శిక్షితులకు, శిబిరం ఆఖరు రోజున సర్టిఫికెట్లను యిచ్చారు.

ముఖ్యసేవికల గోష్ఠి

జిల్లా పరిషత్తు అధ్యక్షుడు మే 29న జిల్లా ముఖ్య సేవికల గోష్ఠిని ప్రారంభించారు.

కొత్తపట్నానికి పూర్వ విస్తరణ కేంద్రం

వ్యవసాయమంత్రి శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి మే 22న కొత్తపట్నం పూర్వ విస్తరణ కేంద్రాన్ని ప్రారంభించారు.

విశాఖపట్నం

వేసవి విడిది

భారత్ సేవక్ సమాజ్ అధ్వర్యాన బాలుర వేసవి ఎక్స్‌కర్షన్ క్యాంపు 1961 మేలో వాల్తేరులో ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు శ్రీ కె. వి. గోపాలస్వామిచే ప్రారంభించబడినది. గుంటూరు, కృష్ణా తదితర జిల్లాలనుంచి తీసుకొనబడిన వారు దాదాపు 50 మంది ఆంధ్ర విశ్వవిద్యాలయపు కిర్లంపూడి వసతి గృహంలో మకాం చేశారు. ఈ శిబిరం ముఖ్యంగా మంచి నడ

వడికకు దోహదం చేయుటకు. సామాజిక జీవనాన్ని ప్రోత్సహించుటకు వుద్దేశించబడినది.

ఎన్.సి.సి. వార్షిక శిబిరం

ఆంధ్రప్రదేశ్ నేషనల్ కేడెట్‌కోర్ కేడెట్. సాంఘిక సేవల మిశ్రమ శిబిరం. మే 15 నుంచి 28 వరకు వాల్తేరుకు సమీపంలోగల పెందుర్తి సమాజాభివృద్ధి కేంద్రంలో జరిగినది. రాష్ట్రం అన్ని ప్రాంతాలనుంచి తీసుకొనబడిన దాదాపు 2,000 మంది కేడెట్లు యీ శిబిరంలో పాల్గొన్నారు. కేడెట్లకు కాయ కష్టం విలువను బోధించుటకిది వుద్దేశించ బడినది. కేడెట్లు, గ్రామస్థుల సహాయంతో, అభివృద్ధి కేంద్రం ప్రాంతంలో ఒక "లింక్" రోడ్డును నిర్మించారు.

పంచాయతీ పరిపాలనా పరిశీలన

పంచాయతీ పరిపాలనా విషయాలను పరిశీలించుటకై పశ్చిమ బెంగాలునుంచి వచ్చిన జట్టు—ఇందులో వుపమంత్రులు శ్రీ ఎస్. బెనర్జీ, శ్రీ ఎస్. మిత్రాగార్లు కూడా వున్నారు—1961 మే 12న జిల్లా పరిషత్తు సభ్యులను కలుసుకొని, పంచాయతీ సమితుల ద్వారా గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యకలాపాల అమలుకి సంబంధించిన వివిధ సమస్యలను గురించి చర్చించినది. ఈ జట్టు వారు పెందుర్తి పంచాయతీ సమితిని కూడా దర్శించారు.

విద్యాగోష్ఠి

1961 మేలో ఎలమంచిలిలో ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య అమలుపై ఒక గోష్ఠి యేర్పాటు చేయబడినది. ఈ సందర్భంలో ధర్మవరం, రామరాయుడు పాలెం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పథకాలు బహూకరింప బడినవి. అభివృద్ధి కేంద్రంలోని అందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు యీ గోష్ఠిలో పాల్గొన్నారు,

విద్యుచ్ఛక్తి సరఫరా

ఎలమంచిలి తాలూకా సీతారుపేటకు మే27న జిల్లా పరిషత్తు అధ్యక్షునిచే విద్యుచ్ఛక్తి సరఫరా ప్రారంభింప బడినది.

వరంగల్లు

సంగీత, నాటక కార్యక్రమాలు

జిల్లాలో జిల్లా సమాచార సంస్థచే 1961 మే వరకు సమాజాభివృద్ధికి సంబంధించిన, 34 సంగీత, నాటక కార్యక్రమాలు యేర్పాటు చేయబడినవి.

సమాచార కేంద్రం

జిల్లా సమాచార కేంద్రం ఆరంభమాది గడచిన పదకొండు నెలలలోను దానిని దాదాపు 28,600 మంది దర్శించారు.

పారిశ్రామిక సహకార సంస్థల సమావేశం

జిల్లాలోని గ్రామ పారిశ్రామిక సహకార సంఘాల సమావేశం 1961 మే లో వరంగల్లులో జరిగినది. రెండు రోజులు జరిగిన యీ సమావేశానికి అన్ని సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులతో సహా 60 మంది ప్రతినిధులు హాజరయారు.

శిక్షణా శిబిరం

మహబూబాబాదుకు దాదాపు 32 కిలోమీటర్ల దూరంలో గల మరిపెడ గ్రామంలో అబ్బాయపాలెం పంచాయతీ సమితి ఆధ్వర్యాన మూడు రోజులు జరిగిన మహిళా మండల సభ్యుల శిక్షణా శిబిరం మే 20న ముగిసినది. ఉత్తమ ప్రదర్శన వస్తువులను తయారు చేసిన స్త్రీలకు బహుమతు లివ్వబడినవి.

గ్రామాలకు గ్రామీణ ఔషధ శాలలు

మే నెలలో సమావేశమైన వరంగల్లు జిల్లా పరిషత్ 4వ నెంబరు స్థాయి సంఘం, సహాయక గ్రాంటుల పథకాల క్రింద షెడ్యూల్డు కులాల అభివృద్ధికై 1961-62 కి రూ. 47,000లు కేటాయించినది,

ఈ కమిటీ, గ్రామీణ ఔషధశాలల స్థాపనకై దిగువ గ్రామాలను నిర్ణయించినది: ఆత్మకూరు, ధర్మసాగరం, మద్దెమ్మెట్ల, ఇరుగుర్తి, బచ్చన్నపేట, నెక్కొండ, విల్లంచెర్ల, కాటపురం.

జనగాంలో పిల్లల సదనం

జనగాంలో త్వరలో షెడ్యూల్డు కులాల పిల్లల నిమిత్తం ఒక సదనం తెరువబడుతుంది. ఇక్కడ బడికి వెళ్ళే షెడ్యూల్డు కులాల బాలికలు 30 మందికి వసతి వుంటుంది. వారికి వుచితంగా అన్న వస్త్రాలు యివ్వబడతవి.

పశ్చిమ గోదావరి

పాఠశాలా భవనం ప్రారంభం

ముద్దాపురంలో కొత్తగా కట్టిన పాఠశాలా భవనాన్ని మే 8న జిల్లా పరిషత్తు అధ్యక్షుడు ప్రారంభించారు. ఈ భవనం నిర్మాణానికి అయిన ఖర్చు రూ. 12,500 లలోను పెంటపాడు పంచాయతీ సమితి రూ. 6,250లు యిచ్చినది. ముద్దాపురంలో అదే రోజున ఒక మధ్యాహ్న భోజన కేంద్రం కూడ తెరువబడినది.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం

కాశిపాడులో కొత్తగా కట్టిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని మే 13న శా. స. స. శ్రీ మూర్తిరాజు ప్రారంభించారు.

తణుకులో టీకాల మందు సరఫరా

మే 11న తణుకులో 50 పోలియో నిరోధ టీకాల మందు బిళ్లలు పంపిణీ చేయబడినవి.

పరిశీలనా జట్టు

సదాశివపేట పంచాయతీ సమితినుంచి వచ్చిన పరిశీలనా జట్టు ఒకటి మే 16న ఇల్లపకుర్రులో చెఱకు తోటలను దర్శించి మేడపాడు గ్రామస్థులను కలుసుకొన్నది. నరసాపురం పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీరామ జోగయ్య యీ జట్టుకు స్వాగతం చెప్పారు.

ఏలూరు, తణుకులలో పారిశ్రామిక కేంద్రాలు

ఏలూరు, తణుకులలో పారిశ్రామిక కేంద్రాల స్థాపనకై చురుకుగా యేర్పాట్లు జరుగుతున్నవి. ఈ కేంద్రాలలో ఒక్కొక్కదానికి రెండు లక్షల రూపాయలకు పైగా ఖర్చు కాగలదు. ఐతే యివి చిన్నరకం పరిశ్రమల అభివృద్ధికి పెద్దయెత్తున తోడ్పడగలవని భావించబడుతున్నది.

విశేషాలు

(42వ పేజీ తరువాయి)

శిక్షితులు మొదట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలనుండి తీసుకొనబడతారు. అటుపిమ్మట శిక్షణా సౌకర్యాలు చిన్న పరిశ్రమల సంఘాలకు, ప్రైవేటు కన్సల్టింగ్ ఫర్మ్‌లకు విస్తరింపచేయబడతాయి.

అఖిలభారత మామిడిపళ్ళ పోటీ

భారతీయ వ్యవసాయ పరిశోధనా సంఘంచే గత నెల ఇండోర్‌లో యేర్పాటు చేయబడిన అఖిల భారత మామిడి పళ్ళ పోటీలో ఆరు వెండి ట్రోఫీలలోను అయిదు గెల్చుకొని ఆంధ్రప్రదేశ్ విడి బహుమతుల విషయంలో ద్వితీయ స్థానాన్ని ఆక్రమించినది. ఈ రుష్పాడు వాస్తవ్యుడు శ్రీ శ్యామసుందరరెడ్డి నాలుగు బహుమతులు గెల్చుకొనగా సంగారెడ్డిలోగల ప్రభుత్వ పరిశోధనా కేంద్రానికి ఒకటి వచ్చినది. అందరికంటే యెక్కువ రకాలు ప్రదర్శించినందుకు కూడా శ్రీ రెడ్డికి ఒక బహుమతి యివ్వబడినది.

ప్రథమ బహుమతి మధ్యప్రదేశ్‌కి దక్కినది.

పొదుపు

ఇందుపల్లి సత్యవర్ధనరావు

పొదుపు చెయ్యర బాబు పొదుపో
చిన్న మొత్తాలనే పొదుపు చెయ్యి
చినిచిని మొత్తాలు చేర్చితే పెద్దవై
ఘనమైన కార్యాలు కావించు కొస్తాయి ॥పొదుపు॥

2

నేడు నాటిన మొక్క రేపు చెట్టవుతుంది
నేటి పైసలు రేపు రూపాయలవుతాయి
నేడు దాచిన డబ్బే రేపక్కరకు వచ్చు
లేకుంటె మన బ్రతుకు చీకటుల పాలేను ॥పొదుపు॥

3

బీడీలు తగలేసి పాడు చేశావెంత
కాఫి హోటల్లోన కర్చెంత పెట్టావు
సినిమాకు తరచుగా చెల్లించినావెంత
లెక్కగట్టుక చూడు తక్కువేమీకాదు ॥పొదుపు॥

4

పెళ్లికై యెదిగేటి పిల్లకాయను చూడు
పెద్ద చదువుకు కొడుకు పెరిగి వస్తున్నాడు
ముద్దు బిడ్డల బ్రతుకు దిద్దువాడవు నీవె
ఆనక దేవుణ్ణి అని లాభమేముంది ॥పొదుపు॥

5

సిగరెట్లకై నీవు చెల్లించు డబ్బు
ఇంటిల్ల పాదికీ యేడాది బట్టలు
కాఫి హోటల్లోన కర్చుపెట్టే డబ్బు
పిల్లాడి బడిఫీజు చెల్లించి వేస్తాది
కర్చన్న దానికొక కట్టడీ లేకుంటె
జీవితము నట్టేటి చిల్లిపడవేనోయ్ ॥పొదుపు॥

6

సిరులు నిలకడకాదు చెదిరి పోతుంటాయి
బలము శాశ్వతమంచు భ్రమసి పడ్డావేమొ
ఆపదలో బంధుగులు అడ్డుగాన రారయ్య
నీవు దాచిన డబ్బె నిన్ను గట్టెక్కించు ॥పొదుపు॥

7

దేశమ్ము రక్షించు ధీరత్వమును జూప
మర తుపాకుల యుద్ధమాడవలెననలేదు
సత్యాగ్రహంబూని జైలు కొట్టాలలో
తిండి తిప్పలులేక యెండి పొమ్మన లేదు
పొదుపు చేయుటె దేశభక్తిగా తలచవోయ్
పొదుపుతో త్యాగమ్ము మొదలు పెట్టాలోయ్ ॥పొదుపు॥

గ్రంథసమీక్ష

సర్వోదయగానము

రచయిత : శ్రీ తుమ్మల సీతారామమూర్తి
ప్రతులకు : లక్ష్మీప్రసాద్ అండ్ కో., బాపట్ల
86 పుటలు వెల 1-25 నయాపైసలు

సుప్రసిద్ధులైన సీతారామమూర్తిగారి కవిత్వములో పదలాలిత్యం, ధారా శుద్ధి, భావ స్వచ్ఛత యెప్పుడూ వుండేవే. వీటికి తోడు వారెన్నుకునే కావ్య వస్తువులు గూడ అత్యున్నత స్థాయిలో శాశ్వతమైన విలువ గలవి. ఈ గ్రంథంలో శ్రీ వినోబాభావే ఉద్యమంని ఆదర్శాలు, విజయ సాధనను గూర్చి సోదాహరణంముగా గానం చేయుబడింది.

"ప్రాదుర్భ వింపవలె
సర్వోదయ రాజ్యమ్ము; పండి
యున్నది మహి, నే
డా దేష్ట వచ్చె, శౌచవి
భాదీప్తము కార్యకర్తృ వర్గ మెవలయున్"

అన్న కవిగారి విశ్వా సంయథార్థం గ్రహించి యేర్పడిందే, ఉన్న కార్యకర్తల బృందానికి యిలోధిక బలం చేకూర్చటంలో యీ కావ్యం సహాయపడగలదు.

ఇలాంటి కావ్యాలు కావాలని భావే గారు గూడా అన్నట్లున్నది.

"అన్నలార మహీ దాన యజ్ఞ విజయ
మాస చేయుద బది కృత్యమని కవీంద్రు
డొకడు భాషించె నాతన్మహోక్తి జనుల
మెప్పుగని తీరు నవయు గమప్పుడొదవు"

అని యిందలి "భావే చక్కట్ల" లో "కవులు" అనే శీర్షిక క్రింది తుది గీతం. ఈ శీర్షిక దునెనిమిది పద్యాలు "కవితా వ్యాసంగమునకు దిగిన వారందరుసూ మంత్ర ములుగా జపింపవలసినవి" అని శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు తమ పీఠికలో అన్నారు. వర్తకం, సాంఘిక సేవ మొదలైన యితర వ్యాసంగాలలో ఉన్న వారికి కూడా అదే మాదిరి ప్రాముఖ్యత గలపద్య రత్నాలు చాలా వున్నవి యిందులో. చిరకాలం నిలువగల యీ కావ్యాన్ని యింతకంటే యింకా అందంగా ముద్రించినట్లయితే బాగుండేది.

'కిన్నర'

నవోదయము

కవి : అన్నాప్రగడ శ్రీరామమూర్తి
మూల్యం : రూపాయిన్నర
ముద్రణ : జనరల్ ప్రింటర్స్, గుంటూరు.
ప్రాప్తిస్థానము : 1-8-486 చిక్కడపల్లి, హైదరాబాద్-20

ప్రాతర్మందానిలము వచ్చి నిద్ర లేపినది. "అకల్లాదనియర్థరాత్రమున నీకై పేచియున్నప్పుడేమో కన్పట్ట"దు. అవసరమైనప్పుడు మాత్రం వచ్చి కమ్మని నిద్ర చెడగొడుతుంది. అయినా సంధ్యావందనం కూడా రానివాడు తెల్లవారు ఝామున లేచి ఏం చేస్తాడు ! ?

ఊహకు పాత కొత్తలు లేవు. ఉషోదయ కాలంలో మందానిలం వీస్తుందని ఎందరు చెప్పలేదు ? అయినా అపసరమైనపుడు రాకుండా యిప్పుడు వచ్చినావని దెప్పుటలో కొత్తగా చెప్పినట్లయింది. పైగా, నవనాగరికులపై వ్యంగ్యోక్తిగా ఒక విసురు తెల్లవారినా నిద్ర లేవరని లోక వ్యవహార స్ఫూర్తిగా రూపమెత్తి నందున యీ ఊహ మరీ రమణీయమైంది. అలాగే మందానిలము వీచమికి, అది కామమత్తులైన విరహుల ఉపాలంభనలతో విసిగి వేసారి, విరక్తితో ఎక్కడికో వెళ్ళియుండవచ్చునని కారణమూహించుట. భావనకు పునాది ప్రాబంధికమైనా, నిర్మించిన భవనం అందంగా వుంది ఇలాంటి సర్వసాధారణమైన విషయాలను రమణీయమైన ఊహలుగా మలచుకునే నేర్పు కొల్లగా కలిగిన కవికా సంపుటం యిది.

ఈ ఖండ కావ్యముల సంపుటిలో "ఓంనమశ్శివాయ" తో

ప్రారంభమై "నవోదయము"తో అంతమైన 33 ఖండికలున్నాయి. కవి తన అమ్మమ్మ మొదలు పురాణ పురుషుడైన పురూరవుని వరకును, చీమ మొదలు జీవయాత్ర వరకును కావ్య వస్తువులుగా స్వీకరించి వస్తు వైవిధ్యము సాధించుకొన్నాడు. వీనిలో చీమలరాజ్యము, రిక్షావాడు కన్నకడుపు, గాలి కబుర్లు అనే ఖండికలు మకుటాయమానంగా వున్నాయి. "చీమల రాజ్యము" లో "గండు జీమలలో బలిష్ఠుండొకండు సకల సద్గుణమూర్తి మా చక్రవర్తి" ఆయనను ఎన్నుకొనుటకు, తొలగదీయుటకు అక్కడ ఎన్నికలు లేవు! ప్రజలను కన్నబిడ్డలవలె చూస్తాడు. కరువులేదు. ధనికవర్గమని, పేదల వర్గమని లేవు. చీమల రాజ్యములో ఎఱ్ఱజీమలు లంచము లెరుగక శాంతి భద్రతలు నెలకొల్పు రక్షకభటులట! "బంగారు బొక్క ప్రేలిడిన పట్టిని గుట్టిన నేరమంటగట్టంగను జూచు" మానవులు "తమ తప్పు లెరుంగరేమి?" అనే ప్రశ్నతో యీ ఖండికలో కవిపైకి కనిపించే దానికంటే పైనైన ఒక విశేషార్థము ధ్వనింప జేశాడు.

ఒకానొక తల్లి పిచ్చుక యొక్క హృదయ విదారకమైన శోక గీతాలాపనము "కన్నకడుపు" అనే ఖండికలోని కథావస్తువు. పిచ్చుక శివాలయంలో స్వామి తలమీద ఎత్తుగా కప్పులో గూడు కట్టుకుని గ్రుడ్లు పెట్టుకుంది. పూజారి వచ్చి ఆలయం శుభ్రం చేస్తూ వాటని తీసిపేశాడు. స్వామి చూస్తూ వూరకున్నాడు. తిండి కొరకు బైటికి వెళ్ళి అప్పుడే తిరిగి వచ్చి యీ ఘోర మారణము చూసిన తల్లి పిచ్చుక కడుపు శోకం యీ ఖండికలో. వర్ణించబడింది. కరుణరసము నిర్వహించుటలో కవికి గల నేర్పు దీనిలో సూచితమైనది. ఒక వైపు పూజారి చేతిలోని గంట శ్రవణ సుఖంగా మ్రోగింది. అంటే పూజ జరుగుతోంది–దయావిహీనుడై అధర్మాన్ని చూస్తూ వూరుకున్న స్వామికి! పిచ్చుక కడుపు శోకంతో పెట్టే తిట్లు తియ్యని తుమ్మి పూలుగా స్వీకరించేందుకు సిద్ధంగా వున్న స్వామికి !! మరొక వైపు తల్లి పిచ్చుక ఎండలో. తల్లడిల్లి తల్లి పిచ్చుక గుడిలోకి వచ్చి చూసింది. ఈ విధంగా సంఘటనను సమకూర్చడంలో కూడ–పిరదౌసి దేహము ప్రేత వాటికి చేరిన సమయంలో సులతాను పంపిన డబ్బు యిల్లు చేరి నట్లు–కరుణ రసపోషకమైన నేర్పున్నది. చివరకు పిచ్చుక వాపోయి, వాపోయి మట్ట మధ్యాహ్నపు మండుటెండలో ప్రాణాలు విడుస్తుంది. అయ్యో, పూజారికి శాస్తి జరుగలేదేమని పాఠకుడు చింతపడతాడు. కరుణరసా విర్భూతికి యిదే నిదర్శనం. కావ్యాన్ని యీ విధంగా విషాదాంతం చేయడం ఆధునిక కాల లక్షణం.

"రిక్షావాడు" అనుఖండికలోని కథానాయకుడు "కష్టజీవి. కుడువన్, తొడుగన్ నిలువంగ లేక యల్లాడెడు నొక్క మానవుని యాకృతి గలిగిన వింత గుర్రము." ఆ వింత గుర్రమైనవాడు "ఇట్లంకిత మిచ్చినాడు భ్రమకంతయు యంత్రము వంటి ప్రాణియై కంకరరోడ్లకున్ సెగలగాడ్పులకున్ జడిపాన జల్లుకున్." ఈ కావ్య సంతటిలోకి మణి యనదగిన వాక్యమొకటి యీ ఖండికలో వుంది. రిక్షా దారిన వెళ్లుతూంటే "దారింగని వలపినచో నోరీ! రిక్షా యటందు మూరా పేరా?" పాపము! అతన్ని పేరుతో కూడా పిలువరు. అతని పేరే రిక్షా! ఈ మాట పఠితను కనీసం ఒక క్షణమాత్రమైనా నిలపేస్తుంది. రిక్షావాణ్ణి గురించి ఎన్నైనా పద్యాలు రాస్తూ పోవచ్చు. కాని మనల్ని ఆకర్షించేది యిటువంటి వజ్రపుతునుకే. ఇది మనం దరం నిత్యం చేసేదే,. చూసేదే. కవి దానిని తన ఊహా నేత్రముతో చూసి స్థిరమైన ఆకృతి యిచ్చేటప్పటికి మనలోని అనుభూతుల నది స్పృశించి రేపుతుంది, ఇదే కవితకుండే అతీతమైన శక్తి. "గాలి కబుర్లు" అనే ఖండిక కూడా మొత్తము మీద బాగున్నది.

ఈ కావ్యంలోని వివిధ ఖండికలలో అనేక మధురమైన కల్పనలు ఉన్నాయి. చంద్రుడు తన వైపు చూడడం, కవిత తన వంక చూసి మందహాసం చేసినట్లున్నదట. ఆయన మబ్బు తెర చాటున దాగుడుమూతలాడడం తన నల్లని పుట్టుమచ్చగని మనం నవ్వుతామని. రజకి చేయు సంఘ సేవ కబ్బురపడి జలదేవత ఆమె పదాబ్జ యుగమును ముద్దిడుకుంది. శృంగారపికము గానసభ చేస్తూ వుంటే ఉర్వీజములు తలలూపుతున్నాయి. ఇలాంటివి ఎన్నైనా చూపవచ్చు.

అర్థం ఆత్మ అయితే శైలి శరీరం కవితకు. ఛందోబద్ధంగా పద్యం రాసే ఏకవికైనా ధారా శుద్ధి ప్రధానం. ఈ సంపుటిలో ఏ పేజీలో చూసినా,కుంటుపడకుండా పద్యం గంగా ప్రవాహంలా పరుగెత్తుతుంటుంది. జాషువా, కరుణశ్రీ ప్రభృతుల ఖండ కావ్యాలకు బహుళ ప్రచారం లభించటానికి ఇదొక ముఖ్య కారణం పండితుల విషయం అలా వుంచితే, మిగిలిన ప్రజానీకం మాత్రం యిటువంటి కవిత్వాన్నే ఆదరిస్తారు. వారికి కావలసింది చక్కని నడక, సారళ్యం. అక్కడక్కడ ఒకటి రెండు అనవసరమైన పద్యాలు గూడా దొర్లాయి. "సోఫాపై నులివెచ్చని కాఫీ సేవించి నట్లు" వంటివి యీ సంపుటిలో చేరకపోతే బాగుండేది. "భూదేవత" ఖండికలో "మలమూత్రంబులు నీపయిన్ విడుచుచున్" అనే పద్యం కూడా చేర్చకుండా వుండవలసింది. విషయం నిజమే కాని కవిత్వం హుందాగా లేదు..

కవి హృదయమన్న శీర్షికలో యీ కవి తన కవితను గురించి యిలా చెప్పుకున్నాడు: "బాలిక మంచి చెడ్డలని పట్టని నా కవితా కుమారి యీ కాలపు(దీటెటింగినది కాదు" అని ఇది నిజమే. ఆధునిక కాలానికి ముఖ్య లక్షణమయిన సాంఘిక భావ చైతన్యం యీయన ఊహలలో చాలా స్వల్పంగా వుంది. తాను వాడే కవితా సామగ్రి పాతదే అయినా, మెరుగులు పెట్టి కొత్త దానివలె తళతళ లాడించే ప్రతిభ మాత్రం పుష్కలంగా వుంది. "జగమేనేనుగనేనె యీజగముగా సారస్వతేయుండనై" యీ లోకంలో వున్నానని ధీమాగా చెప్పుకోగల ధైర్యం వుంది. "తెక్కలేయుండేనేని నేనొక్కమారు నీబుజాలెక్కి నింగిలో నిలిచి నరుల జీవిత కధాపధము సమీక్షింతునోయి!"(గాలి కబుర్లు) అని శపధం సత్సంకల్పం, స్వేచ్ఛా ప్రియత్వం వుంది. తనకై తసింగారి నేపధ్యం దాటి యిప్పటికి బైటపడినందుకు కవి సంతోషించాడు. ఈ కవి యింకా విశిష్టమైన కావ్యాలు నిర్మించి నిజంగా రెక్కలు కట్టుకొని ఊహావిహంగంలాగా, ఎత్తుగా స్వేచ్ఛగా విహరించగలడని ఆశిద్దాం. —కులపతి

గురుభక్తి

కవి: యం. రంగకృష్ణమాచార్యులు
వెల: రూపాయి
ప్రచురణ: శ్రీరంగనాధ సరస్వతీ సదనం
ఆందోల్, మెదక్ జిల్లా.

ఇది మూడు భాగాలుగా వ్రాసిన చిన్నకావ్యం. మునిశిఖామణి ధౌమ్యుడు ముగ్గురు శిష్యులను కఠిన పరీక్షలకు గురిచేయడం యిందులోని యితివృత్తం. వ్యాసరచిత సంస్కృత భారతం యీ కధతోనే ప్రారంభమైంది. తెనుగు భారతంలో యీ కధ లేదు. ఆరుణి, ఉపమన్యువు, వేదుడు అనే వారు ముగ్గురు శిష్యులు,

కేదారమునకు పడిన గండి పూడ్చడానికి ధౌమ్య మహర్షి ఆరుణిని నియమించాడు. "జలము నాపక తిరిగి రావలదుసుమ్మి" అని ఆయన ఆజ్ఞ. ఆరుణివెళ్ళి ఎంత ప్రయత్నించినా నీరు ఆగదు. చివరకు తానే గండి కడ్డంగా పడుకొని మీద మట్టి కప్పుకుంటాడు. నీరాగింది. కాని ఎన్నాళ్ళకు శిష్యుడింటికి రాలేదని ధౌమ్యుడు వెళ్ళి చూసి, గ్రహించి, అతని గురుభక్తికి సంతసించి, విశేష విద్యా ప్రదానం చేస్తాడు.

రెండవ భాగంలో ఉపమన్యుని పరీక్ష. ఇదే మూడింటిలో కఠినతరమైంది. ఆవులను కాయడం అతని పని. అతనికి ఆహారం పెట్టడంమాత్రం గురువుగారి పనికాదు! మధూకర మెత్తుకొని తిని బ్రదుకుతున్నాడు ఉపమన్యుడు, గురువడిగితే అదే చెప్పాడు. అక్కడ నుండి ఆంక్షలు ప్రారంభం. తెచ్చినదేదో ముందు గురువు కర్పించి మిగిలితే శిష్యుడు తినాలి. లేకుంటే లేదు. గురువుగారు ఒక మెతుకు కూడా మిగల్చడం లేదు. పాపం, రెండవసారి పల్లెకు భిక్షాటనం వెళ్ళి పొట్టపోసుకుంటున్నాడుపమన్యుడు. రెండుసార్లు భిక్షకు వెళ్ళడం ధర్మవిరుద్ధమని ఆంక్ష. సరే—ఆవుల పాలు త్రావి జీవిస్తున్నాడు శిష్యుడు. మరి దూడల గతేమిటి? అదీ నిషేధించాడు గురువు. ఈసారి దూడలు పాలు త్రాగేటప్పుడు జారిన నురుగు తింటున్నాడు శిష్యుడు: అదీ తప్పే. గడ్డి తినబోతే, పశుగ్రాసం లోపిస్తుందని దానిని నిషేధించాడు ధౌమ్యుడు. చివరకు పశుగాసం కాని జిల్లేడు ఆకులు తింటూ అంధత్వం ప్రాప్తించి పొరపాటు వలన ఒక పాడుబావిలో పడిపోతాడు శిష్యుడు. అప్పటికి గురువుగారికి తృప్తి కలుగుతుంది. అశ్వినీదేవతల అనుగ్రహంతో తిరిగి దృష్టిపొంది ఉపమన్యుడు ధౌమ్యుని సంపూర్ణ కృపకు పాత్రుడవుతాడు.

మూడవ భాగంలోని వేదుని పరీక్ష కఠినంగాలేదు. గురువే అతని వినయ విధేయతలకు మెచ్చి కొబోలు త్వరలో ప్రసన్నుడవుతాడు. ఇక్కడ భారద్వాజ సంహిత, అద్వయ తారకోప నిషత్తులలోని శ్లోకాలు ఆధారంగా గురుశిష్య శబ్దార్ధాలను కవి వివరించాడు,

ఈ గ్రంధంలో కవిత్వస్థాయి ప్రాధమిక దశలో వున్నట్లు కనిపిస్తుంది. కవిగారే చెప్పుకున్నారు:

"ఇది నా తొలి రచన......ఇయ్యది బాల బాలికల దృష్టి యందుంచుకొని సరళ శైలిలో రచింపబడినది... ఇది పండితుల మన్ననలందుకొన కున్నను విద్యార్థులకేమైన నుపయుక్తమైన నా కృషి ఫలించినదని సంతసించెద"నని. గురుభక్తిని ప్రబోధించే కావ్యం కనుక యిది నేటి విద్యార్థులకు అవశ్య పఠనీయమనడంలో సందేహం లేదు.

సుప్రసిద్ధ సాహిత్య పరిశోధకులు శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు దీనిని సాకల్యంగా పరిష్కరించి, ప్రవేశకము వ్రాసి ప్రోత్సహించారు. పాపన్నపేట సంస్థాన విద్వాంసులు శ్రీ చిదిరె లక్ష్మణశాస్త్రిగారు కూడా దీనిని యధామతి సంస్కరించి ఆమూలాగ్రంగా మెరుగులు పెట్టారు.

— కులపతి

బొప్పాయి

రచయిత: శ్రీ సొహరాబ్ ఆర్. గాంధి

బొంబాయి ప్రభుత్వ మాజీ ఫలోద్యాన నిపుణులు

ప్రచురణ: కృషి సమాచార కేంద్రం, విస్తరణ విభాగం,

భారత ప్రభుత్వ ఆహార వ్యవసాయ మంత్రిత్వశాఖ, కొత్తఢిల్లీ.

వెల: 50 నయా పైసలు

దేశంలో ఆనవాయిగా వస్తున్న పద్ధతులతోపాటు పరిశోధనల ద్వారా తెలుసుకున్న కొత్త పద్ధతులను వివరించి రైతులకు తగిన సలహాలను ఇచ్చే ఉద్దేశంతో ప్రచురణకు పూనుకొన్న కృషి సమాచార కేంద్రం వారి "కృషి పుస్తకమాల"లో "బొప్పాయి" మొదటి పుష్పం.

ఆరోగ్య దృష్ట్యా మన ఆహారపు అలవాటులలో చాలా మార్పు రావడం అవసరం. బాగా మరపట్టిన జీవంలేని బియ్యంతో వండిన అన్నం, వాడిపోయిన నీరసమైన కాయలతో చేసిన కూరలు, పాకశుద్ధిలేని పచ్చళ్ళు మన ఆరోగ్యానికి భంగం కలిగిస్తున్నాయి. బలమిచ్చే పాలూ, పళ్ళూ, సరిపడినన్ని లేవు. ఉన్నవి సామాన్యుల అందుబాటులోలేవు. పసిపిల్లలకు సరిపడినన్ని పాలు దొరకవు. రోగం వచ్చినప్పుడైనా వైద్యులు తినమంటే ఆపిల్స్, ద్రాక్ష, నారింజలాంటి పళ్లుకూడా కొనుక్కోడం సాధ్యం కాకుండా ఉన్నది. కూటికి పేద అయినా కులానికి పేదా అన్నట్టు లోకులకు తగిన పరిజ్ఞానం లేని కారణంగా పేద పడిపోయిన బొప్పాయి కులానికి ఎంత మాత్రమూ పేదకాదు. ఏమైనా అది ఫలజాతికి చెందినది. అమృతతుల్యమైన ఆరోగ్య ప్రదమైన ఫలం.

చాలా దేశాలలో దానిని ఉదయంపూట ఫలహారంగా వాడే అలవాటు ఉన్నది. దీనిలో జబ్బుచేయని చక్కెర ఉన్నది. మాంసకృత్తులను చక్కగా జీర్ణంచేసే శక్తిగల ఎన్‌జైమ్ అనే రసం ఉన్నది "ఏ""సీ" విటమినులు విశేషంగా ఉన్నాయి. బొప్పాయి ఊరగాయకూడా పెట్టుకోవచ్చు. పచ్చికాయలోని పాలలో ఔషధ గుణం ఉన్నది. చిన్నచిన్న బొప్పాయి ముక్కలు వేసి వండితే ముదిరిన మాంసంకూడా లేత మాంసంలాగ ఉడికి రుచిగా ఉంటుందట.

ఈమాత్రం ఆమాత్రం పెరడు ఉన్న సామాన్య గృహస్థుడు బొప్పాయి తోట వేసుకుంటే తన కుటుంబారోగ్యం పెంపొందించుకోడమే కాకుండా, ఇంతో అంతో ఆర్థికంగా కూడా లాభం సంపాదించుకోగలుగుతాడు. వసతి ఉండి పెద్ద ఎత్తున సాగుచేసుకోగల వారికి ఈ పంట చాలా ఉపయోగ పడుతుంది. ఈ వ్యవసాయానికి ఎక్కువ బాదర బందీ లేదు. పెట్టుబడి తక్కువ. శ్రమకూడా తక్కువ. చవకగా పైరు చేసుకోవచ్చు. త్వరలోనే ఫలం అనుభవించ వచ్చు.

పచ్చి బొప్పాయి పాలలో "పపేన్"అనే ఫేనక ద్రవ్యం ఉన్నది. ఇది జీర్ణశక్తిని వృద్ధిచేస్తుంది దీనిని ఔషధాలలోనూ ఆహార పదార్థాలలోనూ విరివిగా వాడుతున్నారు. బొప్పాయిపళ్లను, ఎక్కువగా పండించేవారు, తమ ప్రాంతంలో వాటి నన్నిటినీ అమ్మలేమని తోచినప్పుడు కాని వాటి నన్నిటినీ ఎగుమతి చేయలేని పరిస్థితులలో కాని "పపేన్" తయారు చేయవచ్చును. ఈ పరిశ్రమకు మంచి భవిష్యత్తు ఉన్నది. శ్రేష్ఠమైన బొప్పాయి చెట్టునుంచి 11 ఔన్సుల మొదలు ఒక పౌను దాకా పపేన్ తీయవచ్చును. ఒక ఎకరం పంటకు 80 మొదలు 175 పౌనుల పపేన్ లభించవచ్చు. ఒక పౌను పపేన్ ధర 8 రూపాయలనుంచి 15 రూపాయల దాకా ఉంటుంది.

ఈ చిన్నపుస్తకంలో బొప్పాయికి సంబంధించిన జీవశాస్త్ర విశేషాలూ దాని సాగుకు అనువైన నేలల శీతోష్ణ పరిస్థితుల వివరాలూ, బొప్పాయి రకాలూ, వాటిని పెంచే విధానాలూ, నాటడం, నీరు పట్టడం, ఎరువు వెయ్యడం గొప్పులియ్యడం కలుపు తియ్యడం మొదలయిన విషయాలకు సంబంధించిన సలహాలూ బొప్పాయికి వచ్చే తెగుళ్ళూ వాటిని నివారించే ఉపాయాలూ, కాయల్ని కోయడం, పండవేయడం, బంగీకట్టి ఎగుమతి చేయడం మొదలయిన వాటి గురించి తీసుకోవలసిన జాగ్రత్తలూ చక్కగా వివరింప బడ్డాయి.

అనువాదాన్ని గురించి ఒక్కమాట. శ్రీ సొహరాబ్ గాంధి రచనను సరళమైన గ్రాంథికంలో అనువాదం చేయడానికి ప్రయత్నం చేసినట్టు కనబడుతుంది. అనువాదం చాలావరకు సరళంగానే జరిగింది. కాని అక్కడక్కడ గ్రాంథిక వ్యావహారికాలు మిశ్రం చేసినందు వల్ల కొంత ఎబ్బెట్టుగా ఉన్నది జనసామాన్యం కోసం ఉద్దేశింపబడ్డ ఇటువంటి రచనలు కమ్మని వ్యావహారికంలో ఉంటే ఎంతో ఇంపుగా హితవుగా ఉండి మనస్సుకు బాగా హత్తుకుంటాయి, చెవికి కటువుగా ఉండకుండా అవసరమైన చోట విసంధి పాటించడం మంచిది. "లింగమార్పులు",

"లేకాండముఖ", "ప్రథమవేరు" "అర్థతోట" "సంపూర్ణ చెట్లు" మొదలయిన ప్రయోగాలు బాధాకరంగా ఉన్నాయి.

కృషి శాస్త్ర రహస్యాలు రైతులకు అందించి వారి పంటను ఇబ్బడిగా ముమ్మడిగా అభివృద్ధిచేసి వారి సౌభాగ్యానికీ తద్వారా దేశ సౌభాగ్యానికీ దోహదం చేసే ప్రయత్నం ప్రశంసనీయం. అట్టి ప్రయత్నంలో ఇటువంటి పుస్తకాలు ఎంతైనా సహాయ పడతాయి.

కన్నులకు విందుచేసి నోరూరించే చక్కని చిత్రాలతో పాలమీగడ లాంటి కాగితం మీద ప్రశస్తమైన ముద్రణతో ముచ్చటగా ఉన్న ఈ పుస్తకంలో రైతులూ సామాన్య గృహస్థులూ తెలుసుకోవలసిన విశేషాలు చాలా ఉన్నాయి. మామిడి పళ్ళవంటి మధుర ఫలాలు ఆయా ఋతువులలోనే కాని దొరకవు. ద్రాక్షలాంటి పళ్లు మనమందరం పెంచుకోలేము. ఆపిల్స్ మనకు అందని మాని పళ్ళు. సులభంగా నాటుకుని ఎక్కువ వ్యయ ప్రయాసలు లేకుండా పండించుకొని సంవత్సరం పొడుగునా తిని ఆరోగ్యం పెంచుకొని కొంచెమో గొప్పో డబ్బు కూడా సంపాదించుకోడానికి వీలైన బొప్పాయిపంట మన పెరటిలోని కల్పక కాదా అనిపిస్తుంది ఈ పుస్తకం చదివితే.



ఫలము దళంబునందొడిమఁ బాయుటరాలిన వానిఁగొంచునా
కలికెరసేసి గోరసము కార్యమునట్టుల నిర్వహించి బు
ద్ధులు వెలిలేక నిశ్చలతఁ దోయజపత్రనిభాక్షి చిత్ర రూ
పులొకొ యనంగనుండుశమ పుణ్యులు సూలైయహింస నాత్మకుల్.

—భార.

విశ్వగానలహరి

కమ్మిశెట్టి

ఈ గభీర విభావరీ గర్భకుహరాన
ఈ ప్రశాంత నితాంత నిశ్శబ్ద సమయాన
నీ అమృత హస్తాంగుళీ స్పర్శ మధురించి
నిక్వణించు మనోజ్ఞ రీతి విశ్వవిపంచి

ఓ విశ్వవైణికా...ఓ మౌనగాయకా...

శయనించు సాగర తరంగాల పైతేలి
పయనించు మేఘ పర్యంకాల పైసోలి
మరు భూముల గమించి గిరిలోయల నడించి
ఆశావిరహిణీకపోలాలు స్పృశియించి
చంద్ర కిరణాలలో గంధ పవనాలలో
నీ గానమే నిండెనోయి భువనాలలో

ఓ విశ్వవైణికా....ఓ మౌనగాయకా...

మృదుల సుమగర్భాల నవమధువు లూరించి
మధుర సుధతారించి హృదయ పాత్రలు నించి
ఆశానిరాశాంతరాధూతడోలలో
ఆద్యంత రహిత మైసాగు హిందోళలో....
నీ మౌనగాన వాహినులు ప్రవహించేను!
ఈ లోకమె రసార్ద్రమై తన్మయించేను!!

ఓ విశ్వవైణికా...ఓ మౌనగాయకా....

(రవీంద్రుడికి కృతజ్ఞతతో)

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమం

సాంఘిక సంక్షేమం విషయంలో ప్రభుత్వ పరంగా జరిగే కృషిలో, ప్రధానంగా, సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన కులాల సాధారణ పరిస్థితుల అభివృద్ధిపై శ్రద్ధ తీసుకొనబడుతుంది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతులు, యితర వెనుకబడిన తరగతులు, విముక్త జాతులు అని విభజించబడిన వారి అభివృద్ధికి ద్వితీయ ప్రణాళిక కాలంలో తగినంత కృషి జరిగినది; తృతీయ ప్రణాళిక కాలంలో రూ. 537 లక్షలు కేటాయించబడినవి.

పరిస్థితులు వేరైనా, పాశ్చాత్య దేశాలతో సహా అన్ని దేశాలకు సాంఘిక సంక్షేమ సమస్యలు వుండనే వున్నవి. అయితే మన దేశంలో, ప్రత్యేక సమస్యలకు తోడు ప్రజలు సర్వసాధారణంగా వెనుకబడి వుండటమనే సమస్య ఒకటున్నది మత సంస్కృతీ సంప్రదాయాల ప్రభావాలకులోనై మనుషులు మొదటి నుంచీ ఆర్తులకు సేవచేస్తూనే వున్నారు. రాజారామ మోహనరాయ్ మహాత్మాగాంధీలవంటి విశాల హృదయులు సంఘానికెంతో సేవ చేశారు. గోపాలకృష్ణ గోఖలే సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీని, మహాత్మాగాంధీ హరిజన సేవక సంఘాన్ని తదితర మత ప్రసక్తిలేని సాంఘిక సంక్షేమ సంస్థలను నెలకొల్పారు. మహాత్ముడు భారతీయులకు అన్నిటికంటే ముఖ్యమైన స్వాతంత్ర్యాన్ని సముపార్జించిన మాట విశదమే కదా.

వెనుకబడిన తరగతుల రక్షణ

శ్రేయోరాజ్యానికి తొలి సోపానమైన భారత రాజ్యాంగం పౌరులందరికీ ప్రాతిపదిక హక్కులకు హామీనివ్వటంతో సాంఘిక సంక్షేమ కృషి మరింత చురుకుగా జరుగుతున్నది. వెనుకబడిన తరగతులు ముఖ్యంగా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు జాతుల విద్యావిషయక, ఆర్థిక పరిస్థితులను చక్కబరచవలెనని రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వాలకు విధిస్తున్నది కూడ. ప్రభుత్వాలు యిందుకు పూనుకొన్నవి. కాని మన దేశ పరిస్థితుల దృష్ట్యా దీనిని సాధించడం అంత సులభం కాదు. ఈ దృష్టితో చూచినప్పుడు నాలుగు సంవత్సరాల స్వల్పకాలంలో సాంఘిక సంక్షేమ రంగంలో ఆంధ్రప్రదేశ్ సంతృప్తికరమైన ఫలితాలను సాధించినదని చెప్పవచ్చు.

మన దేశపు ఆచార వ్యవహారాలను బట్టి సంఘంలో కొన్ని వర్గాల ప్రజలకు సమానావకాశాలు లేక వెనుకబడ్డారు. వారిలో అస్పృశ్యులు ఒక వర్గం. వీరు "షెడ్యూల్డు కులాల" క్రిందకి వస్తారు వీరికి "హరిజను"లని పేరుపెట్టి మహాత్మాగాంధీ వీరి అభివృద్ధికి యెంతో కృషిచేశారు. 1951 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో వారి జనసంఖ్య 44.000 లక్షలు. షెడ్యూల్డు జాతులనగా గిరిజనులు వారి జనాభా 11,5 లక్షలు. ఈ రెండు వర్గాలకు, ముక్తజాతులకు చెందని యితర వెనుకబడిన తరగతుల వారు 76 లక్షల మంది వున్నారు. విముక్త జాతుల జనాభా 2.5 లక్షలు.

ప్రణాళికలలో వసతులు

ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమానికై విద్య, ప్రజారోగ్యం, గృహవసతి, ఆర్థికాభ్యుదయ రంగాలలో కృషి చేస్తున్నది. ఈ కులాలకై మామూలుగా యేటా ఖర్చు చేసే రూ. 135 లక్షలకు తోడు, ద్వితీయ ప్రణాళికలో మరి రూ. 681 లక్షలు ప్రత్యేకించబడినవి. తృతీయ ప్రణాళికలో, యీ కులాల అభివృద్ధికై ప్రభుత్వ విభాగంలో రూ. 537 లక్షలను ఖర్చుచేయాలని సంకల్పం.

ద్వితీయ ప్రణాళిక ఆఖరుకి దిగువ లక్ష్యాలు సాధించబడినవి: 8,400 అదనపు విద్యార్థి వేతనాల గ్రాంటు, యెక్కువగా వసతి గృహ సౌకర్యాల కల్పన, భోజనపు గ్రాంటుల హెచ్చింపు, కొత్త ప్రభుత్వ వసతి గృహాలు లేక వసతి భవనాల ప్రారంభం, 570 మార్గాలు, 770 స్నానపు గదులు, 1,540 మరుగు దొడ్ల యేర్పాటు, 15,572 హరిజన కుటుంబాలకు యిళ్ళ స్థలాల కేటాయింపు. ద్వితీయ ప్రణాళిక కాలంలో 7,350 గృహాల నిర్మాణా

నికై సహాయంగాను అప్పుగాను ఆర్థిక సహాయం చేయబడినది. హరిజనాభ్యుదయంలో ఆసక్తిగల హరిజన సేవక సంఘం, భారత సేవక సమాజ్, సర్వీసు గిల్డువంటి స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆర్థిక సహాయం చేయబడినది. ప్రారంభించిన వివిధ సంస్థలను సమర్థంగా అజమాయిషీ చేసి అవి సక్రమంగా నడచునట్లు చేయుటకై ఆర్గురు సంక్షేమ అధికార్లు, ఒక డిప్యూటీ డైరెక్టర్ నియమింపబడ్డారు.

వెనుకబడిన తరగతుల అభివృద్ధికై కళాశాలా విద్యార్థులకు 1,680 అదనపు విద్యార్థి వేతనాలు, పాఠశాలా విద్యార్థులకు 16,000 విద్యార్థి వేతనాలు సమకూర్చబడినవి. దాదాపు 1,330 భోజనపు గ్రాంటులు యివ్వబడుటే కాక వెనుకబడిన తరగతుల పిల్లలలో దాదాపు 5,585 మందికి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పింపబడినది.

విముక్త జాతుల ఆర్థిక స్థాయి హెచ్చటానికి వీలుగా వారి ఆర్థికాభివృద్ధికి యెక్కువ ప్రాముఖ్య మివ్వబడినది. పిల్లలు పూర్వం వారి పెద్దలవలె సంఘ వ్యతిరేకమైన పనులు చేయకుండా జాగ్రత్త తీసుకొనబడినది. ప్రణాళికలో, దిగువ చర్యలు వుద్దేశించబడినవి: పది రేడియోసెట్లు, పదిపిల్లల పార్కుల యేర్పాటు 3,100 కొత్త గృహాల నిర్మాణం, 3,000 పాత గృహాల మరమ్మతు, కుటీర పరిశ్రమల ప్రారంభానికై 500 కుటుంబాలకు సబ్సిడీలు యివ్వటం, 25 బావులు, 25 స్నానపు గదులు, 25 మరుగు దొడ్ల నిర్మాణం, 25 మంచినీటి బావుల మరమ్మతు, అయిదు స్త్రీ సంక్షేమ కేంద్రాల యేర్పాటు, బిట్రగుంట సెటిల్మెంటులో 11 నీటి పారుదల బావులకు మరమ్మతు, అస్వస్థులకు మందుల సరఫరా.

తెలంగాణా ప్రాంతంలో, హరిజనులకు మంచినీటి సౌకర్యాలను కలుగజేయుటకై 766 కొత్త బావులు నిర్మించబడినవి, 904 పాత బావులు మరమ్మతు చేయబడినవి. హజరినులకు 1,433 గృహాలకు వసతి కల్పించబడినది. ప్రైవేటుగా నడుపబడుతూ 935 మందికి వుపకరించే హరిజన వసతి గృహాలకు సబ్సిడీలు యివ్వబడినవి. 2,520 మంది పేద హరిజన విద్యార్థులకు బట్టలు, పుస్తకాలు, పలకలు వగైరా సరఫరా చేయబడినవి. 857 మంది అస్వస్థులకు వైద్య సహాయం చేయబడినది. వృత్తి పని వారికి, వారి వ్యాపారం లేక వృత్తి నిమిత్తం వ్యక్తి గతంగా కాని సహకార సంఘాల ద్వారా కాని ఆర్థిక సహాయం చేయబడినది. 510 మందికి న్యాయశాస్త్ర సంబంధమైన సహాయం చేయబడినది. ఇవి కాక, యీ ప్రణాళికలో, దృశ్య ప్రచారానికి, పుస్తకాల ప్రచురణకు, హరిజన వారాలు, దినోత్సవాల పాటింపుకు, కులాంతర భోజనాలకు, హరిజనోద్ధరణకు పాటుపడుతున్న స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆర్థిక సహాయానికి కూడ వసతి కల్పించబడినది.

తెలంగాణాలో విముక్త జాతుల అభివృద్ధికై 857 మంది వుపకరించే 8వ తరగతి గృహాలు ప్రారంభింపబడినవి. ఇవి కాక, 457 జతల దుక్కి-టెద్లు సరఫరా చేయబడినవి, 617 కుటుంబాలకు విత్తనాలు, పరికరాలు సరఫరా చేయబడినవి, కుటీర పరిశ్రమలకై 37 సహకార సంఘాలు ప్రారంభింప బడినవి, 38 కొత్త బావులు త్రవ్వబడినవి, 58 పాత బావులు మరమ్మతు చేయబడినవి, 300 గృహాల నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయబడినది.

తెలంగాణాలో యితర వెనుకబడిన తరగతుల సహాయానికై, ప్రణాళికలలో, 2,018 మంది విద్యార్థులకు విద్యార్థి వేతనాలకు, 148 మంది విద్యార్థులకు సహాయక గ్రాంటులకు, 42 ప్రైవేటు వసతి గృహాలకు ఆర్థిక సహాయానికి, 36 కొత్త వసతి గృహాల ప్రారంభానికి, 38 వృత్తి పనివారి సహకార సంఘాల యేర్పాటుకు, 368 మంది వృత్తిపని వారికి వృత్తి సంబంధమైన సహాయం చేయుటకు వసతి కల్పించబడినది.

షెడ్యూల్డు జాతుల సంక్షేమానికి వుద్దేశించబడిన వివిధ పథకాల అమలుకై ద్వితీయ ప్రణాళికలో రూ. 210.06 లక్షలు. రూ. 191.05 లక్షలు ఆంధ్రకు, రూ. 19.01లక్షలు తెలంగాణాకు కేటాయించబడినవి. ఈ పథకాలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, వైద్య సౌకర్యాలు, కుటీర పరిశ్రమలు, పశుపోషణ, సహకారం; కమ్యూనిటీహాల్సు, స్త్రీ సంక్షేమం మున్నగు సకల రంగాలలో సర్వతోముఖమైన అభివృద్ధి సాధనకు అనువుగా రూపొందించబడినవి. ద్వితీయ ప్రణాళిక సమాప్తి నాటికి 300 మంది గిరిజనులకు వ్యవసాయంలోను, 360 మంది గిరిజనులకు కుటీర పరిశ్రమలలోను శిక్షణా సౌకర్యాలు కల్పించబడినవి. రక్షిత నీటి సరఫరా సౌకర్యాలకై దాదాపు 208 బావులు నిర్మించబడినవి. గిరిజన ప్రాంతంలో 121 మైళ్ళ పొడవున రోడ్లు నిర్మించాలనే లక్ష్యం ప్రణాళిక నాలుగవ సంవత్సరంలోనే సిద్ధించినది. ప్రణాళికా కాలంలో 50 కొత్త ప్రాథమిక పాఠశాలలు, బేసిక్ విద్యా బోధనకై ఒక బేసిక్ విద్యా పాఠశాల, వుపాధ్యాయులకు బేసిక్ విద్యలో పునఃశిక్షణ ఇచ్చుటకై ఒక హయ్యర్ గ్రేడ్ బేసిక్ విద్యా శిక్షణా పాఠశాలకూడ తెరువబడినవి. దోర్నాలలో చెంచుల వుపయోగార్థం ఒక పాఠశాల తెరువబడినది. దీనికి ఒక

వసతి గృహం, సంచార వైద్యశాల కూడ కలవు. వారికి రెండు రేడియో సెట్లు, ఒక స్త్రీ సంక్షేమ కేంద్రము కూడ యేర్పాటు చేయబడినవి అయిదు పశువుల ప్రథమ చికిత్సా కేంద్రాలు, రెండు చిన్న పశువైద్య ఔషధశాలలు, ఒక టూరింగ్ బిల్లెట్టు గుడ్లు పొదిగే కేంద్రం ఒకటి, ఒక పశుక్షేత్రము ప్రారంభింప బడినవి. ద్వితీయ ప్రణాళిక సమాప్తినాటికి, గిరిజనులకు, 17 ఆబోతులు, 10 ఆడపశువులు, 820 కోడిపుంజులు, పెట్టలు, 100 గొర్రెలు సరఫరా చేయబడినవి. అదే కాలంలో తెలంగాణాలో గిరిజనులకు 348 గేదెలు, 768 గొర్రెలు సరఫరా చేయబడినవి, భారీ నీటి పారుదల క్రింద, 2,750 యెకరాలకు నీటి పారుదలను, సమకూర్చే 11 పథకాలు చేపట్ట బడినవి. ఆంధ్ర ప్రాంతంలో 26 పంట నీటి చెరువులు మరమ్మతు చేయబడినవి. 7 స్త్రీ సంక్షేమ శాఖలు ప్రారంభింప బడినవి. మరి మూడు కేంద్రాలు తెరువబడినవి. ఆధునిక చికిత్సా సౌకర్యాల కల్పనకై పోలవరం, జీలుగుమిల్లి, అరకులలోని ఔషధశాలలు అభివృద్ధి పరుపబడినవి. కృష్ణదేవిపేట, చింతపల్లిలలోని ఔషధశాలలు ఆస్పత్రులుగా మార్చబడినవి. జి. మాడుగులు, సీతంపేటలలో కొత్త ఔషధశాలలు తెరువబడుటే కాక సీతంపేట, పోలవరాలలో సంచార వైద్య సంస్థలు ప్రారంభింపబడినవి. ఆరు యూనిట్లతో రెండు ప్రసూతి శిశుసంక్షేమ కేంద్రాలు తెరువబడినవి. యాస్, మలేరియా వ్యాధుల నిరోధానికై విస్తృత ప్రాతిపదికపై చర్య గైకొనబడినది. మైదానాల ప్రజలు, గిరిజనులను కొల్లగొట్టకుండా ఆపుటకేమి, వారికి పరపతి, విక్రయ సౌకర్యాలను కల్పించుటకేమి ఆంధ్ర షెడ్యూల్డు జాతుల సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ ప్రారంభింప బడినది. అస్థిర జీవనులైన షెడ్యూల్డు జాతుల ప్రజలకు పునరావాసం కల్పించుటకై, ద్వితీయ ప్రణాళిక కాలంలో తెలంగాణాలో 11, ఆంధ్రలో 4 కాలనీలు నిర్మింపబడినవి. తెలంగాణాలో మరి 6 కాలనీలు నిర్మింపబడినవి.

తృతీయ ప్రణాళికా పథకాలు

తృతీయ ప్రణాళికా కాలంలో, హరిజనులు, తదితర అస్పృశ్య కులాల విద్యార్థులు దాదాపు 18,000 మందికి విద్యార్థి వేతనాలను యివ్వాలని సంకల్పం. హరిజన విద్యార్థుల నిమిత్తం వసతి గృహాలను నడిపే సేవా సంస్థలను, ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సహించే నిమిత్తం భోజనపు గ్రాంట్లను—14,860 మందికి— యివ్వాలని, ప్రభుత్వం 48 వసతి గృహాలను తెరువాలని సంకల్పం. 90,000 మంది విద్యార్థులకు బట్టలు, పుస్తకాలు, పలకలు మున్నగు వాటిని యిచ్చి తద్వారా హరిజనులు తమ పిల్లలను బడికి పంపునట్లు చేయుటకై తృతీయ ప్రణాళికలో రూ. 18.00 లక్షలను కేటాయించాలని సంకల్పం. దాదాపు 31,000 వృత్తి పనివారి కుటుంబాలకు పరికరాలను, ముడిసరుకును సరఫరా చేయాలని, హరిజన వాడలకు మంచినీటి సౌకర్యాల కల్పనకై దాదాపు 2,000 బావులను త్రవ్వాలని సంకల్పం. వ్యావసాయక సహాయంగా, 6,600 షెడ్యూల్డు కులాల కుటుంబాలకు దుక్కిటెద్దు మున్నగువాటి సరఫరాకై రూ. 20.00 లక్షలు ఖర్చు పెట్టాలని సంకల్పం. కమ్యూనిటీ హాళ్ళ యేర్పాటుకై రూ. 4.00 లక్షలు ఖర్చుచేయ బడతవి. అస్పృశ్యతా నివారణకై పాటుబడే స్వచ్ఛంద సేవా సంస్థలకు గ్రాంటులు యివ్వబడతవి. ఇందు నిమిత్తం రూ. 3.00 లక్షలు కేటాయించ బడినవి. పేద హరిజనులకు, దాదాపు 4,375 గృహాల నిర్మాణానికై సబ్సిడీలు యివ్వబడతవి. హరిజనులకు యివ్వటానికై 20.000 యిళ్ళ స్థలాలు సంపాదించబడతవి. ఇవి కాక, మలం తలమీద కెత్తుకొని మోసే ఆచారం మాన్పించటానికి, అశుభ్ర వృత్తులలో నున్న వ్యక్తుల పని పరిస్థితుల అభివృద్ధికి, షెడ్యూలు కులాల సంక్షేమానికై యితర మామూలు అభివృద్ధి శాఖలు చేసే కృషిని పరిపుష్టం చేయటానికి పరిపాలనా వ్యవస్థను పటిష్టం చేయటానికి కూడ పథకాలు అమలుపరచ బడగలవు.

విముక్త జాతులు

విముక్తజాతుల ఆర్థికాభివృద్ధికై త్రాడు - అల్లకం యంత్రాలు, తేనెటీగల పెంపకం పెట్టెలను సరఫరా చేయాలని సంకల్పం. వారు కుటీర పరిశ్రమలను నెలకొల్పుకొనుటకై ఆర్థిక సహాయం కూడ చేయబడుతుంది. పంపుసెట్ల స్థాపన, పాత బావుల మరమ్మతు, దుక్కిటెద్దు, విత్తనాలు, పరికరాల సరఫరా ద్వారా వ్యవసాయానికి కూడ సహాయం చేయబడుతుంది. 1,240 గృహాల నిర్మాణానికై వ్యక్తులకు ఆర్థిక సహాయం చేయాలని సంకల్పం.

ఇతర వెనుకబడిన తరగతులు

పై సహాయం లేనిదే చదువుకొనలేని వెనుకబడిన తరగతుల పేద విద్యార్థులకు విద్యార్థివేతనాలను యివ్వవలసి వుంటుంది కాబట్టి తృతీయ ప్రణాళిక కాలంలో యితర వెనుకబడిన తరగతుల విద్యార్థులకు 2000 విద్యార్థి వేతనాలను యివ్వాలని సంకల్పం. ఈ ప్రణాళికా కాలంలో మధ్యాహ్న భోజనాలకు కూడ వసతి కల్పించాలని సంకల్పం. ఆర్థికాభివృద్ధి పథకాల క్రింద, పరిశ్రమల శాఖచే నడుపబడే గుర్తింపబడిన సంస్థలలో వడ్రంగం, కమ్మరి మున్నగు వృత్తులలో 13,000 వృత్తి పనివారి కుటుంబాలకు వుపకరించేటట్టుగా వృత్తి సంబంధమైన సహాయం కూడ చేయబడుతుంది.

మొత్తం మీద, షెడ్యూల్డు కులాలు, విముక్త జాతులు, యితర వెనుకబడిన తరగతుల సంక్షేమానికై తృతీయ పంచవర్ష ప్రణాళికలో రూ. 212.30 లక్షలు ఖర్చయే 33 పథకాలను చేర్చాలని సంకల్పం. ఇందులో రూ. 150 80 లక్షలు వ్యయమయే 16 పథకాలు ఆంధ్రకు. రూ. 81.50 లక్షల అంచనా ఖర్చు గల మిగిలిన 17 పథకాలు తెలంగాణాకు సంబంధించినవి.

షెడ్యూల్డు జాతులు

షెడ్యూల్డు జాతుల సంక్షేమానికై తృతీయ ప్రణాళికలో దిగువ పథకాలను చేర్చాలని సంకల్పించబడినది:

షెడ్యూల్డు జాతుల పిల్లల ప్రాథమిక పాఠశాలల్లో వ్యవసాయం, అడవుల పెంపకం, స్థానిక కుటీరపరిశ్రమలకు యెక్కువ ప్రాధాన్యం వుండాలి. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపునట్లు చేయుటకై మధ్యాహ్న భోజనాలు, పుస్తకాలు, పరికరాలు, బట్టల రూపంలో సహాయం జరగాలి. గిరిజన ప్రాంతాలలో పని చేయుటకు తగినరీతిగా వుపాధ్యాయులకు శిక్షణ గరపటం, స్థానిక భాషను నేర్పటం వంటి ప్రత్యేక సమస్యలను పరిష్కరించ వలసి వున్నది.

గిరిజన విద్యార్థులందరికీ, వసతి గృహాలు, విద్యార్థి వేతనాలు, పుస్తకాలు మున్నగు వాటికి స్టయిపెండులు, పరీక్షరుసుము సౌకర్యాలు కల్పించవలసి వున్నది. ఇందు నిమిత్తం 9 ఆశ్రమం పాఠశాలలను తెరచి, వాటికి భవనాలను నిర్మించాలని, వున్న పాఠశాలలను అభివృద్ధి పరచాలనీ సంకల్పించబడినది. 30 వసతి గృహాలను తెరవాలని సంకల్పం. దాదాపు 12,000 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు సరఫరా చేయబడతవి. దగ్గరగా 1,65,000 మంది గిరిజన పిల్లలకు బట్టలు, పుస్తకాల భత్యాలు యివ్వాలని సంకల్పం. వసతి గృహాలకు 30 కొత్త భవనాలను నిర్మించాలని కూడ సంకల్పం, శిక్షితులైన వుపాధ్యాయులను ఏజన్సీ ప్రాంతాలకు ఆకర్షించుటకై ప్రణాళికా కాలంలో 400 గృహాలు నిర్మించబడుతవి. పై కార్యక్రమం అమలుకై తృతీయ ప్రణాళిక కాలంలో రూ. 40 00 లక్షలు కాగలవని అంచనా.

రాష్ట్రంలోని షెడ్యూల్డు ప్రాంతం కొండ గుట్టలతో యెగుడు దిగుడుగా వున్నప్పటికీ, వ్యవసాయాభివృద్ధికి మిక్కిలి అవకాశమున్నది. తృతీయ ప్రణాళిక కాలంలో మూడు ప్రైవేటు క్షేత్రాలను ప్రారంభించాలని, ప్రస్తుతం వున్న క్షేత్రాలను, ప్రదర్శన యూనిట్లను కొనసాగించాలని సంకల్పం. 30 మంది గిరిజనులకు తోటల పెంపకంలో శిక్షణ యివ్వబడుతుంది. ప్రదర్శన ప్రయోజనాలకై విత్తనాలను, ఎరువులను, పరికరాలను వుచితంగా సరఫరా చేయాలని కూడ సంకల్పించ బడినది. గిరిజనులను శాశ్వతంగా వ్యవసాయంలో స్థిరపర్చుటకై 375కుటుంబాలకు యెద్దు బళ్ళు నాగళ్ళు యివ్వబడతవి. ఈ కార్యక్రమం అమలుకై తృతీయ ప్రణాళికలో రూ. 12 00 లక్షలను కేటాయించాలని సంకల్పం.

ఆదిమజాతి అలవాట్లు గల చెంచుల అభివృద్ధి విషయంలో ద్వితీయ ప్రణాళికా కాలంలో ప్రారంభింపబడిన పథకాన్ని కొనసాగించబడగలవు. ఆ పైన చెంచులకు వస్త్రధారణ అలవాటు చేసేందుకై వారికి వుచితంగా వస్త్రాలను సరపరా చేయాలని సంకల్పం ఇందు నిమిత్తం రూ. 5.0 లక్షలను కేటాయించాలని సంకల్పం. ఏజన్సీ ప్రాంతాలలో పుష్కలంగా దొరికే ముడి వస్తువుల వుత్తమ వినియోగానికై గిరిజనులకు ఆధునిక పద్ధతులలో వెదురు, పేము బుట్టల అల్లిక, చాపల అల్లకం, తోలు పదును పెట్టుట నేర్పబడుతున్నవి. తృతీయ ప్రణాళికా కాలంలో యీ శిక్షణా సౌకర్యాలను కొనసాగించుటయే గాక, వడ్రంగంలో 7 శిక్షణ - వుత్పత్తి కేంద్రాలు, ఒక చాపల అల్లకం కేంద్రం, ఒక కుట్టుపని కేంద్రం పీచు పరిశ్రమలో నమూనా శిక్షణ కేంద్రం ఒకటి, ఒక బీడీల తయారీ కేంద్రాలను తెరువాలని సంకల్పం. తెలంగాణాలో ప్రారంభింపబడిన పట్టు పరిశ్రమ క్షేత్రం, 16 చేతిపని కేంద్రాలు, నేత, వడ్రంగం, కుట్టు అల్లికలలో 3 శిక్షణ-వుత్పత్తి కేంద్రాలు కొనసాగించబడుతవి. పట్టు పరిశ్రమ అభివృద్ధికై విశాఖపట్నం జిల్లా చింతపల్లిలో రూ 4.00 లక్షలు వ్యయమయే పథకం ఒకటి అమలు జరుపబడుతుంది. మొత్తం మీద, కుటీర పరిశ్రమల అభివృద్ధికై రూ 13 00 లను కేటాయించాలని సంకల్పం.

ఏజన్సీ ప్రాంతాలను మైదానాలలో కలిసి, రాకపోకలకు వుత్తమ సౌకర్యాలను కల్పించటానికై ద్వితీయ ప్రణాళికా కాలంలో పెక్కు రోడ్డు పనులు చేపట్టబడినవి. ద్వితీయ ప్రణాళిక ఆఖరుకు యిందులో 17 పనులు మిగిలిపోయినని, ఇవి తృతీయ ప్రణాళికలో కొనసాగించబడగలవు. ఈ పనుల నిర్వహణకై రూ 66-61 లక్షలను కేటాయించాలని సంకల్పం. ఇదికాక, తెలంగాణా ప్రాంతపు యేజన్సీలలో కొత్త రోడ్ల నిర్మాణానికై రూ 30.00 లక్షలు కేటాయించబడును. షెడ్యూల్డు జాతులకు సేవ చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆర్థిక సహాయం చేయుటకై రూ 200 లక్షలను కేటాయించాలని సంకల్పం,

షెడ్యూలు ప్రాంతాలలో రకరకాల అడవులు వున్నవి. అక్కడ సాగుకై సువిశాలమైన భూములు వున్నవి. ఈ ప్రాంతాల సగటు వర్షపాతం-సంవత్సరానికి-50-60 అంగుళాలు కాబట్టి, యీ నీటి సాగు ప్రయోజనాలకు మళ్ళించడానికి యెంతో అవకాశం వున్నది తృతీయ ప్రణాళికా కాలంలో రూ 20 00 లక్షలు వ్యయమయే చిన్న నీటి పారుదల పనులను చేపట్టాలని సంకల్పం.

గిరిజనులు ప్రకృతి ఒడిలో జీవించినా, వారి ఆరోగ్యం మంచిదికాదు. మలేరియా, యాస్, క్షయ, మశూచికం, సుఖ వ్యాధులు, చర్మ నేత్ర వ్యాధులతో వారు తీసుకుంటూ వుంటారు. ఇందుకు చాలవరకు శుభ్రమైన మంచినీరు, పుష్టికరమైన ఆహారం, శీతోష్ణస్థితుల పై పరీత్యాల నుండి రక్షణలు లేకపోవడం కారణం. ద్వితీయ ప్రణాళికా కాలంలో ప్రారంభమైన ఆస్పత్రులు, ఔషధ శాలలను కొనసాగించుటయే కాక, తృతీయ ప్రణాళికా కాలంలో వున్న ఆస్పత్రులను అభివృద్ధిపరచి మరికొన్ని ఆస్పత్రులను, ఔషధశాలలను తెరవాలని సంకల్పం. తెలంగాణా ప్రాంతపు గిరిజనులకు కూడ యిదే రకం వైద్య సౌకర్యాలు కల్పించాలని సంకల్పం. ఈ ప్రణాళికల అమలుకై రూ 21.33 లక్షలు అవసరం. ప్రజారోగ్య కార్యక్రమం క్రింద, 9 ప్రసూతి శిశు సంక్షేమ కేంద్రాలను తెరవాలని సంకల్పం. ఇందుకు రూ 11.67 లక్షలు అవసరం కాగలవు. గిరిజనులకు మంచినీటి సౌకర్యాల కల్పనకై తృతీయ ప్రణాళిక కాలానికి రూ. 20.00 లక్షలను కేటాయించాలని సంకల్పం.

ఆంధ్ర షెడ్యూల్డు జాతుల సహకార ఆర్థిక, అభివృద్ధి సంస్థ కార్యకలాపాలు ప్రస్తుతం విశాఖపట్నం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు పరిమితమయి వున్నవి. ఈ సంస్థ వల్ల రాష్ట్రమంతా లాభం పొందేట్టు దాని కార్యరంగాన్ని విస్తరించాలని సంకల్పం. ఇందుకు రూ 15.00 లక్షలు కావాలి. గిరిజన సంక్షేమ కేంద్ర సలహా సంఘం సమావేశంలో సూచించినట్టు, బొంబాయిలో గల సంఘాల పద్ధతిలో అడవుల కార్మిక సహకార సంఘాలను, రూ 20.00 లక్షల వ్యయంపై, నెలకొల్పాలని సంకల్పం.

మొత్తంమీద, షెడ్యూల్డు జాతుల సంక్షేమానికై తృతీయ ప్రణాళికలో రూ 304 61 లక్షలు వ్యయమయే పథకాలను చేర్చాలనిసంకల్పం. ఇందులో రూ 208 53 లక్షల పథకాలు ఆంధ్ర ప్రాంతానికి, రూ 96 08 లక్షలు కాగల మిగిలిన 13 పథకాలు తెలంగాణావి, మొత్తం సొమ్ము రూ 304.01 లక్షలలోను 1961-62 లో రూ 58.10 లక్షలు ఖర్చుపెట్టబడును.

సాంఘిక, నైతికారోగ్య కార్యక్రమాలు

"సాంఘిక, నైతికారోగ్యం, అనంతర రక్షణ కార్యక్రమాల" పథకం 1957-58 లో మంజూరైనది. ఈ పథకం క్రింద పురుషులకై రెండు రాష్ట్ర అనంతర రక్షణ సాదనాలు ఆరు జిల్లా ఆశ్రయాలు తెరువబడినవి. ఈ పథకం-యిందుకయే ఖర్చులో కేంద్ర ప్రభుత్వం సగమే యిస్తున్నా-కేంద్ర ప్రారంభిత విభాగం క్రింద మంజూరైనది. ఈ పథకం క్రింద, ద్వితీయ ప్రణాళిక కాలంలో మొత్తం రూ 7.41 లక్షలు కేటాయించబడినవి.

తృతీయ ప్రణాళికా కాలంలో ఈ పథకం క్రింద, నాలుగు అదనపు ఆశ్రమ సాధనాల-రెండు ఆంధ్ర ప్రాంతంలోను, రెండు తెలంగాణాలోను-ప్రారంభానికై రూ 1.50 లక్షలు చేర్చబడినవి.

ఇప్పుడు హైద్రాబాద్ నగరంలో సాంఘిక సంక్షేమ శాఖచే రెండు భిక్షుక గృహాలు నడుపబడుచున్నవి.

తృతీయ ప్రణాళికా కాలంలో రెండు ఆంధ్రలోను, ఒకటి తెలంగాణాలోను మొత్తం 3 కొత్త భిక్షుక గృహాల ప్రారంభానికై రూ 2.50 లక్షలను ఖర్చు చేయాలని సంకల్పం.

సంగ్రహ ప్రకటనలు

పాలి టెక్నిక్ తరలింపు

వుయ్యూరు నుంచి విజయవాడకు పాలిటెక్నిక్‌ను తరలించటానికి గల కారణాలను వివరిస్తూ, ప్రభుత్వం, ఒక పత్రికా ప్రకటనలో 1952 నుంచి కూడ, కేంద్ర ప్రభుత్వమూ, అఖిలభారత సాంకేతిక విద్యా సంఘపు దక్షిణ ప్రాంతీయ సంఘముకూడ, ఆ సంస్థను యేర్పరచిన వారు, దానికి యెక్కువ స్థలాన్ని, తగిన వసతి గృహాన్ని సమకూర్చిన సేతప్ప, దానిని మచిలీపట్నముకో, విజయవాడకో తరలించవలెనని పెక్కు సందర్భాలలో అన్నట్లు తెలియచేసినది. ఈ సంస్థను వుయ్యూరులోనే వుంచమనీ, అందు నిమిత్తం అదనంగా 10 యెకరాల స్థలాన్ని, వసతి గృహం ఖర్చులలో ఒక భాగంగా లక్ష రూపాయలను యివ్వగలమని అక్కడివారిలో కొందరు చేసిన అసందిగ్ధమైన వాగ్దానాన్ని పురస్కరించుకొని, దాని నక్కడనుంచి తరలించవలెనని కేంద్ర ప్రభుత్వం అధికారులు కోరినప్పుడల్లా రాష్ట్రప్రభుత్వం వారిని ఆపుతూ వచ్చినది. ప్రభుత్వం మరీ మరీ చెప్పినా ఆ వాగ్దానాలు నిలబెట్టుకొన బడలేదు.

పత్రికా ప్రకటనలో యిలా వివరించబడినది. "కేంద్ర గ్రాంటు విషయంలో విధించబడిన షరతులలో, ఆది ద్వితీయ ప్రణాళిక ఆఖరయే లోపున వినియోగించుకోబడాలనేది ఒకటి. ఈ షరతులను నెరవేర్చుటలో యిక యేమాత్రం ఆలస్యం జరిగినా పాలీటెక్నిక్ శాశ్వత భవనాల ఖర్చులో సగం క్రింద వచ్చే దాదాపు రూ. 7.5 లక్షలు నష్టమైపోయి వుండును. పరికరాలు వగైరాల నిమిత్తం కేంద్రం నుంచి వచ్చే సహాయం కూడా నష్టమైపోయి వుండేది. ఇందువల్ల ప్రభుత్వం తొందరగా విజయవాడలో రూ. 2.24 లక్షలతో 20 యెకరాల స్థలాన్ని సంపాదించి రూ. 14.98 లక్షలతో శాశ్వత భవనాల నిర్మాణాన్ని—యీ సంస్థ 1961 జూన్‌నుంచి విజయవాడలో యే విధమైన ఆటంకము లేకుండా పని చేయుటకు వీలుగా—పూర్తిచేయడం తప్పనిసరి అయినది."

నాగార్జునసాగర్

కేంద్ర నీటి పారుదల శాఖామంత్రి మాట ప్రకారం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు తొలిదశ నిర్వహణ చతుర్ధ పంచవర్ష ప్రణాళిక మధ్య కాలంవరకు వాయిదా పడవచ్చునని కొన్ని వార్తా పత్రికలలో ప్రచురితమైన వార్తను ఖండించుటకై ప్రభుత్వం ఒక పత్రికా ప్రకటనను చేస్తూ, కేంద్ర మంత్రి అటువంటి ప్రకటనను పార్లమెంటులో చేయడంగాని పత్రికా విలేఖరులకు చెప్పడంగాని జరుగలేదనీ, యీ విషయంలో రాష్ట్రప్రభుత్వానికి కూడా ఆయన యేమీ వ్రాయలేదని వివరించినది.

ఆ పత్రికా ప్రకటనలోని అంశాలు యివి. "సొమ్ము అందుబాటును బట్టి, నిర్ణయం ప్రకారం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు తొలి అంచె 1964 నాటికి పూర్తి కాగలదని భావించబడుతున్నది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు తొలి అంచె తప్పక నిర్వహించ వలసిన అంశము. కృష్ణా-గోదావరీ జలాల వివాదం వల్ల దాని పనికేమీ ఆటంకం రాదు."

స్కాలర్ షిప్‌లు

దేశంలో వికలాంగుల విద్యా సంస్థలతో సహా ప్రాథమిక సెకండరీ పాఠశాలల్లో పనిచేసే అధ్యాపకుల పని ప్రాముఖ్యం దృష్ట్యా, వారి పిల్లలలో ప్రతిభావంతులకు విద్య నభ్యసించడానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయదలచింది. తదనుగుణంగా

అటువంటి అధ్యాపకుల సంతానంలో మేధావులు ఉన్నత విద్య బడయటానికి స్కాలర్ షిప్పులను మంజూరు చేసే పథకం ఒకటి తృతీయ ప్రణాళికలో చేర్చటం జరిగింది. ఈ స్కాలర్ షిప్పులను ఏటా పాఠశాల వదిలే పరీక్షల మార్కులు ఆధారంగా మంజూరు చేస్తారు.

1961-62 విద్యా సంవత్సరంలో మంజూరు చేయటానికి దరఖాస్తులు ఇప్పుడు కోరబడుతున్నవి. దరఖాస్తు ఫారాలను హైదరాబాదులోని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయం నుండి పొందవచ్చు.

విద్యా రాయతీలు

రాజకీయ బాధితుల పిల్లలు, మనుమలకు విద్యా రాయతీల మంజూరీకి సంబంధించి లోగడ ప్రకటించిన పథకాల ననుసరించి విద్యా సౌకర్యాల కొరకు దాఖలు చేసెడి దరఖాస్తులతో పాటు, విద్యార్థి తండ్రి, తాత రాజకీయ బాధితుడు అయినట్లు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడినుంచి పొందిన సర్టిఫికెట్టును జతపరచవలెను.

ప్రభుత్వం ఇప్పుడు యీ నిబంధనను సవరించి, రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడికి మారుగా కార్యదర్శి ఈ సర్టిఫికెట్లను తన సంతకంతో జారీ చేయడానికి వీలు కల్పించింది.

సాంఘిక సంక్షేమ సలహా సంఘం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా సంఘాన్ని 26 మంది సభ్యులతో ప్రభుత్వం పునర్నిర్మాణం చేసింది. వారు25-5-1961 నుంచి 3 సంవత్సరాలు పదవిలో వుంటారు. సాంఘిక సంక్షేమ మంత్రి యీ సంఘం అధ్యక్షులుగాను సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరు ఎక్స్ అఫీషియో కార్యదర్శిగాను వుంటారు.

సహాయక చర్యలు

అనావృష్టి పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నందుకు తూర్పు గోదావరి జిల్లాలో మాగాణి, మెట్టభూములు రెండిటికి 1370 ఫసలీకి సంబంధించిన శిస్తు మాఫీని ప్రభుత్వం వుత్తర్వు చేసినది.

అనావృష్టివల్ల దెబ్బతిన్న ప్రాంతాలు యివి:

1. పెద్దాపురం తాలూకా, 2. ప్రత్తిపాడు తాలూకా, 3. పిఠాపురం తాలూకా, 4. ఎల్లవరం తాలూకా, 5. తునితాలూకా 6. రాజమండ్రి తాలూకాలోని 37 గ్రామాలు.

వన్యమృగ సంరక్షణ సలహా సంఘం

వన్యమృగ సంరక్షణ సలహా సంఘం ఉపాధ్యక్షునిగా ప్రిన్స్ నవాబ్ ముకర్రంజా బహదూర్‌ను ప్రభుత్వం నియమించింది.

ఈ సలహా సంఘం అనధికార సభ్యుల సంఖ్య ఐదు నుంచి ఆరుకు హెచ్చించబడినది కూడా.

తెలుగు తరగతులు

తెలంగాణాలోని 9 జిల్లాలలోను తెలుగురాని ప్రభుత్వోద్యోగులను తెలుగు నేర్చుకోవడానికి ప్రోత్సహించుటకై ప్రధమంలో, తక్షణం తెలంగాణా జిల్లాలలో తాలూకా ముఖ్యకార్యాలయ స్థానాలలో తెలుగుశిక్షణా తరగతులను నడపాలని ప్రభుత్వం ఆదేశించినది.

హైదరాబాదు నగరం తప్ప తెలంగాణా అన్ని జిల్లాలలోని తాలూకా కార్యాలయ స్థలాల్లో 81 కేంద్రాలు నడుపబడుతవి. తెలుగురాని వారి సంఖ్య పదికంటె తక్కువ వున్నచోట తరగతులు నెరపటం అంటూ వుండదు. ప్రతి తరగతి స్థానిక పాఠశాలలోగాని లేదా జిల్లా విద్యాశాఖాధికారి, అందుకు సంబంధించిన తాసీల్దారు నిర్ణయించిన అనువయిన స్థలంలోగాని యేర్పాటు కాగలదు. శిక్షణ కాలం ఒక సంవత్సరం. శిక్షణ వేసవి సెలవులలో, 1961 మే నుంచి ఆరంభమవుతుంది. రోజు విడిచి రోజు పగలు 4-30 గంటలకు ఆరంభమయే తరగతులు వారానికి మూడు గంటలు నడుస్తవి.

శిక్షణా కోర్సు ఆఖరున విద్యాశాఖ డైరెక్టరు ఒక పరీక్ష పెట్టి, అందులో ఉత్తీర్ణులయిన వారికి సర్టిఫికెట్లు ఇస్తారు. ప్రధమ ప్రయత్నంలోనే 60 శాతం మార్కులకు పైగా తెచ్చుకున్న శిక్షితులకి రూ. 100ల బహుమతి ఇస్తారు. ఆతరువాత క్రమంలో ప్రతిభ వెల్లడించిన ముగ్గురికి రూ. 50ల చొప్పున బహుమతులు లభిస్తాయి. ప్రతిభ క్రమాన్ని బట్టి ప్రధమ బహుమతి ఒకటి, 3 ఇతర బహుమతులు ఒక్కొక్క జిల్లాకు మొత్తం నాలుగు కేటాయించబడుతవి.

రిపబ్లిక్ దినోత్సవం నాటి దీపాలంకరణ

1961 రిపబ్లిక్ దినోత్సవం నాటి రాత్రి అత్యంత సుందరంగా దీపాలంకరణ చేసినందుకు సికింద్రాబాదులోని ప్రాగాటూల్స్ కార్పొరేషనుకు ప్రథమ బహుమతిగా రూ. 150 లనూ; హైద్రాబాదులోని నియో మైసూర్ కేఫ్‌కు రూ. 100 ల ద్వితీయ బహుమతిని ప్రభుత్వం బహూకరించింది.

—

ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమి

ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ వ్యవస్థకు ఒక సవరణను ప్రతిపాదించి, సాధారణ సంఘం, కార్యనిర్వాహక వర్గం సభ్యుల సంఖ్యను తగ్గించింది. సాధారణ సంఘానికి 31 మంది సభ్యులను; కార్యనిర్వాహక వర్గానికి 9 మంది సభ్యులను నియమించింది. రెండవదాని అధ్యక్ష, కార్యదర్శులు వరుసగా శ్రీ ఎన్. నరోత్తమరెడ్డి, శ్రీ ఎల్. ఎన్. గుప్తా, ఐ. ఏ. ఎస్. గార్లు అయివున్నారు.

—

ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ల పరీక్ష

1957 నవంబరులో జరిగిన సమావేశంలో కేంద్ర విద్యుచ్ఛక్తిబోర్డు అంతర్‌రాష్ట్ర పరిగణనకు సూచించిన నమూనా సిలబసు ప్రకారం సూపర్‌వైజర్ల పరీక్షల సిలబసును సవరించి రూపొందించిన 1960 ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్య ఆమోదించినది. ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లకు, ఎలక్ట్రిషియన్లకు, వైర్‌మన్‌లకు పరీక్షలను ఈ సంవత్సరాంతంలో లైసెన్సింగ్‌బోర్డు నిర్వహించ దలచింది.

—

హెచ్చరిక

ఉత్పత్తిదార్లకు, అమ్మకం దార్లకు, మరమ్మతుదార్లకూ రాష్ట్ర తూకాలు, కొలమానాల శాఖ లైసెన్సులు జారీ చేస్తుందని వ్యాపారస్థులకు ఎరుకపరచడ మయినది. తూకాలు, కొలమానాల చట్టం దాని క్రింద నిబంధనలను అమలు పరచడానికి ఇన్‌స్పెక్టర్లు నియమింపబడినారు. ధృవపరుపబడిన ఫోటోలు అంటించిన గుర్తు కార్డులు అందరు ఇన్‌స్పెక్టర్లకు, అమ్మకందార్లకు, మరమ్మతు చేసే వాళ్ళకూ కూడ ఇవ్వబడినవి. కాబట్టి ఏదైనా మరమ్మతు పని అప్పగించే ముందు గానీ, తూకాలు కొలమానాల సప్లయికి అడ్వాన్సు చెల్లించేటప్పుడుగానీ ముందుగా వాళ్ళ గుర్తుకార్డులు చూపమని అడిగి, ఇనస్పెక్టర్లమని, లైసెన్సులుగల వ్యాపారస్థులమని పేరుపెట్టుకొని అడ్వాన్సులు వగైరాల క్రింద పెద్ద మొత్తాలను కాజేస్తున్నారని చెప్పబడుతున్న మోసగాండ్రుకారని ధృవ పరచుకోవాలని వ్యాపారస్థులను కోరడమవుతున్నది. సందేహాస్పదులైన వారిని గురించి సమీపంలోని పోలీసు స్టేషనుకు తెలియ పరచవచ్చు.

—

వెన్న, నెయ్యిపై అమ్మకం పన్ను

వెన్న, నెయ్యి వర్తకులు. సంవత్సరానికి రూ. 20,000లకు మించని వ్యాపారంగల వారు ప్రతి సంవత్సరానికి క్రింది విధంగా అమ్మకం పన్ను చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. వ్యాపారం 5 వేలకు మించకపోతే అసలు పన్ను వుండదు వ్యాపారం 5 వేలకు మించి 12,000ల రూపాయలకు లోపున వుంటే రు. 100లు వ్యాపారం రు. 12,500 లకు మించి రూ. 20,000లకు మించకుండా వుంటే రు. 150 లు.

—

సిమెంటు అమ్మకం

ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పడిన సిమెంటు కొరత పరిస్థితిని స్వప్రయోజనానికి వినియోగించుకొనజూచే అక్రమ వర్తకులను ప్రోత్సహించవద్దని యావన్మందికి విజ్ఞప్తి చేయబడుతున్నది. అసోసియేటెడ్ సిమెంటు కంపెనీ సిమెంటు కావల్సినవారు, సికింద్రాబాదు రాష్ట్రపతి రోడ్డు 66 ఎ. లోని సిమెంటు మార్కెటింగ్ కంపెనీకి దరఖాస్తులు ఇవ్వవచ్చు. ఆంధ్ర సిమెంటు కంపెనీ, పాణ్యం సిమెంటు కంపెనీల సరుకును విక్రయించడానికై ఉభయ నగరాలలో నమోదైన విక్రేతలు ఉన్నారు. వీరి పేర్లను తెలిపే జాబితాలను కంట్రోలు సరుకుల డైరెక్టరు కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చును. ఈ దుకాణాల నుంచి ఎట్టి అనుమతి పత్రం లేకుండా సిమెంటు కొనుక్కోవచ్చును.

—

గృహాల కేటాయింపు సలహా సంఘం

ఖమ్మం తక్కువ రాబడి వర్గాల గృహవసతి పథకం కేటాయింపు సలహా సంఘం పదవీకాలం 18-12-60తో సమాప్తమైనది. ప్రభుత్వం, ఆ సంఘం కొనసాగాలని ఆదేశిస్తూ వెనుకటి సభ్యులనే మళ్ళీ మూడు సంవత్సరాలకు పునర్నియమించినది.

—

భూముల పంపిణీ

ప్రభుత్వ బంజర్ల పంపిణీ సమస్యను పునఃపరిశీలించిన పిమ్మట, హరిజనులకు, గిరిజనులకు, హరిజన్ క్రిష్టియన్లకు,

తదితర వెనుకబడిన తరగతులకు ముందు ప్రాధాన్యం యివ్వాలనీ, సాగుకై యిచ్చే యీ భూముల పంపిణీ కాలం 31-12-61 వరకు పొడిగించాలనీ ప్రభుత్వం వుత్తర్వు చేసినది. ప్రాజెక్టుల వల్ల మార్పులు చెందిన భూముల విషయంలో, ప్రాజెక్టుల క్రింది భూములు, కాలువల దారి నిర్ణయం, పునరావాసపు పనులు పూర్తి అయిన చోట్ల నిబంధనల ననుసరించి యివ్వాలని ప్రభుత్వం ఆదేశించినది. నిర్మాణంలో నున్న ప్రాజెక్టుల క్రింద లేక తృతీయ ప్రణాళికలో తథ్యంగా చేపట్టబడే ప్రాజెక్టుల క్రిందగల భూముల విషయంలో మాత్రమే సాగు కివ్వకూడదు అనే నిషేధం వర్తించాలి. కేవలం ఆలోచనలో నున్న ప్రాజెక్టులు, నిర్మాణం జరుగుతుందో జరుగదో నిశ్చయంగా తెలియని ప్రాజెక్టుల క్రిందిభూముల పంపిణీపై నిషేధం వుండరాదు.

శిస్తు బకాయిలు

భూమిశిస్తు బకాయిల విషయంలో, కొన్ని వార్తా పత్రికలలో ప్రచురితమైన పొరబాటు వార్తను ఖండిస్తూ ప్రభుత్వం, ఒక పత్రికా ప్రకటనలో, సరైన పరిస్థితిని దిగువ విధంగా వివరించినది.

"మొత్తం భూమిశిస్తు బకాయిలు రూ. 9.25 కోట్లు. అంతే కాని ఆ వార్తలో చెప్పినట్టు రూ. 26 కోట్లు కాదు. ఈ సొమ్మంతయినా, (బకాయిలు) కొట్టివేయాలనే ప్రతిపాదనలేమీ లేవు. క్రితం సంవత్సరం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల, రాష్ట్రంలో అనావృష్టికి గురైన కొన్ని ప్రాంతాలలో బకాయిల వసూళ్ళను ప్రభుత్వం వాయిదా వేసినది. మిగిలిన సొమ్ము మామూలు పద్ధతిలో వసూలు చేయబడుతుంది.

"రెవెన్యూబోర్డును రద్దుచేయాలనే ప్రతిపాదనను, బకాయిలు వసూలు కానందున వాయిదా వేశారనే మాట కూడ పూర్తిగా తప్పు. రెవెన్యూబోర్డు రద్దు విషయం యిప్పుడు ప్రభుత్వ పరిశీలనలో లేదు"

హైదరాబాదు కార్పొరేషన్

మునిసిపలు పరిపాలనకు సంబంధించిన సాధారణ విషయాలనేమి, కార్పొరేషన్‌లో అపరిష్కృతంగా వున్న వ్యక్తిగతమైన కేసులు యే దశలో నున్నవో తెలుసుకొనుటకేమి ప్రజలకు వీలు కలిగించుటకై, హైదరాబాదు కార్పొరేషన్ పౌర సంబంధాల కార్యాలయంలో దర్యాప్తులవిభాగమొకటి, 12-6-61 నుంచి యేర్పాటు చేయబడినది పౌరుల నుంచి, భవన నిర్మాణపు పెర్మిట్లు, లేయవుట్లు, లైసెన్సులు, పన్నులకు సంబంధించిన విషయాలు, వుద్యోగాలకై రిజిస్ట్రేషను మున్నగు వాటికి సంబంధించిన దరఖాస్తులను తీసుకొనుటకు కూడ యీ విభాగంలో యేర్పాట్లు చేయబడినవి.

రచయితలు

1. శ్రీ కోనవేంకట రాయశర్మ— "విమర్శక శిరోమణి", "సాహిత్య విశారద"—బాపట్ల.
2. "నవ్యశ్రీ"—(శ్రీ ఆదిపూడి వెంకటరావు)విజయనగరం
3. శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయరావు, రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో తెలుగు సహాయోపన్యాసకులు.
4. శ్రీ పోచిరాజు శేషగిరిరావు, తెలుగు పండితులు, బహూశార్థ సాధకోన్నత పాఠశాల, సామర్లకోట,
5. శ్రీ బి. వి. రమణారావు, బర్కత్‌పుర, హైదరాబాదు.
6. శ్రీ ఇందుపల్లి సత్యవర్ధనరావు, బంటుమిల్లి, కృష్ణాజిల్లా.
7. శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి, విజయవాడ.
8. శ్రీ కమ్మిశెట్టి వేంకటేశ్వరరావు, జంగంరెడ్డి పాలెం, కందుకూరు తాలూకా, నెల్లూరు జిల్లా.
9. "బుచ్చిబాబు", ఆకాశవాణి, పూనా.
10. శ్రీ యస్. ఏ. ఖాదర్, ఐ. ఎ. యస్., ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్మాణశాఖ కార్యదర్శి.
11. "ఓల్డ్‌టైమర్"—హైదరాబాదు.
12. "సత్యశ్రీ"—పెదపాలెం, తెనాలి.

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో:

21-5-61

రాష్ట్రమంతటా శ్రీ ప్రకాశం పంతులుగారి వార్షికం పాటింపబడినది. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రసంగించిన సభలో వారి సేవా త్యాగాలు ప్రస్తుతింపబడినవి.

22-5-61

గుల్హాతీ కమిషన్ నియామకం వల్ల యిదివరకే మంజూరైన ప్రాజెక్టుల అమలుకు ఆటంకం కలుగదని ప్రధాన మంత్రి పా. సభ్యురాలు డా. కె. అచ్చమాంబకు వ్రాసిన లేఖలో పేర్కొన్నారు.

25-5-61

ప్రభుత్వానికి, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు మధ్య సన్నిహిత సహకారం సాధించుటకై ప్రభుత్వం రాష్ట్ర సమిష్టి సిబ్బంది సంఘాన్ని యేర్పాటు చేసినది. ఈ సంఘం జూలై 1 నుంచి పని ప్రారంభిస్తుంది.

27-5-61

మెదక్ జిల్లా సిద్దిపేటలో ముఖ్యమంత్రి పూర్వ విస్తరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన భూములు లేని వారికి పట్టాలు కూడా పంచిపెట్టారు.

28-5-61

గుల్హాతీ కమిషన్ నియామకం పట్ల నిరసన తెలుపుటకై శ్రీ తెన్నేటి విశ్వనాథం అధ్యక్షతన విజయవాడలో అఖిల పక్ష సమావేశం జరిగినది.

29-5-61

ఈ రోజు వెలుబడిన ప్రభుత్వ ప్రకటన ప్రకారం వుయ్యూరులోని పాలీటెక్నిక్‌ను విజయవాడలోని దాని శాశ్వత భవనాలకు తరలించడం పూర్తి అయినది.

30-5-61

పంచాయతీల చట్టాన్ని రాష్ట్రపు గిరిజన ప్రాంతాలకు కూడ వర్తింపచేయాలని ప్రభుత్వం నిర్ణయించినది. ఆ ప్రాంతాల బ్లాకులలో 17 మంది డివిజనల్ పంచాయతీ అధికారులు నియమింపబడ్డారు.

31-5-61

గుల్హాతీ కమిషన్ నియామకం కారణంగా, మంజూరైనయే ప్రాజెక్టు పనిని నిలిపి వుంచాలని కేంద్ర ప్రభుత్వం తలచలేదని కేంద్ర నీటి పారుదల, విద్యుచ్ఛక్తి శాఖా మంత్రి రాష్ట్ర శాసనసభ స్వతంత్ర సభ్యునికి అందజేసిన వార్తలో తెలిపారు.

1-6-61

అవాంఛనీయ (యెల్లో) మైన పత్రికా రచనను అణచివేయుట కేర్పడిన బిల్లు గెజిట్‌లో ప్రకటింపబడినది.

2-6-61

ప్రభుత్వానికి అప్పగించబడిన మిగులు భూములు యేచట్టం ప్రకారం భూములు లేని పేదవారికి పంపిణీ చేయబడతవో ఆ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమతాల గరిష్ఠ ప్రమాణ చట్టం గెజిట్‌లో ప్రకటించబడినది.

3-6-61

గ్రామాధికారుల వేతనాలు, వుద్యోగ పరిస్థితుల సమస్య పరిశీలనకై ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో ఒక సంఘాన్ని నియమించినది.

4-6-61

హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి అఖిలభారత మునిరాజ పనివారి సమావేశాన్ని ప్రారంభించారు.

5-6-61

ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొన్న కారణంగా, యిటీవలి సంవత్సరాలలో రాష్ట్రంలో ముఖ్యంగా నగరంలో శాంతి, భద్రతల పరిస్థితి బాగా మెరుగయినదని హోంమంత్రి శ్రీ ఎమ్. నర్సింగరావు ప్రకటించారు.

7–6–61

యాజమాన్యంలో కార్మికులు పాల్గొనే సూత్రం పై ప్రేటు, ప్రభుత్వ విభాగాలు రెండిటిలోను ఒకేసారి ప్రవేశపెట్టబడగలదని కార్మిక శాఖా మంత్రి శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

8–6–61

విద్యాశాఖా మంత్రి శ్రీ ఎస్. బి. పి. పట్టాభిరామారావు అధ్యక్షుడుగా 8 మంది సభ్యులు గల మోతీలాల్ నెహ్రూ జాతీయ ఐకమత్య సంఘం ఏర్పాటయినది.

9–6–61

రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో, సాధ్యమైనంతవరకు మద్యనిషేధ విధానాన్ని, అభివృద్ధి వేగానికి తగినట్లు, కేంద్ర ప్రభుత్వం బలపరచగలదని, హైదరాబాద్‌లో, దేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో (స్టేట్‌కి సంబంధించిన) కేంద్ర మంత్రి, అఖిల భారత మద్య నిషేధ సలహా సంఘం అధ్యక్షులు అయిన శ్రీ బి.ఎన్. దతార్ ప్రకటించారు.

1961–62 విద్యా సంవత్సరంలో ఆంధ్ర ప్రాంతంలో వైద్యంలో ప్రీ ప్రొఫెషనల్ కోర్సు, ఎమ్.బి. అండ్ బి.ఎస్. తొలి సంవత్సరం. కోర్సులలో ప్రవేశానికి సంబంధించిన నిబంధనలను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు చేసినది.

11–6–61

శాసన మండలి అధ్యక్షుడు శ్రీ ఎమ్. హనుమంతరావు సికింద్రాబాద్‌లోని బన్సీలాల్‌పేట గుడిసెల కాలనీలో రెండవ మేయరు శిబిరాన్ని ప్రారంభించారు.

12–6–61

విద్యా శాఖ ప్రతినిధి మాటప్రకారం, రాష్ట్రంలో యీ విద్యా సంవత్సరం నుంచి మరి మూడు పాలిటెక్నిక్‌లు పని ప్రారంభిస్తాయి. ఈ మూడిటిలోను రెండు ప్రభుత్వానివి–ఒకటి కాకినాడలో బాలికల నిమిత్తము, రెండవది శ్రీకాకుళంలో బాలుల నిమిత్తము నడుస్తవి. మూడవది ప్రత్యేకం బాలికలది.

13–6–61

రాష్ట్రంలో ఆరోగ్యం పన్నును విధించాలని ప్రభుత్వం సంకల్పించినదనీ, శాసన సభల వచ్చే బడ్జెట్ సమావేశంలో యిందుకవసరమైన శాసనం ప్రవేశపెట్టబడగలదనీ శ్రీకాకుళంలో ఆరోగ్య మంత్రి సూచించారు.

14–6–61

హైదరాబాద్, సికిందరాబాద్ నగరాలను రమణీయంగా చేయుటకై ప్రభుత్వం ఒక "ల్యాండ్ స్కేప్" సంఘాన్ని నియమించినది.

15–6–61

శా.మం.స.డా.ఎ.ఎల్. నారాయణ ఆంధ్ర విశ్వవిద్యాలయపు వుపాధ్యక్షుడుగా నియమించబడ్డారు.

17–6–61

కేరళ గవర్నర్ శ్రీ వి.వి. గిరి, హైదరాబాదులో, ఆంధ్ర ప్రదేశ్ కార్మిక గోష్ఠిని ప్రారంభించారు.

18–6–61

మాచెర్ల సిమెంటు ఫ్యాక్టరీకి ప్రత్యేక బొగ్గు సరఫరాలను పురికించమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుటకు నాగార్జునసాగర్ కంట్రోల్ బోర్డు నిర్ణయించినది. ఈ ఫ్యాక్టరీ మూతపడినందున ప్రాజెక్టు పనికి తగినంత సిమెంటు సరఫరా కానందున యీ నిర్ణయం గైకొనబడినది.

19–6–61

మూడు రోజులు జరిగే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయ సమావేశం భువనగిరిలో ఆరంభమైనది.

20–6–61

పూర్వం లేబర్ కమిషనరుగా పనిచేసిన శ్రీ ఎన్.కె. గురుస్వామి అధ్యక్షుడుగా, హైదరాబాదులో, పారిశ్రామిక సంబంధాల సంస్థ ఒకటి యేర్పాటు చేయబడినది.

దేశంలో:

23–5–61

జాతీయ యేకీకరణ సంఘం నివేదిక నేడు విడుదలయినది. దానిలో చేయబడిన ముఖ్య ప్రతిపాదనలలో యివి కలవు : మత కలహాల సందర్భంలో ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం వర్తింపు, పుమ్మడి జుల్మానాల విధింపు.

24–5–61

"డివిజిబుల్‌పూల్" లో రాష్ట్రాల వాటా హెచ్చింపును తాము సిఫార్సు చేయబోమని తృతీయ ఆర్థిక సంఘం అధ్యక్షుడు కలకత్తాలో సూచించారు.

26–5–61

తృతీయ ప్రణాళిక కనీస విదేశ ద్రవ్య అవసరాలను తెలుపుతూ కేంద్ర ఆర్థిక మంత్రి "ఎయిడ్ ఇండియా క్లబ్" సభ్య దేశాలకు వ్రాశారు.

1–6–61

తృతీయ ప్రణాళికలో రూ 10,400 కోట్ల పెట్టుబడి కార్యక్రమానికి జాతీయ అభివృద్ధి సంఘం ఆమోద ముద్ర వేసినది.

6-6-61

బంజరు భూమి వినియోగాదులపై నియమింపబడిన ఉప్పల్ సంఘం, ఆంధ్రప్రదేశ్‌లో బాగుకై లభ్యమయ్యే మొత్తం భూమి 1,89,000 యెకరాలలోను 1,37,710 యెకరాలను మాత్రమే బాగుకై తీసుకొనవచ్చునని సూచించినది.

10-6-61

అల్ప సంఖ్యాక వర్గాల సమావేశాన్ని యేర్పరచి, వారి ఇబ్బందులను నివారించి, చీలికలు తెచ్చే శక్తుల నరికట్టుటకు కఠిన వైఖరిని అవలంబించాలని భారతీయ ముస్లిముల న్యూఢిల్లీ సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ డా. సయ్యద్ మహమ్మద్ ప్రభుత్వాన్ని కోరారు.

14-6-61

నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ డైరెక్టర్ డా. కె.ఎస్.కృష్ణన్ దివంగతులయారు.

16-6-61

ఉత్కళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీ బిజు పట్నాయక్ కొత్త ఒరిస్సా శాసనసభలో 82 మంది సభ్యులు గల కాంగ్రెస్ పార్టీకి నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

కాకలు తీరిన 'ఆంధ్ర పత్రికా' రచయిత శ్రీ ఖాసా సుబ్బారావు మద్రాస్‌లో పరమపదించారు.

విదేశాలలో

3-6-61

అతిముఖ్యమైన ప్రపంచ సమస్యల చర్యకై, వియెన్నాలో ప్రెసిడెంట్ కెన్నెడీ, ప్రధాని కృశ్చేవ్‌లు సమావేశమయ్యారు.

లేఖలు

పత్రిక అన్ని విధాలా ఆకర్షణీయంగా ప్రయోజనాత్మకంగా ఉన్నది. సర్వాంగ సుందరమైన మీ "ఆంధ్రప్రదేశ్" ఆంధ్రప్రదేశ్‌కు సాంస్కృతికంగానూ సాహిత్యకంగానూ ఎంతో అభ్యుదయం సంపాదిస్తుందని ఆశిస్తున్నాను.

'కరుణశ్రీ'
గుంటూరు.

* * *

నెల నెలకు క్రొత్త క్రొత్త అందములను సంతరించుకొనుచున్నది. ప్రచార పత్రికగానే గాక ప్రబోధ పత్రికగా కూడా తయారగుచున్నది. ప్రభుత్వ ప్రణాళికలకే గాక పండిత కవుల సాహిత్యమునకు గూడ స్థానమిచ్చుచున్నది. ఆంధ్రులు పత్రికలను పదిలపరచుకొని పఠింపదగిన సంస్కృతి లభించుచున్నది.

అవ్వారి వెంకటరామయ్య,
నర్సరావుపేట.

* * *

ఆంధ్రప్రదేశ్ సౌభాగ్య యశస్సులతోబాటు మీ పత్రికయూ క్షణ క్షణాభివృద్ధి యగు గావుతమని కోరుచున్నాను.

పి. సి. నరసింహశర్మ,
పెనగలూరు.

ఆంధ్రప్రదేశ్ సంచిక ద్వారా ప్రాచీన చరిత్రను వెలువరించమని కోరుటకు కుతూహల పడుచున్నాను. ప్రాచీన నగరములు, వాని ప్రాభవము, ప్రాచీనాంధ్ర రాజుల చరిత్ర, రాజధానులు, పాలెగాళ్ళ పరిపాలన, ఓడరేవుల ప్రాముఖ్యము, ఆంధ్ర రాజుల బౌద్ధ కళాపోషణ, ఆంధ్రకవులు, ప్రసిద్ధ మహాపురుషులు, ఇత్యాది యీ సంచిక ద్వారా పాఠకలోకమునకు అందజేసిన ప్రతి ఆంధ్రుడు తమ నిజ చరిత్రను నాగరికతను తెలుసుకొన్న వలనుపడును.

* * *

కె. వెంకటాచారి.
వైదన, గుంటూరు జిల్లా.

తెలుగు సాహితీ క్షేత్రమునుండి ఏర్చి కూర్చిన మేలి పంటనే ప్రకటించుట ముదావహము; గుణప్రధానముగనే మీరిది నిర్వహించుచుండుట ప్రశస్త్యము.

పోచిరాజు శేషగిరిరావు,
సామర్లకోట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	...	...	1,06,041 చదరపు మైళ్ళు
జనసంఖ్య	...	...	35,977,999*
పురుషులు	...	...	18,175,349*
స్త్రీలు	...	...	17,802,650*
సగటు వర్షపాతం	...	...	35.65"
అరణ్య ప్రదేశం	...	...	1,40 26,000
జిల్లాలు	...	...	20
తాలూకాలు	...	...	183
రెవిన్యూ సర్కిళ్లు	...	...	1,000
పట్టణాలు	...	...	293
గ్రామాలు	...	...	26,450
పంటలక్రింది ప్రదేశం	...	...	2,93,81,000 ఎకరాలు
కౌళ్ళ సంఖ్య	...	...	42 42,655
1958-59 లో పారుదలను పొందిన ప్రదేశం		...	68 లక్షల ఎకరాలు
1958-59 లో ఉత్పత్తి అయిన ఆహారధాన్యాలు		...	6.156 లక్షల టన్నులు
పాల ఉత్పత్తి	...	...	15.5 లక్షల గాలన్లు
రైలు మార్గాలు	...	...	3009 13 మైళ్ళు
జాతీయ రహదార్లు	...	...	1,415 ,,
రాష్ట్ర రహదార్లు	...	...	3593 ,,
జిల్లా పెద్ద రోడ్లు	...	...	8220 ,,
జిల్లా ఇతర రోడ్లు	...	...	2852 ,,
గ్రామాల రోడ్లు	...	...	3442 ,,
పాఠశాలలు	...	...	34,157
కళాశాలలు	...	...	69
వృత్తి విద్యా కళాశాలలు	...	...	36
తృతీయ పంచవర్ష ప్రణాళిక ప్రమాణం		రూ.	305 కోట్లు

1961-62 బడ్జెటు:

ఆదాయం	...	రూ.	85.12 కోట్లు
వ్యయం	...	... ,,	87.62 ,,
పెటుబడి ఖర్చు	...	... ,,	34.55 ,,

*(1961 జనాభా లెక్కల తాత్కాలిక వివరాల ప్రకారం)

